# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

అక్టోబర్ - 2017

సంపుటి- 43 సంచిక : 10



**సంపాదక వర్గం**

ఎన్.కుమార్ రాజా
ప్రధాన సంపాదకులు

ఐ.వెంకటేశ్వరరావు

పి.బాబురెడ్డి

టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు

సిహెచ్.శ్రీహరి


**ఈ సంచికలో...**


| | |
|---|---|
| జాతీయం అంతర్జాతీయం | -04 |
| ఉపాధ్యాయుల హెూదా ఎక్కడ...? | -05 |
| మతములన్నీయు మాసిపోవును... | -07 |
| చూచి రాతలు - కంఠస్థాలు... | -09 |
| మున్సిపల్ టీచర్ల రాష్ట్ర సదస్సు | -11 |
| వెబ్ పోర్టల్‌పై.... | -12 |
| ప్రైవేటీకరణ సలహాలతో... | -13 |
| శిక్ష (ణ) - కథ | -15 |
| అసహనానికి పరాకాష్ట | -17 |
| గిరిజన సంక్షేమ టీచర్ల ... | -18 |
| ప్రశ్నోత్తరాలు | -19 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | -20 |
| ఉద్యమవార్తలు | -22 |
| ప్రభుత్వఉత్తర్వులు | -34 |



| | | |
|---|---|---|
| దశాబ్దిచందా : | ₹ | 1250-00 |
| 5 సం॥ చందా : | ₹ | 650-00 |
| సం॥ చందా : | ₹ | 150-00 |
| విడిప్రతి : | ₹ | 15-00 |

Union Bank Online
A/c No. 346402010025027
IFSC Code : UBINO534641



**ఐక్య ఉపాధ్యాయ**

యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520002

Ph.No. : 0866-2573763

Website: www.aputf.org

E-mail: ikyopadhyaya1975@gmail.com


# ఉపాధ్యాయ సాధికారిత సాధిద్దాం

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం ప్రతియేటా అక్టోబర్ 5న ఒక ప్రత్యేక నినాదంతో అన్ని దేశాలలో నిర్వహించబడుతుంది. బోధనలో స్వేచ్ఛ - ఉపాధ్యాయుల సాధికారం (Teaching in Freedom – Empowering Teachers) అనే నినాదంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవాలని యునెస్కో పిలుపునిచ్చింది. బాధ్యతయుత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే. పిల్లలను బడులకు రప్పించి, వారిని విజ్ఞాన వంతులుగా, సంస్కారవంతులుగా తీర్చిదిద్దడం తద్వారా సమాజాన్ని సమున్నతంగా ముందుకు తీసుకువెళ్ళేందుకు ఉపాధ్యాయులకు బోధనలో స్వేచ్ఛ అవసరం. వృత్తి భద్రత, ఉపాధ్యాయ హెూదా, సంక్షేమం, హక్కులు, విధాన నిర్ణయాల పాత్ర వంటి అంశాలు ఉపాధ్యాయ సాధికారతకు దారితీస్తాయి. అటువంటివి కల్పించబడాలనేది ఈ నినాదంలోని సారాంశం.

2011 నాటి లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 2 కోట్ల 88 లక్షల ప్రాథమిక ఉపాధ్యాయులు, 1 కోటి 72 లక్షల మాధ్యమిక ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని యునెస్కో గణాంకాల సంస్థ తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా 56 దేశాలు ప్రాథమిక ఉపాధ్యాయ, 86 దేశాలు మాధ్యమిక ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్నాయి. అందులో మన దేశం మినహాయింపుకాదు. మన దేశంలో విద్యాహక్కు చట్టం అమలుకై అదనంగా ఇంకా 5 లక్షలమంది ఉపాధ్యాయుల కొరత ఉన్నది. మన రాష్ట్రంలో ఇంకా లక్షమంది ఉపాధ్యాయులు అవసరం ఉన్నది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శుశిక్షుతులైన రెగ్యులర్ ఉపాధ్యాయుల స్థానే అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను, పార్ట్‌టైమ్, కాంట్రాక్టు ఉపాధ్యాయులను నియమిస్తున్నాయి. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల్లో కొందరు ఇంకా అన్‌ట్రైన్డ్‌గా ఉన్నారు. మిగిలిన వారికి తగిన విద్యా ప్రమాణాలతో వృత్యంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహించలేకపోవడం చూస్తున్నాం. ఉపాధ్యాయుల బోధనపరమైన స్వేచ్ఛను కల్పించకపోగా తరచూ అకడమిక్ క్యాలెండర్‌లో మార్పులు తెస్తూ, విద్యారంగంలో వింత ప్రయోగాలు చేస్తున్నారు.

సిలబస్‌లో పరీక్షా విధానంలో మార్పులు తెచ్చారు. ఫలితాలు లేని ట్రైనింగ్‌లు, టెలికాన్ఫరెన్స్ లు ఉపాధ్యాయుల్ని గందరగోళం చేస్తున్నాయి. ఫిబ్రవరి వరకు ఉన్న సిలబస నవంబర్, డిసెంబర్‌లోగా పూర్తిచేయాలి. పదవ తరగతిలో 100శాతం ఫలితాలు తప్పనిసరిగా రావాలి అని కలెక్టర్లు, డిఇఓలు పెడుతున్న ఒత్తిడి బోధనపైన, విద్యార్థులపైన తీవ్ర ప్రభావం చూపుతోంది.

పాఠశాలలో స్వేచ్ఛగా చదువు చెప్పకొనే పరిస్థితులుపోయి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసే పనులు ఎక్కువ అయ్యాయి. ఉపాధ్యాయ విద్యార్థి సంబంధాల అవసరమే లేదు. డిజిటల్ క్లాసులు ద్వార బోధన తెచ్చేందుకు పాలకులు పథకాలు సిద్ధం చేస్తున్నారు. సాంకేతికత పేరుతో ఉపాధ్యాయుని పాత్ర తగ్గిస్తున్నారు. విద్యా బోధన యాంత్రికంగా మారుతున్న రోజుల్లో "ఉపాధ్యాయుడు బోధనలో స్వేచ్ఛ" ఉండాలనే యునెస్కో పిలుపు మన పాలకులకు చేరాలని ఆశిద్దాం. దాన్ని అమలు చేసేందుకు మనం కృషి చేద్దాం.

ఉపాధ్యాయులకు వృత్తి భద్రత కల్పించడం, ఉపాధ్యాయుల హెూదా పెంచడం, విధాన నిర్ణయాలలో భాగస్వాములను చేయకుండా ప్రభుత్వ డొల్ల పాఠశాలలను ప్రభుత్వ ప్రైవేట్ పార్టనర్‌షిప్ క్రింద ప్రైవేట్‌కు అప్పజెప్పడం, ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య కుదించడం, డిటెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయడం, స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం తేవడం ఉపాధ్యాయ సాధికారిత మరింత సన్నగిల్లే పరిణామాలు.

బోధనలో స్వేచ్ఛలేకుండా, ఆర్థిక హెూదా, సాంఘిక హెూదా కల్పించకుండా ఉపాధ్యాయుల సాధికారిత ఎలా? అందుకే అందరు ఆలోచించాలి, చర్చించాలి. విద్యారంగం ముందుకొస్తున్న సరికొత్త సవాళ్ళు స్వీకరించేందుకు ఉపాధ్యాయుల సన్నద్ధులు కావాలి. ఉపాధ్యాయ సాధికారితకై పోరాడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి. విద్యారంగ వికాసానికి, ఉపాధ్యాయుల సాధికారతకు కలిసివచ్చే విశాల వేదికల్లో భాగస్వాములు కావాలి.

# జాతీయం అంతర్జాతీయం

## దేశంలో తగ్గుతున్న మహిళా ఉద్యోగులు

ఒకవైపు ప్రపంచంలో అనేక దేశాల్లో ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య పెరుగుతుండగా భారత్‌లో మాత్రం ఈ సంఖ్య నానాటికీ తగ్గుతోంది. 2015-16 సం॥లో చూస్తే పనిచేసే వయస్సువున్న మహిళల్లో కేవలం 27%మంది మాత్రమే మన దేశంలో ఉద్యోగాలలో వున్నారు. వెనక్కివెళ్ళి చూస్తే 2004-2005లో 43% ఉద్యోగాల్లో వుండగా 1993-94లో కూడా 43%గా ఈ సంఖ్య ఉంది. అంటే మహిళల ఉద్యోగిత మన దేశంలో రానురాను తగ్గిపోతుందన్న మాట. ప్రభుత్వం చెప్పే "మిరుమిట్లుగొలిపే అభివృద్ధి" మహిళలను మూలకు నెడుతోందా? అవునని గ్లోబల్ జెండర్ రిపోర్టు-2015 కూడా చెపుతోంది. ఈ రిపోర్టు ప్రకారం మహిళలకు ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాల వైపున 144 దేశాలను పరిశీలిస్తే భారత్ 136వ స్థానంలో వుంది. 2011లో మన దేశంలో జరిపిన జనగణన ప్రకారం ఉద్యోగం చేయగల వయస్సులో వున్న మహిళలు 5.8 కోట్లమంది ఉద్యోగాలు కోరుకొంటున్నట్లు తెలిపారు. ఇతర దేశాల వైపు చూస్తే చైనాలో 64%, అమెరికాలో 56% మహిళలు ఉద్యోగాల్లో వున్నారు.

## ప్రపంచశ్రేణి విశ్వ విద్యాలయాలు - మన దేశం

ప్రపంచంలో అత్యుత్తమ విశ్వ విద్యాలయాల జాబితాలో మన దేశానికి చెందిన ఒక్కగానొక్క విశ్వ విద్యాలయం కూడా లేకపోవడం బాధాకరం. ప్రపంచ విజ్ఞాన రంగంలో మన స్థానాన్ని ఇది తెలుపుతున్నది. మన విద్యావ్యవస్థ స్థితిని, విద్యపట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని కూడా తెలియజేస్తున్నది. అత్యుత్తమ 200 విశ్వ విద్యాలయాల్లో అమెరికావి 62, బ్రిటన్‌వి 31, జర్మనీ 20, నెదర్లాండ్స్ 13, ఆస్ట్రేలియా 8, చైనా 7, స్విడ్జర్లాండ్ 7, కెనడా 6, ఫ్రాన్స్ 6, స్వీడన్ 6, హాంకాంగ్ 5, బెల్జియం 4, దక్షిణకొరియా 4,... వీటిల్లో బ్రిటన్‌కు చెందిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ మొదటి స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో వున్న దేశాల్ని చూస్తే అవి గొప్ప ఆర్థిక శక్తులుగా ప్రపంచాన్ని ఎలా ఏలగలుగుతున్నాయో అవగతం అవుతుంది.

గ్లోబల్ హ్యూమన్ క్యాపిటల్ ఇండెక్స్‌లో కూడా ఉత్తమ విద్యా వ్యవస్థలు గల సర్వే, ఫిన్‌లాండ్ మొదటి స్థానాల్లో వుండడం, మన దేశం 103వ స్థానంలో వుండడం కూడా గమనించదగిందే. అభివృద్ధికి పునాది ఏమిటో ఇప్పటికైనా సమీక్షించుకోవల్సిందే!

## రాజస్థాన్‌లో రైతుల విజయం

మధ్యప్రదేశ్‌లో మాందసార్‌లో మొదలైన రైతుల పోరాటం మహారాష్ట్రకు విస్తరించి ఇప్పుడు రాజస్థాన్‌కు స్థంభింపచేసింది. కిసాన్ సభ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న రాజస్థాన్‌లో ప్రారంభమైన రైతుల పోరాటం 13 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా జరిగింది. 20 జిల్లాలను మునివేళ్ళమీద నిలబెట్టింది. "మహాపడావ్" (రోడ్లమీద, ఆఫీసుల ముందు అడ్డంగా కూర్చోవడం) పిలుపు తో రాష్ట్రంలో అంబులెన్స్‌లు తప్ప ఏవీ కదలని స్థితి ఏర్పడింది. ఈ పోరాటానికి అన్ని వర్గాల నుండి విశేష మద్దతు రావడంతో ప్రభుత్వం చర్చలకు దిగి వచ్చింది. రెండు రోజులపాటు ఏకబిగిన జరిగిన చర్చల్లో రైతులు కీలక డిమాండ్లు సాధించుకొన్నారు. (1) ₹ 50,000 వరకు ఋణమాఫీ (2) స్వామినాధన్ కమిటీ సిఫార్సులు (కనీస మద్దతు ధర తదితరాలు) అమలుకు కేంద్రానికి లేఖ రాయడం (3) డ్రిప్ ఇరిగేషన్ విద్యుత్ చార్జీలు తగ్గించడం (4) పశువులను అమ్ముకోవడంలో ఆంక్షలు తొలగించడం (5) 60 ఏళ్ళ దాటిన వ్యవసాయ కార్మికులకు, రైతులకు నెలకు ₹ 5,000 పెన్షన్ మంజూరు లాంటివి ఉన్నాయి.



ప్రభుత్వ విధానాల ఫలితంగా ఏర్పడిన వ్యవసాయ సంక్షోభం రైతుల్ని తమ సహజచిత్తమైన శాంత స్వభావంతో వుండనీయలేదు. పోరాట అనివార్యతను ముందుకు తెచ్చింది.

## బ్రిటన్‌లో ఉపాధ్యాయ సంఘాల ఏకీకరణ

టీచర్లు, లెక్చరర్లతో కూడిన రెండు పెద్ద ఉపాధ్యాయ సంఘాలు ATL, NUT విలీనం అయ్యాయి. 4,50,000మంది సభ్యులతో అతి పెద్ద "నేషనల్ ఎడ్యుకేషన్ యూనియన్" అవతరించింది. ఉపాధ్యాయులపై నానాటికీ పెరుగుతున్న పనిభారం తగ్గింపు, బడ్జెట్‌లో విద్యా కేటాయింపుల పెరుగుదల తదితర విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఒక బలమైన శక్తిగా ఏర్పడాల్సిన అవసరతలోంచి ఈ విలీనం జరిగింది. ATL సంఘానికి విస్తృతంగా వివిధ కేడర్ల ఉపాధ్యాయ సభ్యత్వం వుండగా, NUT సంఘానికి విద్యాపాలసీ పట్ల, ప్రభుత్వాలతో చర్చల పట్ల విశేష అనుభవం వుంది. ఈ రెండు సంఘాలు కలవడం కార్పొరేటీకరణ చెందిన ప్రభుత్వానికి ఎదురు నిలువ గలిగే ఫలితాన్ని రాబట్టగలిగే స్థితి మెరుగుపడింది.

కార్పొరేట్ శక్తులు ఏకమవడం, సంఘాలు చీలిపోవడం నేడున్న వైరుధ్యం. దీనికి పరిష్కారం దిశగా బ్రిటన్ ఉపాధ్యాయ సంఘాలు అడుగేశాయి.

## నిరాశజనకంగా స్పెయిన్ విద్యా సంవత్సరం మొదలు

2008 ఆర్థిక సంక్షోభంతో స్పెయిన్‌లో మొదలైన విద్యా బడ్జెట్ కోతలు ఈ సంవత్సరం కూడా కొనసాగుతున్నాయి. సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు తదితర విషయాల్లో ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాల పిల్లలు ఎన్నో ఇబ్బందులు పడాల్సివస్తోంది. గత సంవత్సరం రోజులుగా స్పెయిన్ ఆర్థిక స్థితి గాడిలో పడినా, పురోగతి మార్గం వైపుకు మళ్ళినా విద్యాబడ్జెట్ కేటాయింపులో ఏ మార్పులేదు. పాలక కన్జర్వేటివ్ పార్టీకి చిత్తశుద్ధి లేదనడానికి ఇదొక నిదర్శనం.

ప్రభుత్వం విద్యలో పెట్టే పెట్టుబడి సగటు జాతీయోత్పత్తిలో ఇది వరకెన్నడూ లేనంత కనిష్టానికి (4.29 శాతం) తగ్గించబడింది. 2009 నుండి 2015 వరకు విద్యలో పెట్టే పెట్టుబడి 13.2 శాతం మేర తగ్గించడం జరిగింది. దీంతో టీచర్ల సంఖ్య తగ్గి, తాత్కాలిక టీచర్ల సంఖ్య పెరగడం జరిగింది. ఇవాళ ప్రతి నలుగురులో ఒకరు కాంట్రాక్టు టీచరు. 2011 నుంచి పరిశీలిస్తే కాంట్రాక్టు టీచర్ల సంఖ్య 64 శాతం పెరిగింది.

# ఉపాధ్యాయుల హోదా ఎక్కడ?




**నాగటి నారాయణ**
ఉపాధ్యాయ ఉద్యమ
సీనియర్ నాయకులు


అక్టోబర్ 5 ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం. అంతర్జాతీయ విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ (యునెస్కో) 1966 సెప్టెంబర్ 21 నుండి 15 రోజుల పాటు పారిస్‌లో ఉపాధ్యాయుల పరిస్థితిపై ప్రత్యేకంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. అనేక దేశాలు, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ మరియు వివిధ ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్న ఆ సదస్సు ఉపాధ్యాయుల హోదా పెంచడానికి వారి హక్కులు, బాధ్యతలకు సంబంధించి కొన్ని నిర్దిష్టమైన సిఫార్సులతో సమగ్రమైన పత్రాన్ని ఆమోదించడం జరిగింది. 28 సం॥ల తర్వాత 1994లో యునెస్కో చేసిన సమీక్షలో ఆ పత్రం 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా మిగిలిపోయినట్లు, ఆనాటి సిఫార్సులు కాగితాల్లోనే కరిగిపోతున్నట్లు గుర్తించింది. ఆ లోపాన్ని అధిగమించుటకై దానికి ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించటం జరిగింది. 'స్టేటస్ ఆఫ్ ది టీచర్స్' పత్రాన్ని ఆమోదించిన అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం గా నిర్వహించి, సదరు సిఫార్సుల అమలును ప్రతియేటా సమీక్షించాలని నిర్ణయించడం జరిగింది.

**యునెస్కో పత్రంలోని ముఖ్యమైన అంశాలు :**

మానవాభివృద్ధిలో, ఆధునిక సమాజ నిర్మాణంలో, విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులది ప్రముఖ పాత్ర. ఈ పాత్ర ద్వారా ఉపాధ్యాయులు తమ హోదాను అనుభవించగలగాలి. విద్యార్థుల చదువుకు బాధ్యత వహిస్తూ పాఠశాలల్లో వుండే ప్రతి ఒక్కరికీ 'ఉపాధ్యాయుడు' అనే పదం వర్తిస్తుంది. విద్యా సంబంధిత లక్ష్యాలు, ప్రయోజనాల నేపథ్యంలో విద్యా అవసరాల మేరకు ఉపాధ్యాయుల హోదా ఉనికిలోకి వస్తుంది. విద్యా సంబంధిత లక్ష్యాలు, ప్రయోజనాలూ పూర్తిగా నెరవేరాలంటే ఉపాధ్యాయులకు సరైన హోదా, ఉపాధ్యాయ వృత్తిపట్ల ప్రజల్లో గౌరవం అనేవి ముఖ్యమైన అంశాలుగా పరిగణించాలి. వృత్తిపరమైన లక్ష్యాలను సాధించడంపై దృష్టి పెట్టే విధంగా, ఉత్తమమైన విద్యాభ్యాసం సాగించే విధంగా ఉపాధ్యాయులకు పని పరిస్థితులను కల్పించాలి. విద్యావ్యాప్తిలో ముఖ్యపాత్ర వహించే శక్తులుగా ఉపాధ్యాయ సంఘాలను గుర్తించాలి. ఆ విధంగా విద్యా విధానాన్ని నిర్ణయించడంలో వాటిని భాగస్వాములను చేయాలి. విద్యా వ్యవస్థలోని వివిధ రకాల పోస్టులైన ఇన్‌స్పెక్టర్, ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేటర్, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్, ప్రత్యేక బాధ్యతలుగల ఇతర పోస్టులను వీలైనంత వరకు అనుభవం గల ఉపాధ్యాయులకే ఇవ్వాలి.

**ఉపాధ్యాయుల హోదాకు సంఘాల బాధ్యత :**

తమ వృత్తి హోదాను నిలబెట్టుకోవడంలో ఉపాధ్యాయులకూ బాధ్యత ఉంది. వృత్తిపరమైన పని విధానంలో ఉపాధ్యాయులు అందరూ వీలైనంత వరకు అత్యున్నత ప్రమాణాలను సాధించాలి. నైతిక నియమావళిని లేదా ప్రవర్తనా నియమాలను ఉపాధ్యాయ సంఘాలు రూపొందించాలి. అలాంటి సూత్రాలు వ్యక్తికి గల ప్రతిష్టను పెంచేందుకు, అంగీకరించిన సూత్రాల మేరకు వృత్తిపరమైన విధులను నిర్వర్తించేందుకు ఉపయోగ పడతాయి. వ్యక్తిగత అభివృద్ధిని సాధించేందుకు సామాజిక, ప్రజా జీవితాలలో పాల్గొనే విధంగా ఉపాధ్యాయులకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. ఎన్నికల్లో నిలబడేందుకు, ప్రజా ప్రతినిధులుగా సేవలు అందించేందుకు ఉపా ధ్యాయులకు అవకాశం ఇవ్వాలి. సాధారణ పౌరులు అనుభవిస్తున్న అన్ని హక్కులూ వారికీ ఉండాలి. ప్రజా ప్రతినిధిగా ఉన్న కాలంలో బోధనా విధులకు దూరంగా వుండే అవకాశాన్ని కల్పించాలి. ప్రజా ప్రతినిధి పదవీ విరమణ తరువాత గతంలో తాను నిర్వహించిన అదే పోస్టుకు గానీ, దానికి సమానమైన పోస్టులకు గానీ తిరిగి వచ్చే అవకాశం ఇవ్వాలి.

**అమలు తీరు అయోమయం :**

యునెస్కో, ఐఎల్ఓ, ఇఐ (ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్) సంయుక్తంగా ప్రతి యేటా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తుంటాయి. కానీ అమలు తీరుతెన్నుల సమీక్ష నివేదికలను మాత్రం విడుదల చేయడంలేదు. అందువల్ల మొక్కుబడి కార్యక్రమంగానే జరిగిపోతుంది. కొన్ని ప్రైవేటు సంస్థలు వివిధ దేశాల్లో ఉపాధ్యాయుల స్థితిగతులను అధ్యయనం చేసే నివేదికలను తరుచుగా వెలువరిస్తున్నాయి. ప్రజల్లో, ప్రభుత్వపరంగా లభించే గౌరవం, జీతభత్యాలు, పని పరిస్థితులు, హక్కులు, బాధ్యతలు మున్నగు అంశాలు ఉపాధ్యాయుల హోదాకు కొలమానాలుగా ఉంటాయి. జెమ్స్ ఎడ్యుకేషన్ సొల్యూషన్ అనే సంస్థ ప్రకటించిన 2016 నివేదికలో చైనాలో ఉపాధ్యాయులకు అత్యధిక గౌరవం లభిస్తున్నట్లు తెలిపింది. గ్లోబల్ టీచర్ స్టేటస్ ఇండెక్స్‌లో చైనా అగ్రస్థానంలో ఉండగా, బ్రిటన్, అమెరికా మధ్య స్థాయిలో, దక్షిణ కొరియా, గ్రీస్ అథమ స్థాయిలో ఉన్నట్లు పేర్కొన్నది. 'మీ పిల్లలు ఏ వృత్తిలో ఉండాలని అభిప్రాయ పడుతున్నారు' అనే ప్రశ్నకు తల్లిదండ్రులు చెప్పిన సమాధానాలను బట్టి ఆ అంచనాకు వచ్చినట్లు పేర్కొన్నది. ఉపాధ్యాయులకు చెల్లించే జీతాల్లో స్విట్జర్లాండ్ మొదటి స్థానంలో ఉన్నట్లు ప్రకటించింది. అక్కడ టీచర్లకు లభించే వార్షిక జీతం అమెరికా డాలర్లలో 68000 అంటే మన రూపాయలలో సుమారు 44 లక్షలు. ఆ దేశంలోని ఉద్యోగుల సగటు వార్షిక జీతం రూ.50,000/-లు డాక్టర్లకంటే చాలా ఎక్కువ. టీచర్లకు ఎక్కువ జీతాలు చెల్లించే దేశాల్లో నెదర్లాండ్స్, జర్మనీ, బెల్జియం, తరువాతి స్థానాల్లో ఉన్నట్లు పేర్కొన్నది. విద్యా ప్రమాణాలు, అభ్యసన సామర్థ్యాల స్థాయి కూడా ఉపాధ్యాయుల హోదాకు వన్నెతెస్తాయి. ఈ విషయంలో ఫిన్లాండ్ మొదటి స్థానంలో ఉండగా ఉత్తరకొరియా, జెకొస్లేవేకియా, హంగరీ తరువాతి స్థానాల్లో ఉన్నవి. ఓఈసీడీ (ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ)లోని 21 దేశాల్లో ఉపాధ్యాయుల పనిభారం సగటున వారానికి 38 గంటలు. కాగా జపాన్‌లో 54 గంటలు, బ్రిటన్‌లో 39 గంటలు చొప్పున పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. పైన పేర్కొన్న వివిధ విషయాల్లో మన దేశంలో మరియు తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయుల హోదా, పరిస్థితిని అంచనా వేయవచ్చు.

**మన దేశంలో సన్మానాలు, అవమానాలు :**

"మాతృదేవో భవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ' అనటంలోనే భారతీయ సమాజంలో ఉపాధ్యాయులకు గల ప్రాధాన్యతను తెలియ జేస్తున్నది. అయితే బతకలేక బడిపంతులు అనే నానుడీ మనదే. గతంలోనే కాదు వర్తమానంలో కూడా అదే ధోరణి కొనసాగటం శోచనీయం. ఏటాకొద్ది మందికి ప్రభుత్వాలు సన్మానాలు చేస్తూ సంతోష పెడుతున్నాయి. మరోవైపు నాసిరకం విద్యా ప్రమాణాలకు ఉపాధ్యాయులే కారణమని నిరంతరం నిందిస్తూనే ఉన్నాయి. కాంట్రాక్ట్, గెస్ట్, పార్ట్‌టైమ్ తదితర పద్ధతులతో లక్షలాదిమంది టీచర్లకు వృత్తి భద్రత లేకుండా చేస్తున్నారు. 2004 నుండి అపాయిం టైన వారికి పెన్షన్ కూడా లేకపోతున్న విషయం తెలిసిందే. నెలకు లక్ష రూపాయల వరకు జీతాలు లభించేవారు కొద్దిమంది వుండగా, కనీస వేతనం కూడా కాని ఐదారు వేల రూపాయలతో దారిద్ర్య రేఖకు దిగువ బతుకులీడుస్తున్న వారూ ఉన్నారు. మంత్రులు, అధికారులు, పాఠశాలల పర్యవేక్షణలో దర్జాగా కుర్చీల్లో కూర్చుని ఉపాధ్యాయులను దోషుల్లా నిలబెట్టి విద్యార్థుల ముందే అవమాని స్తున్న ఘటనలు తరుచుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఇటీవల బిజెపి పాలిత రాష్ట్రం ఉత్తరాఖండ్ విద్యాశాఖమంత్రి ఒక పాఠశాలలో ఎనిమిదో తరగతి గదిలో ఉపాధ్యాయురాలిని అవమా నించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'మైనస్ ప్లస్ మైనస్ ఏమవుతుంది' అని టీచర్‌ని ప్రశ్నించారు. మైనస్ అవుతుంది సార్ అని సరిగ్గా చెప్పినా ఆ టీచర్ సమాధానం సరైనది కాదు ప్లస్ అవుతుందని తప్పు చెప్పటమే కాకుండా ఏం చదువు చెబుతున్నావు అని టీచర్‌ని మినిస్టర్ దబాయించారు. ఇలాంటి ఘటనలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతూనే ఉన్నాయి.

**విధాన నిర్ణయాల్లో అవకాశాల లేమి! :**

ఉపాధ్యాయుల్లో అత్యధికులు విద్యాధికులే. విధాన నిర్ణయాల్లో భాగస్వాములు కావటానికి ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావటానికి ఉపాధ్యాయులకు అవకాశాలు కల్పించాలని యునెస్కో సిఫార్సుల్లో వుంది. కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో అలాంటి అవకాశాలు వున్నట్లు తెలుస్తోంది. కానీ మన దేశంలో విద్యా విధానాల రూప కల్పనలో ఉపాధ్యాయులకు ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రాధాన్యత ఏమీ లేదు. ప్రజా ప్రతినిధులుగా సర్వీస్ చేయాల నుకుంటే ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వస్తోంది. టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేయాలన్నా ఉద్యోగాన్ని వదిలేయాల్సిన విషయం తెలిసిందే. సమాజానికి విజ్ఞానాన్ని అందించాల్సిన ఉపాధ్యాయులు ఆదర్శవంత మైన ప్రవర్తనతో ఉన్నత విలువలు పాటించాలని, అందుకు తగిన ప్రవర్తనా నియమావళిని ఉపాధ్యాయ సంఘాలే రూపొందించుకుని అమలు చేయాలని 1966 నివేదికలో స్పష్టంగా చెప్పబడింది. ఈ విషయంపై జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ (ఎన్‌సిఈఆర్‌టి) జాతీయస్థాయి ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి 1996లో "ఉపాధ్యాయుల వృత్తి సంబంధ నైతిక నియమావళి"ని రూపొందిం చటం జరిగింది. ఆ పత్రం చివరి పేరాలో ఈ విధంగా వున్నది. "నిజమైన వృత్తి సంఘం సభ్యుల ప్రవేశమును క్రమబద్ధీకరిస్తుంది. వారిపై అదుపును కలిగివుంటుంది. వారి సంక్షేమానికై పోరాడుతుంది. ఆ విధంగా సంఘం తన సభ్యుల యొక్క ఉమ్మడి స్వరంగా ప్రాతినిధ్యం వహిస్తుంది. ఉపాధ్యాయులు అనుసరించేటట్లు చూడటం ద్వారా ఈ నియమావళిలోని అన్ని నియమాలను సంరక్షించే బాధ్యతను ఉపాధ్యాయ సంఘాలు స్వీకరించాలి. ఈ నియమావళి అమలుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకునే బాధ్యతను కూడా ఉపాధ్యాయ సంఘాలు స్వీకరించాలి". ఈ నిర్ణయం జరిగి రెండు దశాబ్దాలుగా గడిచినా దాని అమలు తీరు తెన్నులను తెలిపే దాఖలాలు కనిపించడం లేదు.

**నిజాయితీ, నిబద్ధత ఏది? :**


ఉపాధ్యాయుల హోదా గురించి 15 రోజులు చర్చించి, నిర్దిష్టమైన సిఫారసులు చేసిన అంతర్జాతీయ సదస్సు జరిగి 51 సంవత్సరాలు గడుస్తోంది. అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించటం 23 సం॥లుగా జరుగుతోంది. ప్రతి యేటా ఒక ప్రత్యేక థీమ్‌తో నిర్వహించటం ఆనవాయితీ. ఉన్నత విద్యలో పనిచేసే అధ్యాపకుల హోదా గురించి 1997లో యునెస్కో రికమండేషన్స్ చేసి 20 సం॥లు గడుస్తోంది. ఈసారి 'TEACHING IN FREEDOM, EMPOWERING TEACHERS' (బోధనలో స్వేచ్ఛ, ఉపాధ్యాయుల సాధికారం) అనే థీమ్ ఇవ్వబడింది. ఈ విషయంతో చర్చలు, గోష్ఠులు, సదస్సులు, సభలు, సమావేశాలు, రౌండ్‌టేబుల్స్, ఫంక్షన్స్ నిర్వహించాల్సి వుంది. ఎవరు ఎలాంటి కార్యక్రమం నిర్వహించినా వాటిని యునెస్కో వెబ్‌సైట్‌కి అప్‌లోడ్ చేస్తే రికార్డ్ అవుతుంటుంది. అయితే వివిధ దేశాల్లో ప్రభుత్వపరంగా నిర్వహించి, టీచర్స్ స్టేటస్ పైన నివేదికలు ప్రకటిస్తే ఎంతో ప్రయోజనకరంగా వుంటుంది. అలాంటి నిర్మాణాత్మక కృషి జరగక పోవటం వలన అనేక అంతర్జాతీయ దినోత్సవాల్లాగే "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం" కూడా మొక్కుబడి కార్యక్రమంగానే మిగిలిపోతోంది. అందుకు యునెస్కో, ఐఎల్‌ఓ, ఇఐ మరియు సభ్య దేశాల నిజాయితీ నిబద్ధతే ప్రధాన ప్రశ్నార్థకం. అయినా ఈ విషయంలో జాతీయ ఉపాధ్యాయ సంఘాల బాధ్యతనీ ప్రశ్నిం చాల్సిందే. ఉపాధ్యాయ సంఘాలు కృషి చేస్తే కొన్ని లక్ష్యాలైనా సాధించే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు వృత్తి సంబంధిత ప్రవర్తనా నియమావళిని అమలు చేయవచ్చును. అది కూడా ఉపా ధ్యాయుల హోదా పెరుగుదలకు దోహదపడుతుంది. సమయాన్ని పాటించటం, బోధనా సామర్థ్యాన్ని పెంచుకోవటం, తల్లిదండ్రులతో సంప్రదింపులు, నైతిక ప్రవర్తన, ప్రజాస్వామిక పని విధానం, సామాజిక స్పృహ వంటి అంశాలను కోడ్ ఆఫ్ ప్రొఫెషనల్ ఎథిక్స్‌లో అలవర్చుకోవచ్చు.

**పునరంకితం కావాలి :**

వృత్తిరీత్యా ఉపాధ్యాయులది ప్రజాస్వామిక పని విధానం. సమానత్వం, సామాజిక న్యాయం, సెక్యులర్ భావాలు, శాస్త్రీయ ఆలోచనలు, నైతిక విలువలు, చారిత్రక దృక్పథం మున్నగు విషయాలు బోధించటమే వారిపని. ఆ పనిలో రాణించటం ద్వారానే సమాజంలో సముచిత హోదా సాధించగలరు. నేటి ప్రైవేటీకరణ ప్రభావం, మార్కెట్ ఆర్థిక విధానాల నేపథ్యంలో ఉపాధ్యాయులు సరికొత్త సవాళ్ళు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ స్ఫూర్తిని గుర్తించి ఆచరించటానికి పాలకులు, ఉపాధ్యాయులు పునరంకితం కావాలి.

**-9398207083**

# మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును



నేటికి 117 ఏళ్ళక్రితం గురజాడ చెప్పిన మాటలు జ్ఞానమైతే పెరిగింది. కాని మతం ఉన్మాదస్థాయిలో అసహనాన్ని ప్రదర్శి స్తుంది. ప్రముఖ హేతువాది పాత్రికేయురాలు గౌరీలంకేష్ దారుణ హత్య దాన్నే తెలియజేస్తుంది. గతించిన మూడేళ్ళలో మతోన్మాదులకు ప్రభుత్వ అండదండలు తోడై అనేకమంది కల్బుర్గీ, పన్సారే, దబోల్కర్‌ల హత్యలు ఆ కోవకు చెందినవే.

**దేశమంటే మట్టికాదోయ్**
**దేశమంటే మనుషులోయ్**

అని మనిషిని మనిషి యొక్క కార్యాచరణకు పట్టకట్టారు. ఆనాటి పరిస్థితులలో మనిషిని విస్మరించి నదులు నదాలు, కొండలు గుట్టల ప్రసంశ, ఆరాధన నుండి సమాజం దృష్టిని మనిషి మానవత్వం, స్త్రీ, విద్య, భౌతికవాదంవైపు మళ్ళించాడు.

కాని ఈనాడు దేశమంటే 'గోవులోయ్' అని గోవుల పేరుతో యథేశ్ఛగా మనుషులను చంపుతున్నారు. గోరఖ్ పూర్‌లో సరైన వైద్యం అందక వందలాది (భావి భారత పౌరులు) పసికందుల ఊపిరి ఆగిపోతుంటే చోద్యం చూస్తున్న ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి ఆదిత్యానాథ్ ఆవులకు అంబులెన్స్‌లను ప్రారంభించడం వారి అమాన వీయతకు నిదర్శనం. వీటి అన్నింటి నేపథ్యంలో కాబోలు సీతారాం ఏచూరి రాజ్యసభలో తన వీడ్కోలు సందర్భంలో ఈ దేశంలో ప్రస్తుతం ఆవులకున్నపాటి భద్రత మనుషులకు లేదు అని, ఇది సరైన పద్ధతి కాదని గుర్తు చేశారు. అయితే అందుకు ధీటుగా చైతన్యవంతులైన మేధావులు, కవులు, కళాకారులు తమదైన పద్ధతులలో నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. విశ్వ విద్యాలయాలలో విద్యార్థులు, అధ్యాపకులు అసహనానికి వ్యతిరేకంగా పోట్లాడు తున్నారు. లౌకిక వాదులైన భారత ప్రజలు తప్పకుండా ఈ ఉన్మాద పోకడలను వెనుకకు నెడతారు.

**చీకటి దివాకర్**
సాహితీస్రవంతి, 9441176882

గురజాడ 1862 సెప్టెంబర్ 21వ తేదీన నెలలు నిండకుండా దేశోద్ధారణ నిమిత్తం జన్మించాడు. అల్పజీవి అయినా అనల్పమైన సందేశాన్ని అందించాడు ఆనాటి పరిస్థితులను శ్రీపాదవారు ఇట్లా చెప్పారు.

"దేశం ఎంతగా పరుల పాదాలక్రింద నలిగిపోవాలో అంతగాను నలిగిపోయాక, జాతి ఎంతగా బానిస అయిపోవాలో అంతగా బానిస అయిపోయాక, భాష ఎంతగా శృంఖలాబద్ధం అయిపోవాలో అంతగాను శృంఖలాబద్ధం అయిపోయాక, సాహిత్యం ఎంతగా దిగ జారిపోవాలో అంతగాను దిగజారిపోయాక, భవిష్యత్ ఎంతగా అంధకార బంధురం అయిపోవాలో అంతగాను అంధకార బంధీలర అయిపోయాక పుట్టుకు వచ్చాడీ మహాకవి."

గురజాడ సాధించి పెట్టిన ముఖ్యమైన కార్యాలలో పత్రిక, పరిపాలన పాఠ్యాంశాలు వ్యవహారిక భాషలోనే ఉండాలన్నది ఒకటి. ఏట్సుదొర శ్రీనివాస అయ్యంగారు మరియు గిడుగు రామ్మూర్తి పంతులు గార్లతో కలిసి సాధించి పెట్టిన గొప్ప మేలది. చదువేరాని సమాజంలో గ్రాంధిక భాషలో పై వ్యవహారాలు నెరపడం ఏ విధంగాను ప్రజలకు ఉప యోగపడదని గ్రహించిన పిమ్మట వ్యవహారిక భాషోద్యమాన్ని చేపట్టారు. ఉద్ధండ పండితులను ఎదుర్కొంటూ, వాడుక భాష ఆవశ్యకతను తెలియజేస్తూ వారి ఉద్యమం సాగింది. గిడుగు ప్రత్యక్ష యుద్ధం చేసి గ్రాంధిక భాషావాదాలు రచిస్తున్న అనేక గ్రంథాల్లో వారు వాడుకభాషను వాడుతున్నారని నిరూపించి వాళ్ళ నోళ్ళు మూయిస్తుంటే, గురజాడ వాడుక భాషలో గ్రంధరచన చేసి మెప్పించారు.

వారి కృషి ఫలితమే మనం ఈనాడు చదువు తున్న పాఠ్యాంశాలు, పత్రికలు, సినిమాలు, టీవీలలో వస్తున్న భాష, మళ్లీ ఇక్కడే తిరోగమనంలో మన పాలకుల విధానాలున్నాయి. చదువుకోక ముందు కాకరకాయ, చదువుకున్న తరువాత కీకరకాయ అన్న చందంగా ఉంది. నేటికీ సగంమంది చదువులేని, వ్రాయలేని ప్రజలుండగా పరిపాలన మాత్రం ఇంగ్లీషులో జరుగుతుంది. సామాన్య ప్రజలు వారి అవసరాలు, హక్కులు పొందడానికి ఇతరులపై ఆధార పడాల్సివస్తుంది. వాడుక భాషోద్యమం మొదలై వందేళ్ళుపై బడినా ఈనాటికి పరిపాలన పరాయిభాషలో జరుగుతుండడం శోచనీయం. ఇక విద్య ప్రైవేటీకరణ క్రమంలో తెలుగు బదులు ఇంగ్లీషు బోధనా భాషగా అయి దాదాపు తెలుగు మాధ్యమం కనుమరుగైంది. తాజా ప్రభుత్వ విధానంలో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆంగ్ల మాధ్యమం బోధనా భాష అయి తెలుగు నిర్లక్ష్యానికి గురవుతుంది. మిత్రుడు ఛాయారాజ్ అన్నట్లు...

**"మన్ను, మిన్ను, నిన్ను గురించి**
**మాతృభాషలోనే తెలుసుకుంటాను**
**ఆడుతాను, పాడుతాను**
**నా ఆగ్రహం, నా ఆవేశం, నా శత్రువులకు అర్థంకావాలి**
**నా శ్రమ, శక్తి, నా భాషలోనే వ్యక్తం కావాలి**
**పుట్టుక దగ్గర, చావు దగ్గర పరాయి భాషలో నవ్వలేను, ఏడ్వలేను"**

అందుకే మాతృభాష బోధనలోనే విద్యార్థుల మనోవికాసం, భావ వ్యక్తీకరణ బాగుంటుందని శాస్త్రీయంగా నిరూపితమైంది. అయినా పాలకులు ఎవరికోసమో అర్థం చేసుకోవాలి.

అందుకని గురజాడ, గిడుగు స్ఫూర్తితో తెలుగు భాషలోనే పరిపాలన జరగాలని, మాతృభాష మాధ్యమంలోనే విద్యా బోధన ఉండాలన్న కోర్కెను సాధించుకోవాలి.

గురజాడ సృష్టించిన సాహిత్యంలో "కన్యాశుల్కానిది" అగ్రభాగం. ఈ ఆధునిక నాటకాన్ని రచించడంలో ఏకకాలంలో మూడు ప్రయోజనాల్ని సాధించారు. మొదట వారు వాదిస్తూ వస్తున్న వాడుక భాష ద్వారానే ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. ప్రజలకు అర్థం కాని, అందని కావ్యాలు వ్యర్థం. సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉంది. ఆ ప్రయోజనం నెరవేరాలంటే వాడుక భాషలోనే అవి వ్రాయాలి. వాడుక భాషలో కన్యాశుల్కాన్ని వ్రాసి ప్రజలకు అందించారు. రెండవది ఆనాటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న బాల్య వివాహాలను, మూఢాచారాలను, వేశ్యా సమస్యను, అందుబాటులో లేని న్యాయ, పరిపాలనా వ్యవస్థలను ఎండగట్టారు. మూడవది ప్రజారంజకంగా, ప్రదర్శనా యోగ్యంగా ఆధునిక నాటకాన్ని ప్రజలకు అందివ్వడం. నేటికి 125 ఏళ్ళు పూర్తి చేసుకున్న ఈ నాటకానికి ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజాదరణ పెరుగుతుందే కాని తరగడం లేదు. అది ఆయన దార్శినికత, ఆధునికత, ప్రతిభ.

తెలుగు సాహిత్యంలో దాదాపు అన్ని ప్రక్రియలకు ఆద్యుడు గురజాడ. "తలుపు తలుపు" అని తట్టిలేపి, తొలి తెలుగు ఆధునిక కథ దిద్దుబాటుని రాశారు. వ్రాసినవి పరిమితంగా నాలుగు కథలే ఐనా అపరిమిత ప్రయోజనాన్ని సాధించారు.

కన్యాశుల్కంలోను, కొండు భట్టీయంలోను వేశ్యా సమస్యను లేవనెత్తిన గురజాడ, దిద్దుబాటులో చదువుకొన్న, తెలివైన భార్య వేశ్యాలోలుడైన భర్తను పునరాలోచింపజేసి సరియైన మార్గంలోకి మార్చుకుంటుంది. ఈ కథలో సంస్కర్తనంటూ భర్త గోపాలరావు వేశ్యాలోలుడవుతాడు. గురజాడ కాలానికి వేశ్యా వ్యామోహం ఏ స్థాయిలో ఉండేదో ఈ కథ వెల్లడిస్తుంది. భార్య కమిలిని, గోపాలరావు పశ్చాత్తాపపడేటట్లు నాటకీయతను ప్రదర్శించి సమస్యను పరిష్కరిస్తుంది. "పెద్దమసీదు" కథలో బ్రతుకు తెరువు కోసం ప్రజలు ఏ మతంలోనైనా ఎలా ఒదిగి పోతారో చెబుతారు.

నారాయణ భట్టు తన శిష్యుడితో కలిసి కాశీనుండి తన స్వగ్రామం సమీపానికి వస్తాడు. తన గ్రామంలో గల శ్రీకాకుళేశ్వర మహాత్యాన్ని వివరిస్తూ వస్తాడు. ఊళ్లోకి వచ్చేటప్పటికి గుడి మాయమై, సుందరమైన మసీదు దర్శనమిస్తుంది. నారాయణ భట్టు దుఃఖిస్తాడు. గుడితోపాటు తన ఇల్లు ఏమయ్యయోనని ఆందోళన పడతాడు. శిష్యుడు మాత్రం భౌతికవాది. ఆకలి సంగతి ముందర ఆలోచించమంటాడు. మసీదు దగ్గర ఉన్న సాయిబుని వాకబు చేస్తారు. ఇక్కడి శివాలయం ఉండేది అంటే సాయిబు "హా సైతాన్కాఘుర్" అంటాడు. మా మేనమామలు రామావధాన్లు, లక్ష్మభట్టు ఇక్కడే ఉండేవారు. మృతులైనారా, దేశాంతర గతులైనారా అని అడగగానే సాయిబు నిశ్చేష్టుడై "నారాయణ" అని మేనల్లుడైన నారాయణ భట్టుని గుర్తుపడతాడు. "అయ్యో! నువ్వా! మావా!" అని నారాయణ భట్టు అనడంతో కథ ముగుస్తుంది. "దేవుళ్ళారా మీ పేరేమిటి? చాలా ముఖ్యమైన కథ. నేటి మతోన్మాద పరిస్థితులను ఆనాడే గ్రహించి వ్రాసినట్లు ఉంటుంది.

దేశుళ్ళ పేరున జరిగే మోసం, ఆ పేరుతో ప్రజలపై పడి బ్రతికే బాపతుని ఎండగడతారు. మతాధిక్యతను చాటుకోవటానికై వారు అవలంభించే దొంగ పద్ధతులను, చీప్‌ట్రిక్స్‌ను బహిర్గతము చేశారు. బౌద్ధం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. కథలోకి వెళితే పురాతన బౌద్ధక్షేత్రం అవశేషాలపై వైష్ణవ మతం వెలసిల్లితే, వైష్ణవానికి పోటీగా శైవం కూడా ఉనికిలోకి వస్తుంది. ఒక గ్రామంలోకి వైష్ణవ గురుబృందం వచ్చి గుండం తొక్కడానికి ఏర్పాట్లు చేస్తుంది. దానికి ధీటుగా శైవం కూడా గుండం తొక్కకపోతే నాయుడ్లందరూ వైష్ణవంలో చేరిపోతారని "మనవాళ్ళయ్య" మనం కూడా గుండం తొక్కాలని ప్రతిపాదిస్తారు. ఆ ప్రతిపాదన బెడిసికొట్టి తన మీదికే వస్తుంది. ఆయన తప్పించుకోబోయి నాంచారమ్మ ముసలి మామ, భయస్థుడైన భర్తను ఇరికిస్తారు ఈ గండం నుంచి గట్టెక్కించడానికి ఉపాయం ఆలోచించి వీర్ల సాయిబుతో గుండం తొక్కిస్తుంది నాంచారమ్మ. గుండంలో ఏ మహిమ లేదని తెలియజేస్తూ, దొంగ పూజలను వారి బుద్ధులను నాటకీయంగా ఎండగట్టారు గురజాడ. "మెట్టిల్డా"లో స్త్రీ చైతన్యంతో ముసలిభర్త వేధింపులను ఎదుర్కొంటుంది.

సులభతరమైన "ముత్యాల సరాల'ను సృష్టించిన దేశభక్తి గేయాన్ని అందించారు. శ్రీశ్రీ గారు అన్నట్లు గురజాడ దేశభక్తి గేయం ఏ దేశానికైనా సరిపోతుంది. దేశమంటే మట్టికాదు, మనుషులని నిర్వచించారు. కండకలవాడే మనిషి, అందుకు సరియైన తిండి ఉండాలన్నారు. అన్నదమ్ముల వలెను కులములు, మతములన్నీ మెలగాలన్నారు. మనసులు ఒకటైతే మతము వేరైనా ఫరవాలేదన్నారు. పాడిపంటలు పొంగిపొరిలే దారిలో పాటుపడమన్నారు. వర్ణ ధర్మం. అధర్మ ధర్మమని కుండబద్దలు కొట్టారు. ఒక్క మాటలో చెప్పాలంటే దేశం అభివృద్ధి పథంలో నడిచి ప్రజలందరూ గౌరప్రదముగా బ్రతక డానికి సరిపడా ప్రణాళికను మనముందుంచారు. ఆయన సృష్టించిన "పూర్ణమ్మ", 'కన్యక' అత్యంత సరళంగా, సృజనాత్మకంగా సమస్యను అర్థమైనట్లు చైతన్యపరచేటట్లు చేయడం ఆయన ప్రత్యేకత. ఆయన సాహిత్యమే కాదు, వ్యక్తిగత జీవితం కూడా అత్యంత ఆదర్శ వంతమైంది. చైతన్యవంతమైంది. అనుసరణీయమైంది. అందుకనే శ్రీశ్రీ అంటారు "అడుగుజాడ గురజాడ" అని. ఆయన 155 జయంతి, 21 సెప్టెంబర్ పురష్కరించుకుని ఆయన అడుగుజాడలో ప్రయాణించడానికి అభ్యుదయ వాదులు పాటుపడాలి. అప్పుడు మాత్రమే గురజాడ ఆకాంక్షించినట్లు మతాలు మాసిపోయి, జ్ఞానము నిలిచి వెలుగుతుంది. అప్పుడు స్వర్గసుఖాలు ఈ భూమి పైనే నూతన సమాజ రూపంలో విలసిల్లుతాయి.



# చూచి రాతలు - కంఠస్థాలు - కాపీలు

ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలో పాఠశాల విద్య మూడు చూసి రాతలు ఆరు కాపీల్లా ముందుకు దూసుకొనిపోతూ ఉంది. బహుశ భారతదేశంలో చాలా రాష్ట్రాల్లో ఇలాగే ఉండవచ్చు.

మన చదువుల్లో చూచిరాతలు (నేర్చుకోడానికి రాసే చూసి రాతలు) కాపీలు కొట్టడం, బట్టీ పట్టడం ఈ మూడూ దెయ్యాల్లా పిల్లల్ని పట్టి పీడిస్తున్నాయి. మానిసిక రోగిల్నిగా మారుస్తున్నాయి. సొంత కాళ్లమీద నిలబడనీయకుండా పరాధీనులుగా మారుస్తున్నాయి. చదువుల్లో ప్రధానమైనవి ఆలోచించడం, అర్థం చేసుకోవడం. ఇవి రెండూ లేకుండా జ్ఞానం సంపాదించడం అనేది ఉండదు.



**సి.వి.కృష్ణయ్య**
**జనవిజ్ఞాన వేదిక**

**చూచిరాతలు :**

అక్షరాలు నేర్పేటప్పుడు ప్రారంభ దశలో చూచి రాయించడం ద్వారా అక్షరాలు నేర్పడానికి టీచర్లు ప్రయత్నిస్తూ ఉంటారు. అక్షరాలు దిద్దించడంకంటే ఇది కొంత మెరుగు. కాని ఇందులో కూడా ఒక లోపం ఉంది. అదేమిటంటే అక్షరాలను గుర్తుపట్టకముందే (చదవడం రాకముందే) రాయిస్తూ ఉంటారు. ఇది చాలా ప్రమాదం. చదవడం వచ్చిన తర్వాతే రాయడం నేర్పాలి. చూచి రాయడం అనేది చిన్న వయసులో అక్షరంలో ఉండే ప్రతి వంపుని పరిశీలించి చూడడానికి. అక్షరాలు ఎలా ప్రారంభించాలి? ఎలా ముగించాలి? అనే విషయం టీచరు బోర్డు మీద రాసి చూపించాలి. ఇదంతా కొద్ది రోజుల వ్యవహారమే. అక్షరాలు రాయడంలో మెళకువలు అర్థం చేసుకొన్న తర్వాత చూచి రాయడం అవసరం లేదు. చూసి రాతను ఎక్కువ రోజులు కొనసాగిస్తే విసుగుపుడుతుంది. బండ చాకిరిలా భావిస్తారు. టీచర్ మీద కూడా వ్యతిరేకత కలుగుతుంది. కాబట్టి దీని అవసరాన్ని బట్టి ఎప్పుడైనా ఒకటి రెండుసార్లు ఉపయోగించాలి. అదొక పనిగా అలవాటుగా మార్చకూడదు. ఇది చాలా నష్టం చేస్తుంది.

**చదవడం - వెనకబడి పోతుంది :**

వినడం, మాట్లాడడం, చదవడం (గుర్తించడం) రాయడం ఇదీ వరుసక్రమం (LSRW) ఈ సంగతి శిక్షణపొందిన టీచర్లందరికీ తెలుసు - కాని చివర చేయాల్సిన రాతపనిని మొదటికి తెచ్చి రాయడం ద్వారా, చదవడం నేర్పించడానికి పూనుకొంటారు. ఇలా ఎందుకు చేస్తారు? టీచర్లకు తెలియక కాదు. పిల్లలకు చదవడం నేర్పడం అత్యంత శ్రమతో కూడుకొన్న పని. పిల్లలకూ చాలా క్లిష్టమైనది. నిరంతరం అభ్యాసం చేయాలి. కొత్తపదాలు అక్షరాలు చదివించే టప్పుడు పిల్లలకు ప్రతిక్షణం టీచర్ సహకరిస్తూ ఉండాలి. అంత వెసులు బాటులేని కారణంగాగానీ, మరే ఇతర కారణాల వల్ల గానీ టీచర్ సహకరించలేడు. పిల్లలు ఏవో కొన్ని అక్షరాలు గుర్తు పెట్టుకొని ఊహతో నోటికొచ్చింది చదివేస్తుఉంటారు. ఇలా తప్పులు చదువుతున్న పిల్లల్ని టీచర్ మందలిస్తూ, నీకు రావడం లేదంటూ ఉంటాడు. పిల్లలు భయపడిపోతారు. మరింతగా తప్పులు చదవడమో, లేక అసలు చదవడం మానుకోవడమో చేస్తారు. కొంతమంది పిల్లలు అక్షరాలను పదాలను చూస్తే బిగుసుకొని పోతారు. ఆ సమయంలో ఒక రకమైన మానసిక వైకల్యం ఏర్పడుతుంది. అలాంటి పిల్లల్ని నేను చూశాను. రెండుమూడు రోజులు వారితో మాట్లాడడం సన్నిహితంగా ఉండడం ద్వారా ఆ వైకల్యాన్ని పోగొట్టవచ్చు. ఇలాంటి పిల్లలు చదవడం మాని చూసిరాయడానికి పూనుకొంటారు. అలా చూసి రాస్తూనే ఉంటారు. ఇలా చూసి రాయడం ఇటు పిల్లవాడికి టీచరుకు వెసులు బాటుగానే ఉంటుంది. ఎందుకంటే పరస్పర జోక్యం లేకుండా ఏదో ఒక పనిజరిగిపోతున్నది గదా?

ఆరేళ్ళ వయస్సు పిల్లలు ఇతరులు చెప్పే విషయం మీద అంతగా మనస్సు పెట్టలేరు? 7,8,9 సంవత్సరాల వయస్సులో అక్షరాలన్నీ గుర్తుపట్టి స్పష్టంగా చదవడం నేర్చుకోవాలి. ఇది టీచర్‌కూ పిల్లలకూ అత్యంత క్లిష్ట దశ. ఇక్కడ వెనకబడితే అలా అది కొనసాగుతూనే ఉంటుంది. చదువుల్లో అత్యంత కీలకమైనది పుస్తకం చదివే నైపుణ్యం. అది రాకపోతే ఆ పిల్లల భవిష్యత్తు శూన్యమే.

చదవడం రాకుండా లక్షసార్లు చూసి రాసినా ఉపయోగం లేదు. అలా చూసిరాయడం ద్వారా చదవడం రాయడం వచ్చేటట్లయితే మన పిల్లలందరికీ ఇప్పటికే వచ్చి ఉండాలిగదా? ఎందుకంటే ఇప్పుడు మన పాఠశాలల్లో జరిగే ఏకైక కార్యక్రమం చూసి రాయడమేగదా!

అయితే చదవడం వచ్చిన వారు చూసి రాయవచ్చా? చదవడం వచ్చిన వారు ఎందుకు చూచి రాయాలి?

అదొక బడం చాకిరి. దీనివలన విద్యార్థికి ఎలాంటి ప్రయోజనం కలుగదు. ఈ విషయం విద్యార్థికి త్వరలోనే తెలిసిపోతుంది. చెప్పడం చేతగాక అనవసరమైన పని పెట్టారని టీచర్ మీద నమ్మకం పోతుంది.

**అయితే ఏమి చేయాలి?**

చదివింది సొంతమాటల్లో రాయమనాలి. దీనివలన శ్రమ తగ్గుతుంది. సొంత మాటల్లో ఎలా రాయలో ఆలోచిస్తారు. నేర్చు కొంటారు. ఇది వారికి ఆనందంగా ఉంటుంది. తప్పులు పట్టడం మానాలి. మరింతగా ప్రోత్సాహం అందిస్తూ ఉండాలి. ఒక్కో క్లాసు పైకి ఎక్కేకొద్దీ వయస్సు పెరిగేకొద్దీ వారి తప్పులు సరిచేసుకొంటారు. అయితే తప్పులు సరిచేసుకొనే ఏకైక మార్గం, రకరకాల పుస్తకాలు

చదవడమే. సొంత మాటల్లో రాయడం చేతగాకపోతే ఏమి జరుగు తుంది? బట్టీ పడతారు.

**బట్టీపట్టడం :**

పిల్లలు ఎందుకు బట్టీపడతారు (1) పాఠం అర్థంగాకపోవడం (2) అర్థం అయినా సొంత మాటల్లో రాసే అలవాటులేకపోవడం.

పిల్లలు పాఠాలు చదివి స్వయంగా అర్థం చేసుకోడానికి ప్రయత్నిం చటం, అర్థంగాని విషయాల్ని టీచర్‌ని ప్రశ్నించి తెలుసుకోవడం నేర్పాలి. వాళ్ళు ప్రయత్నించాలి. తంటాలు పడాలి. ప్రయత్నించడం నేర్చుకోవడంలో చాలా ప్రధానమైనది – అప్రయత్నంగా ఏదీ దొరకదు గదా?

అర్థమైనా సొంతమాటల్లో రాయలేని వారికి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయి –అర్థం చేసుకొని చదివే వాళ్ళు గొప్ప చదువులు చదివి శాస్త్రవేత్తలుగా, ప్రొఫెసర్లుగా, జడ్జిలుగా ఉన్నత పదవులు పొందవచ్చు. వారు తెలుసుకొన్న విషయాలు ప్రపంచానికి తెలియజేయాలంటే రాయడంలో వారికి ఆటంకాలు ఎదురవుతాయి. అర్థంగాని కృతకభాషలో రాస్తూ ఉంటారు. కాబట్టి పసితనం నుండి సొంత మాటల్లో రాయడం నేర్పాలి.

**కాపీలు :**

(1) చదువుల్లో కాపీలు (2) పరీక్షల్లో కాపీలు.

**1. చదువుల్లో కాపీలు:**

హోంవర్కులు, ప్రాజెక్టు వర్కులు పిల్లలు స్వయంగా చేయాలి. స్వయంగా సేకరించుకుని సొంత ఆలోచనలతో సొంతమాటల్లో రాయాలి. కాని రెడిమేడ్‌గా దొరికే విషయాలు చూసి కాపీలు చేసుకోవడం వలన, లేదా ఇతరుల ఆలోచనలతో రాసుకున్న నోట్ బుక్స్ చూసి కాపీలు కొట్టినందువల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. దీనివలన ఏమీ నేర్చుకోలేరు. చాలా నష్టపోతారు.

**2. పరీక్షల్లో కాపీలు :**

ఇది అత్యంత ప్రమాదకరమైన అవినీతికరమైన జాడ్యం. చూచి రాతలు, బట్టీ పట్టడాలు చివరకు కాపీలతో సమాప్తంగావు. అవి అలా పరాధీన బతుకులకు బాటలు వేస్తాయి. చేతగాని తనానికి నేరస్థ మనస్తత్వానికి దారితీస్తాయి. అర్థంగాని చదువులతో ముగిసిన బాల్యయవ్వనాలు అర్థంలేని జీవితాలతో ప్రారంభమవుతాయి. తనేమిటో తనకే తెలియకుండా బ్రతుకులీడుస్తూ ఉంటారు.

మన విద్యావ్యవస్థ మనిషిని పరిపూర్ణ మానవుడిగా చెయ్యడానికి బదులు గజిబిజి మనషిగా మారుస్తున్నది. తన మార్గం ఏదో తాను తెలుసు కోలేని గుడ్డివానిగా చేస్తున్నది. వాళ్ళు ఈ చదువులవల్ల ఎంతగొప్ప స్థానాల్లో ఉన్నప్పటికీ...

**సారాంశం :**

1) చదవడమే ప్రధానం. ఇందుకోసం కొన్ని నెలలు రాయించడం ఆపేయండి.

2) బట్టీపట్టడం ఆపండి. సొంత మాటలకు పట్టంకట్టండి.

3) కాపీలు కొట్టడంకంటే పరీక్షలు పెట్టకుండడం మంచిది.

4) పిల్లల శక్తి సామర్థ్యాలు అపారం. టీచర్లు కాస్తంత స్నేహంగా ఉంటే చాలు వాళ్ళే నేర్చుకుంటారు. ☯

**– సెల్ : 9490300478**

## 11వ పిఆర్‌సిని వెంటనే నియమించాలి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 11వ పిఆర్‌సిని వెంటనే నియమిం చాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఏపిజెఏసి) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది.

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమలునుండి వెనక్కి రావాలని, ఉద్యోగులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది.

ఏపిజెఏసి రాష్ట్ర కార్యవర్గ సమావేశం సెప్టెంబర్ 8న విజయవాడ లోని స్థానిక ఏపిఎన్‌జిఓ కార్యాలయంలో జెఏసి చైర్మన్ పి.అశోక్‌బాబు అధ్యక్షతన సమావేశమై ఉద్యోగుల డిమాండ్లపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించింది. రాష్ట్రంలో 01.09.2004 నుండి అమలులోకి వచ్చిన నూతన పెన్షన్ విధానం వలన ఉద్యోగులకుగాని, ప్రభుత్వానికిగాని ఏమీ లాభం లేదని, ఉద్యోగుల పెన్షన్ నిధులు షేర్‌మార్కెట్‌లో పెట్టడం వలన కనీస పెన్షన్‌కు గ్యారెంటీ లేకుండా పోయిందని, రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీవేసి కొత్త పెన్షన్ పథకం నుండి వెనక్కివచ్చేందుకు చర్యలు చేపట్టాలని చర్చలలో పాల్గొన్న పలు సంఘాల నేతలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీనిపై ఏపిజెఏసి తరపున ముఖ్యమంత్రికి మరోసారి ప్రాతినిధ్యం చేయాలని సమావేశం నిర్ణయించింది.

01.07.2018 నుండి 11వ పిఆర్‌సి అమలులోకి రావాలని, కావున వెంటనే పే రివిజన్ కమీషన్ నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పదవ పిఆర్‌సికి సంబంధించిన 10 నెలల పిఆర్‌సి అరియర్లు పిఎఫ్‌లోగాని, నగదు రూపంలోగాని చెల్లించేదానికి ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు.

ప్రభుత్వరంగ, గురుకుల సొసైటీల సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పుమేరకు 60 సం॥ల పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగులను బలవంతంగా రిటైర్‌చేసిన ప్రభుత్వం ఇప్పుడు 'నో వర్క్ నో పే' విధానం అమలు చేయాలనే నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే వీరికి భవిష్యత్ పిఆర్‌సిల అమలుకు ప్రభుత్వ ఉద్యోగులనుండి డీ–లింక్‌చేసి ప్రత్యేక కమిటీ నియమించడాన్ని కార్యవర్గం ఖండించింది.

హెల్త్‌కార్డులు అమలుకు సంబంధించి ప్రత్యేక హెల్త్‌చెకప్, మాస్టర్ హెల్త్‌చెకప్, ఎయిడెడ్, గురుకుల, మోడల్ స్కూల్, ప్రభుత్వరంగ ఉద్యోగులకు హెల్త్‌కార్డుల అమలు వంటి స్టీరింగ్ కమిటీ నిర్ణయాలపై కేబినెట్ వెంటనే నిర్ణయం తీసుకొని అమలు చేయాలని ప్రభుత్వానికి కార్యవర్గం విజ్ఞప్తి చేసింది.

ఉద్యోగుల ఈ ప్రధాన డిమాండ్లపై త్వరలో ముఖ్యమంత్రిని కలవాలని సమావేశం నిర్ణయించింది.

ఈ సమావేశంలో జెఏసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ఆఫీసు బేరర్లు ఎం.కమలాకరరావు, షణ్ముర్తి, ఎన్.రఘురామిరెడ్డి, జి.హృదయ రాజు, కుళ్ళాయప్ప, బండి శ్రీనివాసరావు, భాస్కరరావు, రియాజ్ అహమ్మద్, మణికుమార్, ఇక్బాల్, హరనాథ్, బి.వెంకటేష్‌బాబు, డి.నర్సింహు లు, గంగిరెడ్డి, సాంబశివరావు, కె. శ్రీనివాసకుమార్, సి.శ్రీనివాస రావు, ఏవి నర్సింహారావు, వీరేంద్రబాబు, జిల్లాల జెఏసి చైర్మన్, కన్వీనర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు రెండు మీడియంలు కొనసాగించాలి

# యుటియఫ్ రాష్ట్ర సదస్సు




మున్సిపల్ టీచర్ల రాష్ట్ర సదస్సు యుటియఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25న విజయవాడలో జరిగింది. సదస్సును యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలు ఫౌండేషన్ కోర్సులు, ఏఎఫ్‌సిలు, తెలుగు మీడియం రద్దులాంటి ప్రయోగాలు చేస్తున్నా రని, వీటివల్ల కొద్దిమంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరి, ఎక్కువ మంది నష్టపోయేపరిస్థితి ఏర్పడిందన్నారు.

కార్పొరేట్ పాఠశాలల్లా తయారు చేయడమంటే కొద్దిమందికి ర్యాంకులు తెచ్చే విధానమేనా అని ప్రశ్నించారు. అందరు విద్యార్థులకు నాణ్యమైన సమానమైన విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాని దేనని స్పష్టం చేశాయి.

యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

సర్వీస్‌రూల్స్ వచ్చినప్పటికి అనేక సవరణలు రావాల్సి వుందన్నారు. అప్‌గ్రేడ్ చేసిన పోస్టులకు ప్రమోషన్స్, ప్రధానోపాధ్యాయులకు జిఓ నం.40లోని అధికారాలు అన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, రిక్వెస్టు బదిలీలు, స్పౌజ్, అంతరజిల్లా బదిలీలు చేయాలని, మున్సిపల్ పరిధిలో ఎంఇఓ కార్పొరేషన్‌కు డివైఇఓ పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

మున్సిపల్ సమస్యలపై యుటియఫ్ నిరంతరం ప్రాతినిధ్యాలు చేయడం, పోరాటాలు చేయడం, ఆగస్టు 17న ఫ్యాప్టో ఆధ్వర్యంలో డిఎంఎ కార్యాలయం ఎదుట మహాధర్నా జరిగిందని, అనంతరం ఆగస్టు 18వ తేదీన చర్చలు జరిగాయని, 21 డిమాండ్స్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆ మేరకు ప్రపోజల్స్ ముఖ్య కార్యదర్శికి, మంత్రికి వెళ్ళాయని, వెంటనే తగిన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. పండిట్స్, పిఇటి అప్‌గ్రేడ్ పోస్టులకు ప్రమోషన్లు వెంటనే ఇప్పించాలని, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు అధికారాలు బదలాయించాలని, ఉపాధ్యాయుల సీనియార్టీ లిస్టు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సక్రమంగా తయారు చేయాలని అన్నారు. దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా మున్సిపల్ టీచర్స్‌ని ఉమ్మడి సర్వీస్‌రూల్స్ పరిధిలోకి తేవాలని నిర్ణయించారు. యుఎల్‌బి కో-ఆర్డినేటర్లు కొన్ని చోట్ల ఉపాధ్యాయుల పట్ల దురుసుగా, దౌర్జన్యంగా ప్రవర్తిస్తు న్నారని అలాంటి వారిని తొలగించాలని అన్నారు.

మున్సిపాలిటీలు ఉన్న స్థానిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సదస్సు నిర్ణయించింది. రాష్ట్రస్థాయిలో ఫ్యాప్టో ఇచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసింది.

సమస్యలు పరిష్కరించాలని సదస్సులో తీర్మానం చేయడమైనది.

1. మున్సిపల్ / కార్పొరేషన్ పరిధిలో సీనియార్టీ లిస్టు పారదర్శకంగా తయారు చేయాలని
2. ఉన్నత పాఠశాలల్లో ఎస్‌జిటి పోస్టు అన్ని అప్‌గ్రేడ్ చేయాలని
3. రేషనలైజేషన్ అనంతరం నీడ్ పోస్టులుగా గుర్తించిన చోట క్రొత్త పోస్టులు మంజూరు చేయాలని
4. 150మందిపైగా విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో ప్రధానాపాధ్యాయ పోస్టులు కేటాయించాలని
5. ఎల్‌టిసి, ఎడ్యుకేషన్ లోన్ సౌకర్యాలు కల్పించాలి.
6. 2014 డిఎస్‌సితో సహా పెండింగ్‌లో ఉన్న అందరికి హెల్త్‌కార్డులు ఇవ్వాలి
7. యుఎల్‌బి కో-ఆర్డినేటర్స్ జాబ్‌చార్టు ప్రకటించాలి
8. హైస్కూల్సుగా అప్‌గ్రేడ్ అయిన యుపి పాఠశాలకు పోస్టులు మంజూరు చేయాలి
9. తెలుగు మీడియం స్కూల్సులోని ఉర్దూపోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి
10. సిపిఎస్ అక్కౌంట్స్‌లో జమచేసిన డిఏ బకాయిలు తిరిగి చెల్లించాలి.
11. నగరం / పట్టణం శివారు ప్రాంతాల్లో నూతన పాఠశాలలు ఏర్పాటు చేయాలి
12. ప్రభుత్వం నిర్మించే అపార్టుమెంట్సుకు అందుబాటులో పాఠశాలలు ఏర్పాటు చేయాలి.
13. 500మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కాలేజీలు ప్రారంభించాలి.
14. నూతనంగా అవసరమైన టీచర్, జూనియర్ లెక్చరర్ పోస్టులు మంజూరు చేయాలి.
15. ఎస్‌సిఇఆర్‌టి ఇచ్చిన అకడమిక్ క్యాలెండర్ అమలు చేయాలి.
16. ప్రీప్రైమరీ పాఠశాలలకు ప్రత్యేకంగా భవనాలు నిర్మించాలి.
17. మున్సిపల్ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలి.

# వెబ్ పోర్టల్‌పై ప్రచారమేది...?

రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులతో అభిప్రాయాలను పంచుకునేందుకుగాను ఆంధ్రప్రదేశ్ సబ్జెక్ట్‌ఫోరం పేరుతో వెబ్‌పోర్టల్‌ను విద్యాశాఖ రూపొందించింది. దీనిని సెప్టెంబర్ 05, 2016న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. సంవత్సరన్నరకాలం గడిచినా ఈ వెబ్ పోర్టల్‌ను రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు సమర్థవంతంగా ఉపయోగిస్తున్న దాఖలా ఏమీ లేదు. గడిచిన ఉపాధ్యాయ బదిలీల్లో ఈ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయించుకొన్న ఉపాధ్యా యులకు 1 మార్కు, కనీసం పదిసార్లు ఉపయోగించిన వారికి మరొక మార్కు ప్రతిభా ఆధారిత మార్కులుగా కేటాయించారు. ఉపాధ్యా యులు చాలామంది అవసరార్థం ఈ వెబ్ పోర్టల్‌లో నమోదు చేయించుకొన్నా తగినంతగా ఉపయోగించడం లేదన్నది సత్యం. విద్యాశాఖ కూడా ఈ వెబ్ పోర్టల్‌పై తగినంత ప్రచారం చేయడం, మరింత సృజనాత్మకతను జోడించడం వంటివి చేయడం లేదన్నది సత్యం.

**ఎస్.పి. మనోహర్‌కుమార్**
యుటిఎఫ్ అధ్యక్షులు, కృష్ణా జిల్లాశాఖ

విద్యాశాఖ ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొంటూ, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కా రానికి కృషిచేయడం కోసం, ఉపాధ్యాయులను అనుసంధానించడం, వారి అభిప్రాయాలను సేకరించడం, విద్యారంగంలో అవసరమైన మార్పులకు తగిన కార్యాచరణను రూపొందించడంకోసం ఒక వేదికగా 'ఆంధ్రప్రదేశ్ సబ్జెక్ట్ ఫోరం' వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. దీనినే ఆంధ్రప్రదేశ్ ఈ నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ గా పిలుస్తున్నారు. ఈ వెబ్ పోర్టల్‌లో రాష్ట్రంలోని ఉపాధ్యాయులందర్నీ భాగస్వాములను చేయడం తద్వారా విజ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడం, ఉపాధ్యాయులకు అవసరమైన వృత్తి నైపుణ్యం పెంపొందింపచేయడం దీని యొక్క ప్రధాన లక్ష్యం. ఉపాధ్యాయులు తాము పాఠశా లలో చేసిన వినూత్న కార్యక్రమాలు, సృజనాత్మక కార్యక్రమాలు, వివిధ పాఠ్యాంశ బోధనలో వినియోగించిన పద్ధతులు వంటివి ఈ పోర్టల్‌లో పోస్ట్ చేయొచ్చు. ఇతర ఉపాధ్యాయ మిత్రులు పోస్ట్ చేసిన అంశాలు, వారి అనుభవాలు, తరగతి గది అనుభవాలను ఇతర ఉపాధ్యా యులు తెలుసుకోవచ్చు. విద్యా సంబంధ వీడియోలు, ఆర్టికల్స్, బుక్స్, రీసెర్చ్ వర్క్, మెటీరియల్స్, ఫొటోలు, ప్రాజెక్ట్‌లు, విద్యార్థుల ప్రతి స్పందనలు, పాఠ్య ప్రణాళికలు, తరగతి గది అభ్యసన ప్రక్రియలు ఇతర ఉపాధ్యాయులతో షేర్ చేసుకోవచ్చు. విద్యాశాఖ విద్యాసంబంధ నోటిఫికేషన్లు, సెమినార్లు, జాతీయ స్థాయి విద్యా సంబంధ అంశాల వంటివి ఈ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారు. ఈ వెబ్‌సైట్ పనితీరుపై వివిధ అంశాలను చర్చించేందుకు ప్రతిజిల్లాలో కొంతమంది కోర్‌గ్రూప్ సభ్యులను ఎంపిక చేయాల్సి వుంది. కానీ ఆశించిన స్థాయిలో ఈ పోర్టల్‌ను ఉపాధ్యాయులు ఉపయోగించడం లేదు. ఈ పోర్టల్‌లో ఉపాధ్యాయులు నమోదు అవడానికి 125.20.160.197.8080 లేదా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.ఎపిఈకేఎక్స్.ఇన్ అని టైప్‌చేస్తే 'ఆంధ్రప్రదేశ్ సబ్జెక్ట్‌ఫోరం' పేరుతో వెబ్‌పోర్టల్ ఓపెన్ అవుతుంది. వెబ్‌సైట్ కుడివైపున టీచర్ జోన్ అనే టాబ్‌పై క్లిక్ చేయాలి. అక్కడ కొత్తగా నమోదు అయ్యే వారు న్యూ టీచర్ రిజిస్ట్రేషన్ పై క్లిక్ చేయాలి. అనంతరం సిఎస్‌సి వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల నమోదు చేయించుకొన్న మొబైల్ నెంబరును ఎంటర్ చేసి, ప్రక్కనే ఉన్న సెక్యూరిటీ కోడ్‌ను టైప్ చేసి సబ్‌మిట్ చేయాలి. వెంటనే ఆ ఉపాధ్యాయుని పేరు, హోదా తదితర వివరాలతో లాగిన్ పేజి కనిపిస్తుంది. మిగిలిన వివరాలు అనగా తండ్రిపేరు, సబ్జెక్ట్ వివరాలు, విద్యా సంబంధ వివరాలు, టాలెంట్స్ వివరాలు, పరిచయ వాక్యాలతో పాటు ఫోటో అప్‌లోడ్ చేసి సబ్‌మిట్ చేయాలి. దీనితో ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తిఅవుతుంది. ఇక నుంచి మనం నమోదు చేసిన మొబైల్ నెంతో, పాస్ వర్డ్‌తో పోర్టల్‌లోకి ఎంటర్ అయ్యి విజ్ఞానాంశాలను జతచేయొచ్చు. ఇతర ఉపాధ్యాయులతో పంచుకోవచ్చు.

విద్యాశాఖ ఉపాధ్యాయులు, విద్యార్థుల అభిప్రాయ వేదికగా ఈ సబ్జెక్ట్‌ఫోరంను ఏర్పాటుచేసినా తగినంతగా ఉపాధ్యాయులు దీనిని ఉపయోగించుటలేదు. బోధన, నైపుణ్యాలను పరస్పరం అందిపుచ్చుకొనే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా విద్యాశాఖ తగినంత ప్రాచుర్యాన్ని కల్పించలేదు. ఉపాధ్యాయులు కూడా కాలానుగుణంగా అందివచ్చిన టెక్నాలజీని అందుకుంటేనే బోధన మరింత వినూత్నంగా ఉంటుంది. అందుకు ఉపాధ్యాయులు మరింత రెగ్యులర్‌గా అప్‌డేట్ అవ్వాలి. బోధనాభ్యసన ప్రక్రియ సమర్థవంతంగా సాగటానికి, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవటానికి ఉపాధ్యాయలోకం బోధనలో ఆధునిక టెక్నాలజీని, వాటి అనుభవాలను పంచుకోవాలి. విద్యాశాఖ కూడా ఏదో వెబ్‌పోర్టల్ ప్రారంభించాంలే అనుకోకుండా ...ఉపాధ్యాయులు వెబ్‌పోర్టల్‌లో పోస్ట్ చేసిన అంశాలను, అనుభవాలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని మరింత సమర్థవంతంగా ఆంధ్రప్రదేశ్ ఈ నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్‌ను ఉపయోగించేట్లు చేయాల్సిన బాధ్యతను నిర్వహించాలి.

## ఉద్యమవార్తలు పంపండి

**యుటియఫ్ జిల్లా శాఖలు, మండల శాఖలు మీ జిల్లా / మండలంలో నిర్వహించిన సమావేశాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ప్రాతి నిధ్యాల వార్తలను, ఫోటోలను ఎప్పటి కప్పుడు 'ఐక్య ఉపాధ్యాయ'కు మెయిల్ / పోస్టు ద్వారా పంపండి. మీ పోరాటాలు, విజయాలు అన్ని జిల్లా / మండల శాఖలకు స్ఫూర్తిని కల్గిస్తాయి. ప్రతినెల 30వ తేదీలోగా వచ్చిన వార్తలు, ఫోటోలు మరుసటి నెల పత్రికలో ప్రచురించడం జరుగుతుంది.**

**– సంపాదకవర్గం**

# ‘ప్రైవేటీకరణ’ సలహాలతో నీతి ఆయోగ్ కార్యాచరణ ప్రణాళిక

దేశ ఆర్థిక వ్యవస్థను ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో, ప్రణాళికాసిద్ధమైనకృషి ద్వారానే దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటుందన్న ఆలోచనతో స్వాతంత్ర్యానంతరం 1951 నుంచి పంచవర్ష ప్రణాళికలను అమలు చేయడం ప్రారంభిం చారు. ఆర్థిక వ్యవస్థ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఒడి దుడుకులు లేకుండా మంచి ఫలితాలను సాధించేటందుకు ప్రణాళికా బద్ధమైన కృషి అవసరం. ఎందుకంటే గతంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఆర్థికమాంద్యం ఏర్పడి ఆర్థిక వ్యవస్థలు సంక్షోభా లను ఎదుర్కొన్నా రష్యా లాంటి దేశాలు మాత్రం దీన్ని తట్టుకొని నిలబడ గలిగినాయి. దీనికి ప్రధానం గా ప్రభుత్వరంగాన్ని పటిష్టం గా ఉంచడంతో పాటు ప్రణా ళికాబద్ధమైన కృషి, ఆచరణ ముఖ్యమైన కారణాలు. ఈ నేపథ్యంలోనే ప్రపంచ దేశాల కృషి ద్వారా ఇప్పటి వరకు 11 పంచవర్ష ప్రణాళికలను పూర్తి చేసుకొని 12వ పంచ వర్ష ప్రణాళికా కాలంలో ఉన్నాం. అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో సరళీకృత ఆర్థిక విధానాల అమలుకు కొంత ఆటంకంగా ఉన్న 64 సం॥ల పాటు దేశానికి సేవలందించి, ప్రభుత్వరంగాన్ని ఎంతో కొంత బలపేతం చేయడంలో కృషి చేసిన కేంద్రంలో 'సూపర్ కేబినెట్'గా పేరుపొందిన ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి, 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని NDA ప్రభుత్వం 'NITI' Aayog (National Institution for Transforming India) (జాతీయ పరివర్తన సంస్థను) 2015 జనవరి 1న ఏర్పాటు చేసింది. ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా మారిన ఆర్థిక పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో మరింత అనుసంధానిం చడం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉన్నది.




ఈ ఆలోచనలకు కార్యరూపం ఇచ్చేదాంట్లో భాగంగా నీతి ఆయోగ్ ఇటీవల ఒక కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. దానిని మూడు దశలుగా ప్రకటించింది. (1) 15 సం॥ల విజన్ (2) 7 సం॥ల వ్యూహం (3) 3 సం॥ల కార్యాచరణ ప్రణాళిక. 15 సం॥ల (2017-18 నుంచి 2031-32) విజన్ భారతదేశాన్ని నూతన భారత దేశంగా మార్చుచేస్తుంది. అలాగే 7 సం॥ల (2017-18 నుంచి 2023-24) వ్యూహం దీర్ఘకాలిక లక్ష్యాన్ని ఆచరణాత్మక విధానంగా మార్చి 'జాతీయ అభివృద్ధి ఎజెండా'గా అభివృద్ధి చేస్తుంది. మూడు సం॥ల కార్యాచరణ ప్రణాళిక (2017-18 నుండి 2019-20) భారత దేశం యొక్క లక్ష్యాలను అందుబాటులో ఉన్న వనరులను, 14వ ఆర్థిక సంఘం కాలంలో ఆర్థిక వెసులుబాటును అంచనా వేసుకొని వ్యూహాత్మక సర్దుబాటు ద్వారా 2020 నాటికి ప్రభుత్వం యొక్క లక్ష్యాలను చేరుకొంటుంది. ఈ రకమైన 'ఉన్నతమైన ఆశయాలు'లతో నీతి ఆయోగ్ ఇటీవల విధాన పత్రాన్ని విడుదల చేసింది.

నీతి ఆయోగ్ చేత ప్రతి పాదించబడిన వాస్తవమైన కార్యాచరణ ప్రణాళికను చూసే ముందు, ఈ విధాన పత్రాల ద్వారా చెప్పబడిన నిర్ధిష్టమైన ఆలోచనలను తీసుకురాబడిన పరిస్థితు లను అర్థం చేసుకోవడం అవసరం. సాంప్రదాయ కంగా, ఈ రకమైన నయా ఉదారవాద విధానాలు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (IMF), ప్రపంచ బ్యాంకు లేదా వాటికి సమానమైన ఇతర దేశ ఆర్థిక పురోగతి కోసం వ్యవస్థీకృత సర్దుబాటు సంస్కరణలు అమలు చేసేటట్లు చేస్తు న్నాయి. ఈ షరతులన్నీ వారి యొక్క ఋణ ప్యాకేజీలలో భాగంగానే ఉంటాయి.

వాస్తవానికి ఆర్థిక సర్వే 2017 దేశంలో అభివృద్ధి కుంటుపడిం దనీ, రీజియన్ల వారీ అసమానతలు ఎక్కువయ్యాయని నివేదిక ఇచ్చింది. నీతి ఆయోగ్ ఈ సర్వే లేవనెత్తిన అంశాలలో ఎలాంటి మార్పులు చేయడం ద్వారా ఈ అసమానతలు తగ్గుతాయో ప్రభుత్వానికి ఒక కార్యాచరణ ప్రణాళికను ఇవ్వాలి. ప్లానింగ్ కమీషన్ గతంలో చేసిన పని ఇదే. అసలు చేయాల్సిన పనిని వదిలేసి సర్వ రోగ నివారిణిగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (PPP)పేరుతో ఒక కొత్త విధానాన్ని ముందుకు తెచ్చినట్లుగా ప్రణాళికలో చేర్పిం చింది. ప్రత్యేకించి నీతి ఆయోగ్ చేత ప్రతిపాదించబడిన 3 సం॥ల కార్యాచరణ ప్రణాళిక అన్ని రంగాలను PPP పేరుతో ప్రైవేటుకు మళ్ళించే విధంగా ఉంది. ప్రభుత్వ ప్రాపకాన్ని పొందే 'నీతి ఆయోగ్' అనే ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ వాస్తవానికి ప్రపంచబ్యాంకు పద్ధతిలో ఏర్పాటు చేయబడిన ఒక ఆకర్షణీయ విభాగం మాత్రమే. అయితే తేడా ఏమిటంటే ఋణంతో పాటు ప్రపంచబ్యాంకు నుండి వచ్చిన వాటిని 'షరతులు' అంటారు. నీతి ఆయోగ్ నుంచి వచ్చిన వాటిని మాత్రం 'సలహాలు' అంటారు.

ఇప్పుడు నీతి ఆయోగ్ ప్రభుత్వానికి ఇస్తున్న సలహాలు ఏమంటే దేశంలోని పాఠశాలలన్నింటిని ప్రైవేటుపరం చేయాలని, అవసరమైతే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నడపాలని కొత్త సూచనలు

చేసింది. దానికి బలాన్ని చేకూరుస్తూ దేశవ్యాప్తంగా 20మంది పిల్లల కంటే తక్కువ ఉన్న పాఠశాలలు 50వేలకుపైనే ఉన్నాయని, అలాగే హాజరుశాతం కూడా బాగా తక్కువగా ఉన్నందున ఇటువంటి డొల్ల పాఠశాలలను మూసివేయాలని చెబుతున్నది. యుపిఏ ప్రభుత్వం 2005లో ఆర్టికల్ 21ఏ ద్వారా విద్యను ప్రాథమిక హక్కుగా సవరణ చేస్తూ విద్యాహక్కు చట్టాన్ని తెచ్చింది. కేవలం లాభ, నష్టాలను మాత్రమే బేరీజువేసి ఇటువంటి నష్టదాయక పాఠశాలలను మూసి వేయాలని సలహా ఇచ్చింది. రాజ్యాంగస్ఫూర్తి, నిర్బంధ ప్రాథమిక విద్య లాంటి అంశాలేవీ లెక్కలోకి తీసుకోకుండా కేవలం 'నష్టం' పేరుతో మూసేయమని సలహా చెప్పడం వ్యాపార దృక్పథం తప్ప మరొకటి కాదు.

మరోవైపు ఎలిమెంటరీ విద్యలో తరగతికి తగిన ప్రమాణాలు లేకపోవడం ఒక ప్రధాన సమస్యగా ఉన్నదని, ఎస్ఎస్ఏ, విద్యా హక్కు చట్టం పాఠశాల భవనాలు, ఉపాధ్యాయ నియామకం ఇతర సదుపాయాలు ఏర్పాటుపై దృష్టి పెట్టాయని వీటిని సాధించాయని, కానీ అదే సమయంలో ప్రమాణాలు మాత్రం పడిపోతూ వచ్చాయని నీతి ఆయోగ్ చెప్పింది. ప్రాథమిక పాఠశాలల్లో 1-5 తరగతుల స్థూల నమోదు స్థాయి (GER) 99.2%, 6-8 తరగతుల స్థూల నమోదు స్థాయి 92.8%గా ఉన్నదని చెబుతూ నికర నమోదను వదిలివేసింది. ఇక ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని ప్రాథమిక పాఠశాలల్లో 1:24గా, సెకండరీ విద్యలో 1:27గా చెప్పింది. దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్న డ్రాపౌట్ల సంఖ్య ప్రస్తావన మాత్రం లేదు. ఇంత ఉన్నా ఫలితాలు మాత్రం సరిగాలేవని చెప్పింది. ఇక దీన్ని ఆధారం చేసుకొని రాబోయే మూడు సంవత్సర కాలంలో ఫలితాల సాధనకు తగిన విధంగా వ్యవస్థను మార్చాలని చెప్పడం గమనించాలి. ఎందుకంటే సామాజికాభివృద్ధిలో ప్రతిదీ లెక్కలతో ముడిపెట్టడం సరియైన అంశంకాదు. కేవలం లాభమే అన్ని చోట్లా ఆశించడం సరైన కొలమానం కూడా కాదు. పుట్టిన పిల్లలను ఆరోగ్యంగా పెంచి, మంచి పౌరులుగా తయారుచేసే క్రమంలో లాభ నష్టాల గణాంకాలు వేసి నష్టదాయకమని ముద్రవేసి ఆ బాధ్యతను వదిలించుకోవడం కనీసం పెట్టుబడిదారీ దేశంలో కూడా జరగడం లేదు. అది భారత దేశంలో వర్తింపజేయాలని నీతి ఆయోగ్ సలహా చెప్పడం అత్యంత ప్రమాదకర పరిణామాలకు సూచన. వీటిని లోతుగా అర్థం చేసుకోవాలి.

ఒకవైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విశ్వరూపాన్ని చూస్తూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు అప్పగించాలన్న 'నీతి' ఇప్పుడిప్పుడే నాగరికతను ప్రభుత్వ విద్య నేర్చుకుంటున్న భారత దేశంలోని అణగారిన వర్గాలకు విద్యను దూరం చేసి మళ్ళీ మధ్య యుగాల నాటి కులవ్యవస్థను స్వీకరించడానికి ఉపయోగపడే చర్య మాత్రమే. కార్పొరేట్‌కు ఏ సామాజిక బాధ్యత ఉంటుంది కనుక వారు సమాజానికి చేస్తారు. వందలమంది పిల్లలు చనిపోతున్నా కనీసం దానిమీద సమీక్ష కూడా చేయని వారి విధానం నీతి ఆయోగ్ చెబుతున్న కనీస ప్రమాణాలను సాధించకపోగా వారిని పూర్తిగా విద్యకు దూరం చేసే ప్రమాదమున్నది.

**– కె.నాగమల్లేశ్వరరావు, గుంటూరు**

# ఉపాధ్యాయ మిత్రుల్లారా !!

**– కుప్పిలి కామేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా**

**కదిలిరండి ఉపాధ్యాయ మిత్రుల్లారా**
**కలిసిరండి ఉద్యమాల నేతల్లారా**
**యుటియఫ్ రాష్ట్ర మహాసభలకు ॥కదలి॥**

**గొంతులన్ని ఒక్కటైతే నలుదిక్కులు కదులునురా**
**అడుగులన్ని ఒక్కటైతే విద్యా ప్రగతి సాగునురా**
**పాఠశాల పరిరక్షణే ధ్యేయంగా కదులుదాం**
**ప్రతి పల్లెలో పాఠశాల వెల్లివిరియ నిలుద్దాం ॥కదలి॥**

**విప్లవాల పురిటిగడ్డ శ్రీకాకుళం సిగలోనే**
**యుటియఫ్ పదిహేనువ ఆంధ్రరాష్ట్ర మహాసభలో**
**విద్యాహక్కు చట్టాన్ని అమలజేయు నినాదమిద్దాం**
**మౌలిక వసతులు మాట మరువద్దని పిలుపునిద్దాం ॥కదలి॥**

**నూతన సర్వీస్‌రూల్స్ రూపొందించాలని**
**స్వయం పోషక చట్టాన్ని శాశ్వతముగ రద్దుచేయ**
**డిటెన్షన్ విధానము వద్దేవద్దందాము**
**సిపిఎస్ అంతానికి పోరుదారి నడుద్దాం ॥కదలి॥**

**మాతమౌఢ్యపు విద్యను మెదడులలో నింపొద్దని**
**మానవీయ విలువలు ప్రతి మదిలో నిలపాలని**
**కార్పో"రేటు" విద్యవద్దు కామన్ స్కూల్ ముద్దని**
**ఎలుగెత్తి చాటుదాం ఏకమై కదులుదాం ॥కదలి॥**

## పాఠకుల అభిప్రాయాలు

సెప్టెంబర్ నెల సంచికలో సివి క్రిష్ణయ్య గారి వ్యాసం అక్షరాలు నేర్పడంలో మెళకువలు చాలా బాగున్నది. పిల్లలకు, ఉపాధ్యాయులకు మధ్య సంబంధాలు, బోధనా పద్ధతులు, మెళకువలు తదితర విషయాల గురించి తెలియజేసినందుకు ధన్యవాదాలు.

**– డి.ఎస్.ఎన్.మూర్తి,** అన్నవరం,తూర్పుగోదావరి జిల్లా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యంగారి వారి వ్యాసం 'ఉపాధ్యాయుడు నాడు-నేడు' ఉపాధ్యాయుల స్థితిగతులను చక్కగా వివరించింది. రచయితకు అభినందనలు.

**– కె. కిరణ్‌కుమార్,** కర్నూలు

సెప్టెంబర్ ఐక్య ఉపాధ్యాయ సంచిక బాగున్నది. వ్యాసాలు విజ్ఞానదాయకంగా వున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు పూర్తిగా ప్రచురించగలరు.

**– డిఎస్ మధుసూదనరావు,** శ్రీకాకుళం

# శిక్ష(ణ)

డా॥ ఎం.ప్రగతి
అనంతపురం

సమయం రాత్రి తొమ్మిది గంటలు, స్థలం పేరుగాంచిన రెస్టారెంట్.

రెండో రౌండు పూర్తయి మూడో రౌండు లోకి ఎంటరవుతున్నారు సుందర్రావు అతని మిత్ర బృందం. సుందర్రావు గ్లాసు నోటిదగ్గర పెట్టుకోబోతుండగా వాట్సప్ సందేశం వచ్చినట్లు స్మార్ట్ ఫోను మోగింది. "ఎవర్రా అది?" భాస్కర్రావు అడిగాడు. "వైఫ్ మెసేజ్ లేరా." సుందర్రావు జవాబిచ్చాడు. ఏంటో చూడరా అన్నాడు శేఖర్. ఏదో పప్పులు కావాలనో, నూనె అయిపోయిందనో ఉంటుంది లేరా. పెళ్ళయితే చాలు, స్వేచ్ఛే అంతా పోయినట్లే. ప్రశాంతంగా మందు కొట్టడానిక్కూడా లేదు." సుందర్రావు మాటలకు "అవునవును" అంటూ వంత పాడారు మిత్ర బృందం నోట్లో ద్రవం పోసుకుంటూ. "ఇంతకూ ఏముందో చూడరా ఆ మెసేజ్ లో. ఏదన్నా అర్జెంటేమో." భాస్కర్రావు అన్నాడు. "నేనెందుకు? నువ్వే చూడు." భాస్కర్రావు చేతికిచ్చాడు ఫోను. "మీ మిసెస్ మెసేజ్ నేను చూస్తే బాగుండదేమోరా." మొహమాటంగా అంటున్న భాస్కర్రావుతో "వాడే చూడమంటున్నాడుగా, నేను చూస్తానిటీ" లాక్కున్నాడు శేఖర్ ఏముందో అని ఆత్రంగా. "ఇదేందో వీడియో ఉందిరోయ్!" అంటూ ఆన్ చేశాడు.

సుందర్రావు మూడేళ్ళ కూతురు పింకీ పుస్తకం, పెన్సిల్ పట్టుకొని ఏడుస్తూ రాస్తోంది. "చెప్పు. ఏ... బి... సి... డి..." వీడియోలో కనబడకుండా పలికిస్తోందో ఆడగొంతు. ఆ గొంతు సుందర్రావు భార్య వసంతది. పింకీ తడబడుతూ "ఏ... బి...... డీ" అంటుండగానే ఆ పిల్ల చెంప పగిలింది. "ఏయ్, బి అయ్యాక ఏమిటి?" కర్కశంగా ఉంది వసంత గొంతు. "ఇ... కాదు ఎఫ్.... ఊహూ సి..." ఏడుస్తూ సగం అక్షరాలు మింగుతోంది పింకీ. తప్పు చెప్పిన ఒక్కో అక్షరానికి ఒక్కో మొట్టికాయ నెత్తిన పడుతోంది. ఆ పిల్ల మళ్ళీ మళ్ళీ చదవాల్సి వస్తోంది. ఒక్కోసారి కరెక్టుగా చదివినా "మళ్ళీ చదువు" అంటోంది తల్లి కఠినంగా. తడబడితే మళ్ళీ దండన కార్యక్రమం. బుగ్గలు ఎర్రగా కందిపోయి, కళ్ళనీళ్ళు ధారాళంగా కారుతుంటే తుడుచుకోవడానిక్కూడా వీల్లేని పరిస్థితి ఆ పసిదానిది. ఇలా ఐదు నిమిషాల పాటు సాగిందా హింసాత్మక శిక్షణా దృశ్యం.

"మీ ఆవిడ భలే చదువు చెప్తోందిరోయ్!" మిత్రుల మాటలతో సుందర్రావు ముఖం పాలిపోయింది. "రేయ్... రేయ్... రేయ్... ఆ వీడియో నాకు ఫార్వర్డ్ చెయ్యి." భాస్కర్రావు అన్నాడు. సుందర్రావు వారించేలోగానే శేఖర్ వాళ్ళ ఫ్రెండ్స్ వాట్సప్ గ్రూపులో షేర్ చేసేశాడు. అవును, ఇప్పుడు నోటికంటే స్పీడుగా సోషల్ మీడియా మాట్లాడుతోంది.

×××

రాత్రి పదిన్నరకు ఇల్లు చేరాడు సుందర్రావు. భార్య తలుపు తీసీ తియ్యంగానే చెంప పగలగొట్టాడు. "ఏంటే నువ్వు చేసిన పని? పిల్లను చదివించమంటే వీడియో తీసి వాట్సప్ లో పెడతావా?" "మరి నేనేం చెయ్యను? నేనస్సలు చదువు చెప్పడం లేదని కదా మీ అనుమానం. అందుకే ఋజువు కోసం వీడియో తీసి పంపించాను." వసంత ఏడుస్తూ చెప్పింది. "తీస్తే నేనొచ్చాక చూపించొచ్చు కదా, వాట్సప్ లో పంపించాలా? అక్కడ నా ఫ్రెండ్స్ ముందు నా పరువేమవుతుందో ఆలోచించావా? అందరూ ఎంత బాగా చదువుతున్నారో వీడియోల్లో చూపిస్తున్నారు. ఇదిగో ఇక్కడ చూడు, ఈ పిల్లకు నిండా నాలుగేండ్లు లేవు, దేశదేశాల రాజధానులన్నీ గడగడా చెప్తోంది. వీడు చూడు, వేలెడంత లేడు, ఏ లెక్క అడిగినా చిటికెలో చేసి చెప్తున్నాడు. నీకు టీవీ చూసేకి సరిపోతోంది, పిల్లకు నాలుగక్షరాలు నేర్పమంటే తప్పులు తడకలు చదువుతుండేది వీడియో తీసి పంపించావు." వసంతను మాట్లాడనివ్వకుండా జుట్టు పట్టుకొని వంగదీసి పిడిగుద్దుల మోత మోగించాడు. చివరికి అలసిపోయి బెడ్ మీద పడిపోయాడు. భర్త కోసం భోంచేయకుండా ఎదురుచూసిన వసంతకు ఆరాత్రి ఉపవాసం, జాగరణ మిగిలాయి.

×××

పక్కనే ఉన్న మొబైల్ మోగడంతో ఏడున్నరకు బద్ధకంగా లేచాడు సుందర్రావు. "రేయ్ ఫేస్ బుక్ లో, యూట్యూబ్ లో నీ కూతురు వీడియో మార్మోగిపోతోంది చూశావా?" సుందర్రావు అన్న ఫోన్లో వాయించేస్తున్నాడు. "అన్నా అదీ... నా పెళ్ళాం చేసిన ఘనకార్యం. పిల్లను చదివించమంటే వీడియో తీసి నాకు పంపించింది. అది నా ఫ్రెండ్స్ కంటబడి మొత్తం పాకిపోయినట్టుంది." సంజాయిషీ ఇచ్చుకుంటున్నాడు సుందర్రావు. "తెలివుండే పనులే చేస్తున్నారా మీరు? అవతల అవకాశం దొరికింది గదాని ప్రతి ఒక్కరూ తెగ కామెంట్లు పెట్టేస్తున్నారు." అన్న మాటలు వినలేక ఫోన్ పెట్టేశాడు సుందర్రావు.

ఆఫీసు కెళ్ళగానే ఒకటే గోల. "ఏంట్రోయ్ సుందర్రావ్....? బిడ్డను తెగ చదివించేస్తున్నారే...?" "చిన్నపిల్లను ఇలా హింసించి చదివించొచ్చా?" "ఇదే గనుక ఏ అమెరికా లోనో అయితేనా ఈపాటికి జైల్లో పెట్టేవాళ్ళు." ఇలా రకరకాలుగా ఎవరికి తోచినట్టు వాళ్ళు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. "ఎదవలు, అవకాశం దొరికింది గదాని తెగ వాగుతున్నారు. వాళ్ళు మాత్రం వాళ్ళ పిల్లల్ని అక్కడికి కొట్టకుండా, తిట్టకుండా చదివిస్తున్నట్టు." తిట్టుకుంటూ ఇక అక్కడ ఉండలేక మధ్యాహ్నమే ఇంటికి చేరాడు సుందర్రావు. వంటగదిలో సతమతమవుతున్న వసంతను కేకేశాడు. "నీ మూలంగా నాకు మనశ్శాంతి కరువైపోయింది. కాస్త పిల్లను చదివించమంటే అంతా గబ్బు పట్టించేశావు. ముందు నువ్వు తట్టా బుట్టా సర్దుకొని మీ పుట్టింటికి చావు." "అదికాదండీ..." ఏదో చెప్పబోతున్న వసంతను గూబ గుయ్యిమనిపించాడు. "ముందు పిల్లను తీసుకొని మీ ఇంటికి పొయ్యిచావు." ఇంకో మాట మాట్లాడటానికి అవకాశం లేకుండా వసంతను బయటకు తోసి తలుపేసుకున్నాడు.

×××

వాడిపోయిన ముఖంతో బిడ్డను తీసుకొని పుట్టింటికొచ్చిన వసంతను చూసి ఏదో జరిగిందని ఊహించింది ఆమెతల్లి వనజాక్షి. అప్పటికే వీడియో గురించి కొడుకు ద్వారా తెలుసుకుంది. "ఏమయిందే?" తల్లికి సమాధానం చెప్పకుండా విసురుగా లోపలికెళ్ళి ఏడుస్తూ కూచుంది వసంత. "అక్కా ఏంటిది?" తమ్ముడు ఫోన్లో వీడియో చూపిస్తూ అడిగాడు. "అంతా నా ఖర్మ" వసంత భోరున ఏడ్చేసింది. "సరేలేరా, కాస్త దాన్ని కుదుటపడనీ. వదిలెయ్, అంతా

సర్దుకుంటుంది." వనజాక్షి నచ్చజెప్తూ అంది. రాత్రంతా నిద్రలేని వసంత కాస్త ఎంగిలి పడగానే నిద్రలోకి జారుకుంది.

"వసంతా, లే. ఏంటా మొద్దు నిద్ర. టైం ఆరయిపోతోంది. లేచి రెడీ అవ్వు. అట్ల గుడికన్న పోయొద్దాం. కాస్త మనసుకు ప్రశాంతంగా ఉంటుంది.'' తల్లి మాటలతో వసంత బలవంతంగా లేచి తయారయింది.

×××

కారు సడన్ బ్రేక్ వేయడంతో పుస్తకంలోంచి తలెత్తింది స్వరాజ్యం. "ఏమ్మా కాస్త చూసుకొని రోడ్డు దాటచ్చు కదా!" విసుక్కుంటోంది ఆమె కూతురు గీత. రోడ్డు దాటుతున్న వనజాక్షిని పరీక్షగా చూసిన స్వరాజ్యం "గీతా, కాస్తాగు!" అంటూ కారు దిగి, "అమ్మా, మీరు వనజాక్షి టీచర్ కదూ!" అడిగింది. "అవును మీరు....?" ప్రశ్నార్థకంగా చూసింది వనజాక్షి. "మా అమ్మాయి గీత తాడిపత్రిలో మీదగ్గర 1, 2 తరగతులు చదివింది. మీకు గుర్తుందా? %u% మీ అమ్మాయి 'అ' మొదలు 'క్ష' వరకు అక్షరాలన్నీ గుర్తు పడుతుంది, ఏది రాయమన్నా రాస్తుంది, వరసగా రాయమంటే మాత్రం రాయదంటూ కంప్లయింట్ చేసేవారు." గీత, వసంత అర్థం కాక చూస్తున్నారు. "అవును, మిమ్మల్నెలా మరచిపోగలను? నా కంప్లయింట్ కు మీరిచ్చిన జవాబు అలాంటిది. %u% అసలు వరుసగా రాయాల్సిన అవసరం ఏముంది? అక్షరాలన్నీ వచ్చు కాబట్టి ఇంకేమన్నా నేర్పించండి మా పాపకు %u% అన్నారు కదా! మీ లాంటి పేరెంట్ ను, మీ పాపలాంటి స్టూడెంట్ ను నా సర్వీసు మొత్తంలో ఎప్పుడూ, ఎక్కడా చూడలేదు. హోంవర్క్ ఎక్కువిస్తే మీరసలు ఒప్పుకునేవారు కాదు పిల్లల మీద ఒత్తిడి ఉ ండకూడదంటూ. ఇంతకూ మీ పాప ఎక్కడుంది, ఏం చేస్తోంది?" సంభ్రమంగా అంటోందావిడ. "ఇదుగో ఇక్కడే ఉంది. సైకాలజీ చదివి జనాలను కౌన్సిలింగ్ చేస్తోంది. అడపాదడపా కథలూ %u% కవిత్వపు కాకరకాయలూ పండిస్తోంది. గీతా, ఈవిడ వనజాక్షి గారు. నీ ఫస్ట్ టీచర్." పరిచయం చేసింది స్వరాజ్యం, గీతకు. చేతులు జోడించి నమస్కరిస్తున్న గీతతో, "వాస్తవానికి మీ అమ్మే నీ ఫస్ట్ టీచర్. ఆతరువాతే నేను. నువ్వు కూడా నాకప్పట్లో అదుతేంగా తోచేదానివి." మెచ్చుకోలుగా అంటున్న వనజాక్షితో, "ఇందాక మీతో అలా మాట్లాడినందుకు క్షమించండి. రండి, నేను డ్రాప్ చేస్తాను." అంటూ బ్యాక్ డోర్ తీసింది. వాళ్ళు కార్లో కూర్చున్న తర్వాత, కారు స్టార్ట్ చేస్తూ, "ఈ పాప...?" పింకీ కేసి చూసింది. "తను మా అమ్మాయి వసంత, ఈపాప వసంత కూతురు పింకీ." వనజాక్షి పరిచయం చేయగానే, "ఈరోజు ఉదయం నేనో వీడియో చూశాను. అచ్చం ఈ పాప లాగానే ఉంది." గీత మాట పూర్తి కాకుండానే వనజాక్షి అందుకుంది. "లాగానే ఉండటం కాదు, ఈ పాపే. ఆ వీడియో నుంచి నా బిడ్డ కొచ్చిన కష్టాలు అన్నీ ఇన్నీ కాదు." "చిన్న పిల్లలపట్ల అలా అంత కఠినంగా వ్యవహరించడం తప్పే కదండీ, దానివల్ల పిల్లలకు నిజంగా చదువొస్తుందంటారా?" గీత మాటలకు వసంత బాధ పడింది. "నేనేం చెయ్యనండి. నాకు మాత్రం నా బిడ్డ మీద మమకారం ఉండదా?" స్వరాజ్యం టాపిక్ మారుస్తూ, "ఇంతకూ మీరెక్కడికెళ్ళాలి?" అడిగింది వనజాక్షిని. "ఆ వీడియో పుణ్యమాని మా అల్లుడు దీన్ని పుట్టింటికి తరిమేశాడు. కాస్త మనసుకు ప్రశాంతంగా ఉంటుందని గుడికి తీసుకెళ్తున్నా." వనజాక్షి బదులిచ్చింది. "గుడికి పోతే సమస్య పరిష్కారం కాదు గానీ, ఎలాగూ అనుకోకుండా కలిశాం, ఈరోజు మా గీత కౌన్సిలింగ్ సెంటర్ కు వెళ్లి ఏమన్నా ఉపయోగం ఉంటుందేమో చూడండి." స్వరాజ్యం మాటలతో వనజాక్షి "ఏమంటావు వసంతా?" అడిగింది. వసంత అయిష్టంగానే అంగీకరించింది. "సరే గీతా, నేను మీ టీచరు గుడికెళ్తాం. నువ్వు వసంతను తీసుకెళ్ళు." అంటున్న తల్లితో "సరేమా" అని పెద్దవాళ్ళిద్దరినీ, పింకీని గుడి దగ్గర డ్రాప్ చేసి, వసంతను మాత్రం తనతో తీసుకెళ్ళింది గీత. ఒక ఫ్రెండ్ లాగా అవీఇవీ మాట్లాడి తన పట్ల నమ్మకం కలిగాక అప్పుడు అడిగింది. "ఇప్పుడు చెప్పండి, అసలెందుకు ఆ పసిదాని పట్ల అలా ప్రవర్తించారు? దాన్ని మళ్ళీ వీడియో తీసి ఎందుకు పోస్ట్ చేశారు?" వసంతకు మొట్టమొదటిసారిగా తన గుండె బరువు దించుకోవడానికి అవకాశం వచ్చినట్లనిపించింది. మొదటినుంచీ జరిగిన విషయాలు చెప్పుకొచ్చింది.

"డిగ్రీ పూర్తయ్యాక నా పెళ్లి చేశారు. చదువు కొనసాగిస్తానంటే మా ఆయన వినలేదు. నువ్వేం చదివి ఉద్యోగాలు చెయ్యక్కర్లేదు, ఊళ్ళేలక్కర్లేదు. పిల్లలకింత చదువు చెప్పుకుంటే చాలని ఆపేశారు. పాపకు రెండేళ్ళు రాగానే స్కూల్లో వెయ్యాలని ఆరాటం. వయసు సరిపోక స్కూల్లో జాయిన్ చేసుకోకపోతే, అతికష్టం మీద సంవత్సరం ఆగి, ఈ ఏడాది జాయిన్ చేశారు. స్కూల్లో చేరి మూన్నెల్లే అయింది. కొంతమంది పిల్లలు త్వరగానే నేర్చుకొని రాస్తున్నారు. మా పాపకు మాత్రం ఎంత నేర్పించినా రావడం లేదు. దానికితోడు టీచర్ కంప్లయింట్ %u% ఒకచోట కుదురుగా కూర్చోదని. ఇంట్లో ఆయన సాధింపులు %u% నేను చెప్పక పోవడం వల్లనే సరిగ్గా రాయలేకపోతోందని. కొంతమంది పిల్లలు దేశదేశాల రాజధానులు, కరెన్సీ వివరాలు టకటకా ఎలా చెబుతారో నాకర్థం కాదు. వాళ్ళను చూపించి, మనపిల్ల ఎందుకట్ల లేదు అంటూ నాపై చేయి చేసుకుంటారు. నేనెంతగా చెప్పినా అది రిసీవ్ చేసుకోవట్లేదు అంటే %u% నీకెంతసేపు టీవీ సీరియళ్ళు చూసేకి సరిపోయె" అంటూ నరకం చూపిస్తున్నారు. ఆ కోపంతో పాటు, ఆయనకు నేను చదివించేది నిరూపించడానికే వీడియో తీసి పంపించాను. అది ఎలా వైరల్ అయిందో నాకు తెలీదు. ఇప్పుడు దానికీ నన్నే శిక్షిస్తున్నారు."

వసంత మాటలు విన్న గీత, ''ఈ కాసేపట్లో మీపాపను గమనించినంతలో ఆమెలో ఎటువంటి ప్రవర్తనాలోపం లేదు. కాకపోతే లెర్నింగ్ లెవెల్స్ ఒక్కొక్కరిలో ఒక్కో రకంగా ఉంటాయి. ఇందాక మీ అమ్మగారు అదే మా టీచరు గారు అన్నారు కదా, నేను అదుతేంగా తోచేదాన్నని, నిజానికి ఈ భూమ్మీద ప్రతి చైల్డ్ అదుతేమే. మనమే వాళ్ళను ఓ మూసలో తయారు చేయాలనీ చూస్తాము. అలా తయారు కాకపోతే మనం బాధ పడిపోయి వాళ్ళపై ఒత్తిడి పెడతాము. కొంతమంది పిల్లలు ఎలా అన్నీ చెబుతారంటారా, అది వాళ్ళు అర్థం చేసుకొని కాదు, అదో సర్కస్ ఫీట్ లాగా నేర్చుకుంటారంతే. అందరు పిల్లలూ అలాగే ఉండాలని తల్లిదండ్రులు అత్యాశకు పోతే విభిన్న రంగాలలో వేలిగేదెవరు? అయినా కౌన్సిలింగ్ కావాల్సింది నీకు, మీ పాపకు కాదు, మీ ఆయనకు. నా ఫ్రెండొకతను ఇదే ఫీల్డ్ లో ఉన్నాడు. మీ ఆయన అడ్రసు వివరాలివ్వు. తనతో చెప్పి మెల్లగా స్నేహం చేసి కౌన్సిలింగ్ చేయమంటాను. సరేనా?" గీత మాటలతో వసంత ముఖం విప్పారింది.

# అసహనానికి పరాకాష్ట



ప్రముఖ పాత్రి కేయులు రాలు, అభ్యు దయవాది గౌరీలంకేష్ కర్ణాటక రాజధాని బెంగళూరులో హత్యకు గురికావడం సంచలనం సృష్టించింది. సెప్టెంబర్ 5వ తేదీ రాత్రి కొంతమంది దుండగులు ఆమెను ఆమె నివాసంలోనే అతి సమీపం నుండి కాల్చడం వల్ల ఆమె చనిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు.

గత కొన్ని సంవత్సరాలుగా కర్ణాటకలో వరుసగా జరుగుతున్న హేతువాదుల, అభ్యుదయ వాదుల, ప్రజాస్వామిక శక్తుల హత్యలు అందరినీ ఆందోళనకు గురిచేస్తున్నాయి. 2013లో నరేంద్ర దబోల్కర్, 2015లో గోవిందపన్సరే, ఎంఎం కల్బుర్గి హత్యలు కూడా ఇలాగే జరగడం యాధృచ్ఛికంకాదు, పథకం ప్రకారమే జరుగుతున్నట్లుగా కనిపిస్తున్నది. తమ భావాలను అంగీకరించని వారిని హత్య చేయడమే లక్ష్యంగా కొన్ని ఛాందసవాదశక్తులు బరితెగించి చంపడం మనం చూస్తున్నాము.



కె.నాగమల్లేశ్వరరావు
అధ్యక్షులు
UTF గుంటూరు జిల్లా

కర్ణాటకలోని శివమొగ్గలో 1962లో జన్మించిన గౌరీ తండ్రి పి.లంకేష్ ప్రముఖ రచయిత, కవి, సాహిత్య విమర్శకుడు అన్నిటికీ మించి ఆయన ఒక అభ్యుదయవాది. బెంగళూరు విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదిలివేసి, పాత్రికేయవృత్తిని పూర్తికాల వ్యాపకంగా స్వీకరించారు. 'లంకేష్ పత్రిక'ను స్థాపించి నడిపారు. ప్రజా దృక్పథానికి పెద్దపీట వేసి, జనం సమస్యలను చర్చించారు. ఆ ఒరవడినే అందిపుచ్చుకున్న గౌరీ బెంగళూరులో డిగ్రీ వరకు, ఢిల్లీ జెఎన్‌యులో జర్నలిజం చదివారు. తండ్రి ద్వారా అబ్బిన అభ్యుదయ భావజాలానికి జెఎన్‌యు మరింత పదును పెట్టింది. వామపక్ష భావజాలం ఆమెను బాగా ప్రభావితం చేసింది. పాత్రికేయవృత్తిని ఎంచుకున్న ఆమె ఢిల్లీ, ఫ్రాన్స్, అమెరికాలలో జర్నలిస్టుగా పనిచేశారు. తరువాత బెంగళూరులో పనిచేసి, తండ్రి మరణంతో ఆయన స్థాపించిన 'లంకేష్' పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు వహించారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పరిశోధనాత్మక కథనాలు వ్రాయడంతో పాటు, అనేక సభల్లో పాల్గొనడం, మత సామరస్య వేదికలను ఏర్పరచి జర్నలిస్టు యొక్క సామాజిక బాధ్యతను సంపూర్ణమైన ఉదాహరణంగా నిలిచారు. ఆ తరువాత జరిగిన పరిణామాలలో తన పేరుమీదనే 'గౌరీలంకేష్' పేరుతో పత్రికను ప్రారంభించారు.

సత్యాన్వేషణలో దృఢమైన మనోబలం కలిగిన గౌరీ తాను నమ్మిన సిద్ధాంతం విషయంలో ఎక్కడా రాజీపడకుండా, బెదిరింపులకు భయపడకుండా, మతోన్మాదశక్తుల దుర్మార్గ చర్యలను బయటపెడుతూ, వారి టార్గెట్‌గా మారారు. మహిళ అయిఉండి కూడా ఏనాడు మత శక్తుల బెదిరింపులకు బయపడిన పరిస్థితిని చూడలేము.

అక్షరమే ఆయుధంగా తుదిశ్వాస వరకు కలం బలాన్ని ప్రపంచానికి చాటిన గౌరీ చివరిసారిగా తన వారపత్రిక అయిన 'గౌరీ లంకేష్ పత్రిక'లో ఈనాటి రాజకీయ వార్తలలో నకిలీ వార్తలను, గోబెల్స్‌లాగా ప్రచారం చేస్తున్న పత్రికలు, మంచి నాయకులను చెడ్డవారీగా, భారత సామాజిక భిన్నత్వ పునాదులను దుంపనాశనం చేస్తున్న వారిని తిరుగులేని నాయకులుగా చిత్రిస్తున్న విధానాన్ని తన సంపాదకీయంలో వివరించే ప్రయత్నం చేశారు. సమకాలీన అంశాలైన 'డేరాబాబా' (గుర్మీత్‌రామ్ రహీమ్ సింగ్, సచ్చా సౌధా డేరా బాబా)తో సంబంధాలు కలిగిన రాజకీయ నాయకుల అసలు స్వరూపాలను, మతపరమైన పండుగలను అడ్డుపెట్టుకొని వివిధ మతాలకు చెందినవారిని రెచ్చగొట్టే పద్ధతిని ఆమె దునుమాడుతూ వాస్తవాలను బయటికి తెచ్చే ప్రయత్నం చేశారు.

కలంపై తూటాదాడులను ఖండిస్తూ దేశవ్యాప్తంగా గౌరీ హత్యకు నిరసనగా జరిగిన ప్రదర్శనలు ఉన్మాదుల్లో మరింత అసహనాన్ని పెంచుతున్నాయి. అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ (ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్)తో సహా దేశవ్యాప్తంగా ఉన్న అభ్యుదయ, ప్రజాస్వామిక వాదులందరూ, ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల్లో కూడా తమ నిరసన గళం వినిపించడం అభినందనీయం. ఇప్పటికే ఆహారం, వస్త్రధారణ, ఇతర సాంస్కృతిక అంశాలపై జరుగుతున్న దాడి ఆందోళన కలిగిస్తుంది. 'చూస్తూ కూర్చుంటే మేస్తూ పోయినట్లు' ఇప్పుడు కర్ణాటకలో, మహారాష్ట్రలో జరిగినది రేపు ఆంధ్రప్రదేశ్‌లో జరగవచ్చు. 2వ ప్రపంచయుద్ధ సమయంలో ప్రముఖంగా చెప్పబడిన కొటేషన్ "నాజీలు మొదట యూదుల కోసం, తరువాత కమ్యూనిస్టులకోసం, సోషలిస్టులకోసం.... వస్తే ఎవరికి వారు మనకోసం కాదు కదా అని మిన్నకుంటే చివరికి వారికోసమే వస్తే వారి తరుపున మాట్లాడే టందుకు ఎవరూ మిగలని పరిస్థితి. ఇది రేపు మనదాకా వస్తుంది. వాళ్ళు మనకోసమూ వస్తారు.

చివరిగా ఈ హ్యతలపై ప్రభుత్వ స్పందన ఆందోళనకరం కల్బుర్గి లాంటి వారి హత్య జరిగినప్పుడు ఒక స్పెషల్ టీమ్‌ను వేసి చేతులు దులుపు కున్నారు. అప్పుడే దానిని తీవ్రంగా పరిగణించి రెచ్చగొట్ట బడిన అసహన భావాలకు ప్రతినిధులుగా బయలుదేరినవారు చేస్తున్న ఈ హత్యల పట్ల ఉదాశీనంగా వ్యవహరించడమే ఈ పరంపర కొనసాగ దానికి కారణం. ఇకనైనా భారత సామాజిక భిన్నత్వ పునాదులలో వున్న వాస్తవికతను అర్థం చేసుకొని ఈ రకమైన ఉన్మాదశక్తులను అదుపుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.

# గిరిజన సంక్షేమ టీచర్లను ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌లో చేర్చాలి

## యుటియఫ్ రాష్ట్ర సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.





యుటియఫ్ ఆధ్వర్యంలో "గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సు"ను విశాఖపట్నంలోని ఎన్‌పిఆర్ భవన్ (సిఐటియు ఆఫీస్)లో యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి అధ్యక్షతన సెప్టెంబర్ 21న జరిగింది.

రాష్ట్ర సదస్సులో ముందుగా అభ్యుదయ రచయిత గురజాడ అప్పారావు 155వ జయంతి సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి, రాష్ట్ర కార్యదర్శులు డి.రాము, గొంటి గిరిధర్, విశాఖపట్నం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.ఎ.ఆర్.కె. ప్రసాద్, కె.కె.జాజులు, వివిధ జిల్లాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాడ స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్ళాల్సిన బాధ్యత మనపై ఉందని ఐ.వెంకటేశ్వరరావు సందేశమిచ్చారు.

రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ గిరిజన విద్యారంగంలో సుమారు 3 దశాబ్దాలుగా పనిచేస్తున్న గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్యం, వివక్షను తీవ్రంగా ఖండించారు. 1975 సం॥లోనే గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను లోకల్ కేడర్ చేస్తూ ప్రెసిడెన్షియల్ ఉత్తర్వులు వున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 20న విడుదల చేసిన ఉమ్మడి సర్వీస్‌రూల్స్ ఉత్తర్వులు జిఓ 72,73,74లలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను చేర్చకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సర్వీసులను తప్పనిసరిగా ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటికే ఐటిడిఏలకు శాంక్షన్ కాబడిన అన్ని క్యాడర్ పోస్టులకు ప్రభుత్వం ఆర్థికపరమైన అనుమతిని ఇవ్వాలని, తద్వారా పదోన్నతులు జరపాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో జిఓ 3ను అమలు చేయాలన్నారు.

రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి ప్రసంగిస్తూ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌లో చేర్చే వరకు యుటియఫ్ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని, రాష్ట్ర కమిటీ చర్చించి భవిష్యత్ కార్యక్రమాలను ప్రకటిస్తుందని అన్నారు.

రాష్ట్ర కార్యదర్శి డి.రాము ప్రసంగిస్తూ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, గిరిజన సంక్షేమ పాఠశాలల అభివృద్ధికోసం యుటియఫ్ నికరంగా పోరాటం చేస్తుందని, పోరాటాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ప్రసంగిస్తూ గిరిజన విద్యారంగ బలోపేతం కోసం, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం పోరాటమే సరైన మార్గమని తెలిపారు. జిల్లాల వారీగా జి.వెంకటరావు, సుజాత (విజయనగరం), సింహాచలం, పద్మశ్రీ, జగదీశ్వరరావు, సూర్యనారాయణ, ఆరిక భాస్కరరావు, (శ్రీకాకుళం), కె.ఆదిరెడ్డి, మంగరాజు, సూర్యనారాయణ (తూర్పుగోదావరి), కృష్ణారావు, శ్రీరాములు, వి.మహేశ్ (విశాఖ), పాల్గొన్నారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నుండి సుబ్బారావు, కృష్ణరావు, నారాయుడు, విజయనగరం జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి, మురళీమోహన్, విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రసాద్, జాజులు మాట్లాడారు.

ఈ సమస్యలు ప్రభుత్వానికి ప్రాతినిధ్యాం చేయాలని నిర్ణయించడమైనది.

1. సర్వీస్‌రూల్స్‌లో తక్షణమే కలపడం సాధ్యం కాకపోతే గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఖ్యను బట్టి దామాషా పద్ధతిలో అన్ని స్థాయిల పోస్టులు పదోన్నతులు కల్పించాలి.
2. ఐటిడిఏలకు ఇప్పటికే శాంక్షన్ కాబడి ఉన్న పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతిని సాధించాలి.
3. అన్ని ఐటిడిఏలకు పిఇటిలు, భాషా పండితుల పోస్టులను శాంక్షన్ చేయించాలి.
4. స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలి.
5. ప్రత్యేకించి పాడేరు ఐటిడిఏలో 1998లోనే శాంక్షన్ కాబడిన ఎల్‌ఎఫ్‌ఎల్ పోస్టులు ఇప్పటివరకు పదోన్నతులకు నోచుకోలేదు. అన్ని ఐటిడిఏలలో ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రమోషన్స్ ఇవ్వబడినాయి.
6. గిరిజన సంక్షేమ పాఠశాలలన్నింటికీ మౌలిక సదుపాయాలు కల్పించాలి.

# ప్రశ్నోత్తరాలు



*నిర్వహణ : టియస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,*
ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు
mail : ikyopadhyaya1975@gmail.com

ప్రశ్న : **నేను 30.08.1998లో ఉద్యోగంలో చేరాను. 21.09.2007 నుండి 30.09.2007 వరకు 10 రోజులు జీత నష్టపు సెలవు పెట్టుకొనియున్నాను. నా ఇంక్రిమెంట్ ఆగస్టులోనే కొనసాగుచున్నది. జీతనష్టపు సెలవు కారణంగా ఇంక్రిమెంట్ సెప్టెంబరుకు వాయిదా పడుతుందని, ఇప్పటి దాకా చెల్లించిన సొమ్ము రికవరీ చేయాలని అంటున్నారు. సరియైనదేనా?**

**-ఆకురాతి వాసు, రేపల్లె, గుంటూరు**

**జవాబు :** సరియైనది కాదు. జిఓ నం.133; తేది.03.05.1974 మరియు మెమో నం.49643; తేది.06.10.1974 ప్రకారం ఇంక్రిమెంట్ నెల మొదటి తేదీన ఉంటుంది. మీరు 10 రోజులు జీతనష్టపు సెలవు పెట్టినందున ఇంక్రిమెంట్ ఆగస్టు 1వ తేదీ నుండి 10వ తేదీకి వాయిదా పడుతుంది. నెలమధ్యలో ఇంక్రిమెంటు ఉండదు కాబట్టి ఆగస్టు 1వ తేదీగానే ఇంక్రిమెంట్ కొనసాగుతుంది. చేరిన తేదీని బట్టి లెక్కించడం సరైనదికాదు.

ప్రశ్న : **నేను జులై 13వ తేదీన ఉద్యోగంలో చేరాను. నా ఇంక్రిమెంట్ జులై నెలలో కొనసాగుతున్నది. నేను జూన్ 30న ఉద్యోగ విరమణ చేశాను. రిటైర్మెంట్ మరుసటి రోజు ఇంక్రిమెంట్‌తో పెన్షన్ ప్రతిపాదనలు డిఇఓ కార్యాలయానికి పంపగా, మీ ఇంక్రిమెంట్ 13వ తేదీ కావున మీకు వర్తించదు అని అభ్యంతర తెలుపుతున్నారు. సరియైనదేనా?**

**- పీటా ప్రసాద్, రేపల్లె, గుంటూరు**

**జవాబు:** సరియైనది కాదు. పై ప్రశ్నకు సంబంధించిన జవాబులో పేర్కొన్న ఉత్తర్వుల ప్రకారం ఇంక్రిమెంట్ నెల మొదటి తేదీ ఉంటుంది. ఉద్యోగంలో చేరినతేదీ కాదు. కావున మీకు రిటైర్మెంట్ మరుసటి రోజు ఇంక్రిమెంట్ నోషనల్‌గా మంజూరుచేసి పెన్షన్ ప్రతిపాదనలు ఆమోదించాలి.

ప్రశ్న :1. **ఎస్‌సికి చెందిన నేను ఓపెన్‌లో సెలెక్ట్ అయ్యానని, ఎస్‌సి కేటగిరీలో సెలెక్ట్ అయినా నాకన్నా తక్కువ మార్కులు వచ్చిన వారిని సీనియార్టీ జాబితాలో ముందు వుంచారు. సరియైనదేనా?**

**- బి.అరుణకుమార్, కంచికచర్ల**

2. **బిసిబి సంబంధించిన నేను సీనియార్టీ లిస్ట్‌లో ఓసి కేటగిరీలో సెలెక్ట్ అయ్యానని నా కన్నా తక్కువ మార్కులు వచ్చిన బిసిబి అభ్యర్థిని ముందుగా వుంచడం జరిగింది. వివరణ ఇవ్వగలరు.**

**-ఎస్.రాజు, ఒంగోలు**

**జవాబు :** జిఓ నం. 90 విద్య; తేదీ.03.11.2007 ప్రకారం రీ అరేంజ్‌మెంట్ చేయాలి. అప్పుడు మీ సమస్య పరిష్కారం అవుతుంది. ఆ విధంగా అప్పీలు చేయండి.

ప్రశ్న : **ఈ సం॥ 35 రోజులు అర్ధజీతపు సెలవు పెట్టియున్నాను. ఆ కాలానికి జీతం ఏ విధంగా లెక్కించాలి?**

**- పి.సుజాత, పాలకొల్లు**

**జవాబు :** 35 రోజులకు మూలవేతనం, డిఏ సగం, హెచ్ఆర్ఏలు పూర్తిగా చెల్లించబడతాయి.

ప్రశ్న : **అర్ధజీతపు సెలవు నగదుగా మార్చుకొనుటకు ఇచ్చిన జిఓకు ముందు ఉద్యోగ విరమణ చేసినవారికి కూడా వర్తిస్తుందా?** **- మధు**

**జవాబు :** ఆ జిఓ అమలు తేదీ మీద క్లారిఫికేషన్ ఇవ్వాలని డిటిఏ ఆర్థిక శాఖను కోరడం జరిగింది. 4-5-2010 నుండి అమలు చేయాలని యుటియఫ్ డిమాండ్ చేస్తోంది.

ప్రశ్న : **నేను ఉన్నత చదువుల నిమిత్తం 78 రోజులు జీత నష్టపు సెలవు పెట్టియున్నాను. ఆ కాలానికి నాకు ఇంక్రిమెంట్ వాయిదా వేశారు. ఇంక్రిమెంట్ వాయిదా పడకుండా ఎవరి వద్దనుండి ఉత్తర్వులు పొందాలి.**

**- ఎస్.వి.ఆర్.సౌజన్య, పిడుగురాళ్ళ**

**జవాబు :** ఇంక్రిమెంట్ వాయిదా పడకుండా ఉత్తర్వులు ఇచ్చే అధికారం ఎఫ్ఆర్-26 ప్రకారం 6 నెలల వరకు విద్యాశాఖ కమీషనర్‌కు మాత్రమే ఉన్నది. కాబట్టి మీరు కమీషనర్‌కి దరఖాస్తు పంపుకోవాలి.

ప్రశ్న : **నేను 2006 డిఎస్‌సిలో ఎస్‌జిటిగా ఎంపిక కాబడి మరల 2008 డిఎస్‌సి ద్వారా ఎస్ఏ (సోషల్)గా 23.10.2009న నియామకం పొందాను. మరొక ఉపాధ్యాయుడు 2008 డిఎస్‌సి ద్వారా ఎస్ఏ (ఇంగ్లీషు)కు ఎంపిక కాబడి 16.10. 2009న ఉద్యోగంలో చేరారు. మాలో ఎవరు సీనియర్?**

**- ఎన్.వి.గంగరాజు, నంద్యాల**

**జవాబు :** రెండు వేరు వేరు సబ్జెక్టులలో నియామకం పొందినప్పుడు చేరిన తేదీ ఆధారంగా సీనియార్టీ నిర్ణయించబడుతుంది. మీ స్నేహితుడే సీనియర్ అవుతారు.

ప్రశ్న : **ఇటీవల పండగ అడ్వాన్స్ పెంపుదల చేస్తూ జిఓ విడుదలవుంతుదన్నారు. ఎవరికి వర్తిస్తుందో తెలుపగలరు.**

**- ఎ.అనిల్, విజయనగరం**

**జవాబు :** 2015 పే స్కేళ్ళలో పండుగ అడ్వాన్స్‌తోపాటు వివిధ అలవెన్సులు పెంపుదల చేస్తూ జిఓ 167; తేది.20.09. 2017 విడుదల చేయడం జరిగింది. వేతన స్కేలు 26600-77030 లేదా అంతకన్నా తక్కువస్కేలు గల ఉద్యోగులకు రూ.7500/-లుగాను, నాల్గవ తరగతి ఉద్యోగులకు రూ.5000/-లుగాను పెంపుదల చేశారు.

## పాఠకులకు గమనిక

ఇ-మెయిల్ **(ikyopadhyaya1975@gmail.com)** లేదా లేఖల ద్వారా ప్రశ్నలు పంపేవారు వారి పేరు, గ్రామం, జిల్లా పేరు, ఫోన్ నంబరు, ఐక్య ఉపాధ్యాయ చందానంబరు తప్పనిసరిగా వ్రాయాలి. ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా ఉండాలి. జిఓ / మెమో కాపీలు కావలసిన వారు సంబంధిత జిల్లాలలో యుటియఫ్ కార్యాలయాలను లేదా బాధ్యులను సంప్రదించాలి. పత్రికా కార్యాలయం నుండి జిఓ / మెమో కాపీలు పంపుటకు వీలుకాదు.

**బదిలీ అయిన వారిని రిలీవు చేయాలి**

సబ్‌స్టిట్యూట్‌తో నిమిత్తం లేకుండా బదిలీ అయిన వారందరినీ రిలీవు చేయాలని, 2013, 2015 బదిలీలలో బదిలీ అయిన వారు కూడా కొందరు రిలీవు కాలేదని, ప్రమోషన్ పోస్టులను వెంటనే ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయుటకు ఆదేశాలు ఇవ్వాలని ఆగస్టు 29న మరియు సెప్టెంబరు 13న యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి, ఎమ్మెల్సీ బి.నాగేశ్వరరావు విద్యాశాఖ కార్యదర్శి ఆదిత్య నాథ్‌దాస్, కమీషనర్ కె.సంధ్యారాణి కలిసి విజ్ఞప్తి చేయడమైనది. డిఇఓల నుండి సమాచారం అందిన వెంటనే చర్యలు తీసు కొంటామని కమీషనర్ తెలిపారు.

**ఏజెన్సీలో డిప్యుటేషన్ పైనున్నవారిని రిలీవు చేయాలి**

గత సంవత్సరం నుండి డిఇఓ పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులు మైదాన ప్రాంతం నుండి ఏజెన్సీ విలీన మండలాలలో పనిచేస్తున్నారని, డిఇఓ పూల్‌లో నున్న వీరు ప్రస్తుత బదిలీలలో మైదాన ప్రాంతంలో అవసరమైన పాఠశాలలకు బదిలీ కోరుకున్నారని, వీరిని ఏజెన్సీ నుండి వెంటనే రిలీవు చేసి మైదానప్రాంత పాఠశాలలకు పంపించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. బదిలీ కోరుకొన్న వారిలో 50శాతం రిలీవు చేసినా కొందరు రిలీవు అవుతారని, ఆగస్టు 29న మరియు సెప్టెంబర్ 13న విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగింది.

**స్పెషల్ డిఎస్‌సి నియామకాలు వెంటనే చేయాలి**

ఏజెన్సీ విలీన మండలాలకు వెంటనే స్పెషల్ డిఎస్‌సి నియామకా లు చేయాలని కోరగా దీనికి సంబంధించి ప్రతిపాదనలు వెంటనే పంపించాలని కమీషనర్‌కు సెక్రటరీ ఆదేశించారు.

**ఎయిడెడ్ నాన్‌టీచింగ్ సిబ్బందికి ప్రమోషన్స్ ఇవ్వాలి**


ఎయిడెడ్ పాఠశాలల్లో నాన్‌టీచింగ్ సిబ్బందికి కూడ ప్రమోషన్లు ఇప్పించాలని విద్యాశాఖ కార్యదర్శికి విజ్ఞప్తి చేయడం జరిగింది. దీనిపై ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపుతున్నామని విద్యాశాఖ కార్యదర్శి తెలిపారు.

**సర్వీస్‌రూల్స్ వెంటనే విడుదల చేయాలి**

సర్వీస్‌రూల్స్‌కు సంబంధించి సంఘాలు, ఉపాధ్యాయుల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సర్వీస్‌రూల్స్ వెంటనే విడుదల చేయాలని సెప్టెంబర్ 13న విద్యాశాఖ కార్యదర్శి, కమీషనర్లకు విజ్ఞప్తి చేయడం జరిగింది. వారం రోజుల్లో ఉత్తర్వులు విడుదలకు చర్యలు తీసు కొంటామని చెప్పారు. ఆ ఉత్తర్వులు విడుదలైనాయి.

**మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ పథకం అమలు చేయాలి**

మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ డిటిఏ ద్వారా నిర్వహించాలని సెప్టెంబర్ 14న డిటిఏ కనకవల్లికి విజ్ఞప్తి చేయడం జరిగింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి నుండి వచ్చిన ప్రతిపాదనలు స్పష్టంగా లేవని డైరెక్టరు తెలియజేశారు. ఈ సమస్య పరిష్కారానికి డిటిఏ మరియు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాము. ఆ మేరకు మున్సిపల్ సిబ్బందికి పిఎఫ్ అమలుకు అందించాల్సిన సమాచారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారిని డిటిఏ కోరారు. ఈ సమాచారం మున్సిపాలిటీల నుండి వెంటనే పంపించాలి.



**ఐ.వెంకటేశ్వరరావు**
యుటియఫ్ రాష్ట్రఅధ్యక్షులు

**అర్ధ జీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్ 4.5.2010 నుండి అమలు చేయాలి**

అర్ధజీతపు సెలవు అమలుకు వివరణ ఉత్తర్వులు ఇవ్వాలని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ కె.కనకవల్లికి ఆగస్టు 30న, సెప్టెంబర్ 12న కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. 9వ పిఆర్‌సి సిఫారసుల మేరకు ఉపాధ్యాయులకు అర్ధ జీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్ అమలులోకి వచ్చిందని జిఓ ఎంఎస్ నం.154, తేది.04. 05.2010 నుండి నిలుపుదల చేశారని, ప్రభుత్వ ఉత్తర్వులు 148; తేది.21.08.2017 మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్ ఉపాధ్యాయులకు వర్తింపచేస్తూ ఉత్తర్వులు యిచ్చారని అయితే ఎప్పటినుండి అమలు అనే దానిపై క్రింది అధికారాలు వివరణ కోరుతున్నారని విజ్ఞప్తి చేశాము. ఈ ఉత్తర్వులు గతంలో నిలిపివేసిన తేదీ 04.05. 2010 నుండి అమలు చేసే విధంగా వివరణ ఉత్తర్వులు ఇవ్వాలని కోరగా దీనిపై ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. డిటిఏ పంపిన లేఖపై ఆర్థికశాఖ వివరణ ఉత్తర్వులు ఇప్పించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.

**నెల్లూరు డిఇఓపై చర్యలు తీసుకోవాలి**

నెల్లూరు జిల్లా విద్యాశాఖాధికారి ఉపాధ్యాయుల బదిలీలలో ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా వ్యవహరించారని, కౌన్సిలింగ్ హాలులో మహిళలను, సంఘాలను కించపరుస్తూ వ్యాఖ్యానాలు చేశారని, కొందరు ఉపాధ్యాయులను అకారణంగా సస్పెండ్ చేశారని, కావున డిఇఓ బాధ్యతల నుండి తొలగించాలని ఆగస్టు 29న విద్యాశాఖ కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, ఇన్‌చార్జి కమీషనర్ శ్రీనివాస్‌కు సెప్టెంబర్ 7న ఫ్యాప్టో తరపున విద్యాశాఖకార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది.

ఇన్‌చార్జి కమీషనర్‌గా బాధ్యతల్లో ఉన్న ఎస్ఎస్ఏ ఎస్‌పిడి శ్రీనివాస్ నెల్లూరు డిఇఓ కార్యాలయాన్ని తనిఖీ చేసి యిచ్చిన నివేదిక ఆధారంగా నెల్లూరు డిఇఓను సరెండర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

**అధికారాల బదలాయింపు అంటే ఆర్థికేతర అంశాలేనా?**

మున్సిపల్ పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు జిఓ ఎంఎస్ నం.339; తేది.14.09.2017 ద్వారా 4 ఆర్థికేతర అంశాలకు సంబంధించి అధికారాలు బదలాయిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్యకార్యదర్శి ఆర్.కరికాలావలవన్ ఇచ్చిన ఉత్తర్వు

లను యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆక్షేపించారు.

సదరు ఉత్తర్వులలో 7,10 తరగతుల విద్యార్థులకు వయస్సు మినహాయింపు, విద్యార్థుల మీడియం మార్పు చేయుటకు, హాజరు మినహాయింపుకు, ఐసిఎస్ఇ / సిబిఎస్ఇ సిలబస్ నుండి రాష్ట్ర సిలబస్‌కు విద్యార్థులను అడ్మిట్ చేసుకొనుటకు ప్రధానోపాధ్యాయులకు అధికారాలు బదలాయిస్తూ ఈ ఉత్తర్వులు ఇచ్చారు.

ఉపాధ్యాయుల సర్వీస్, సౌకర్యాల అమలుకు సంబంధించి జిఓ 40; తేది.07.05.2002 విద్యాశాఖ ఇచ్చిన అన్ని అధికారాలు మున్సిపల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు బదలాయించాలని యుటియఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

**11వ పిఆర్‌సిని వెంటనే వేయాలి - ఏపిజెఏసి**

ఉద్యోగులకు 11వ పే రివిజన్ కమిటీని వెంటనే నియమించాలని ఏపిజెఏసి నాయకత్వం సెప్టెంబర్ 27న సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేసింది. 01.07.2018 నుండి 11వ పిఆర్‌సి అమలు చేయాల్సిన నేపథ్యంలో వెంటనే పిఆర్‌సి కమిటీని నియమించాలని, 10వ పిఆర్‌సికి సంబంధించి 10 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని, రెండు విడతల డిఏలు విడుదల చేయాలని, నాల్గవ తరగతి ఉద్యో గులకు పదవీ విరమణ 60 సం॥ల నుండి 62 సం॥లకు పెంచాలని, ఏజెన్సీలో విఆర్‌ఓలకు పదోన్నతులు ఇవ్వాలని, ఖాళీలు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. 11వ పిఆర్‌సి వేయాల్సిన పరిస్థితిలో బకాయిలు చెల్లింపుకు ప్రభుత్వ విధానం స్పష్టం చేయాలని జెఏసి పట్టుబట్టింది.

తొలుత ముఖ్యమంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ కేంద్రం నుండి రావాల్సిన స్థాయిలో నిధులు రావడం లేదని, అనేక కోతలు పెడుతున్నారని, రాష్ట్రం తీవ్ర ఆర్థిక లోటులోకి చేరుకుందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే మీ డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు.

పిఆర్‌సి కమిటీ, అరియర్లు, డిఏ బకాయిలపై ఆర్థిక మంత్రి, అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకొందామని మరోసారి ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ప్రభుత్వ శాఖల పనితీరు గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ గురుకులాలు, ఉన్నత పాఠశాలలు బాగున్నాయని, ప్రాథమిక విద్య బాగా లేదని పేర్కొన్నారు. సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలు ఒకరు, ఇద్దరు టీచర్లతో నడుస్తున్నాయని, మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటుచేసినా పాఠశాలలకు మౌలిక వసతులు పరిస్థితిలో మార్పులేదని, గత 25 సం॥లుగా వ్యవస్థీకృతంగా జరిగిన లోపాలు ప్రాథమిక విద్యను దెబ్బతీశాయని, విద్యారంగంపై సంఘాలతో చర్చించాలని చెప్పడం జరిగింది. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ త్వరలో దీనిపై సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రతినిధివర్గంలో జెఏసి నాయకత్వం పి.అశోక్‌బాబు, ఐ.వెంకటేశ్వరరావు, ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, షణ్ముర్తి, కమలాకరరావు, పి.పాండురంగవరప్రసాదరావు, రియాజ్, మణికుమార్, కుల్లాయప్ప, హరనాథ్, వీరేంద్రబాబు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాప్టో జిల్లా కమిటీ ఎన్నికలు

నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఐక్యఉద్యమ వేదికగా ఫ్యాప్టో ఏర్పడినది. ఇప్పటివరకు అనేక సమస్యలపై ప్రాతినిధ్యాలు, పోరాటాలు చేయడమైనది. బదిలీలు, రేషనలైజేషన్ సందర్భంగా జాక్టో సైతం కలుపుకొని పోరాటాలు చేశాం.

ఫ్యాప్టో కార్యక్రమాలు మరింత విస్తృతంగా విజయవంతం నిర్వహిం చడం కోసం జిల్లా కమిటీలు ఎంపిక చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గం 02.09.2017వ తేదీన సమావేశమై నిర్ణయించింది.

ఆ మేరకు దసరా సెలవుల్లో 21వ తేదీ నుండి జిల్లాల్లో ఫ్యాప్టో కమిటీల ఎన్నికలు జరిగాయి. ప్రకాశం జిల్లా ఎన్నిక వాయిదా పడగా 12 జిల్లాల్లో బాధ్యులుగా ఎంపిక అయినారు.

| జిల్లా | చైర్మన్ | సెక్రటరీ జనరల్ |
|---|---|---|
| శ్రీకాకుళం | ఎస్.రాజశేఖర్ (APTF-1938) | రెడ్డి మోహన్‌రావు (UTF) |
| విజయనగరం | కె.శేషగిరిరావు (UTF) | డి.ఈశ్వరరావు (APTF-1938) |
| విశాఖపట్నం | బి.వెంకటపతిరాజు (APTF-257) | కె.జాజులు (UTF) |
| తూర్పుగోదావరి | డి.వి.రాఘవులు (UTF) | కె.శేఖర్ (STU) |
| పశ్చిమగోదావరి | బి.గోపీమూర్తి (UTF) | బి.ఏ.సాల్మన్‌రాజు (APTF-257) |
| కృష్ణా | కె.ప్రసాద్ (STU) | కె.ఏ.ఉమామహేశ్వర రావు (UTF) |
| గుంటూరు | ఎం.హనుమంతరావు (UTF) | వివి శ్రీనివాస్ (STU) |
| నెల్లూరు | ఎన్.నవకోటేశ్వర రావు (UTF) | ఎస్.చిరంజీవి (APTF-1938) |
| చిత్తూరు | ఆర్.సహదేవనాయుడు (STU) | ఎం.సోమశేఖరనాయుడు (UTF) |
| కడప | ఎం.రఘునాథరెడ్డి (STU) | ఎం.విజయకుమార్ (UTF) |
| కర్నూలు | హెచ్.తిమ్మన్న (STU) | ఎస్.ఇస్మాయిల్ (APTF-1938) |
| అనంతపురం | డి.ప్రభాకర్ (APTF-257) | కె.కులశేఖర్‌రెడ్డి (APTF-1938) |


**ఐక్య ఉపాధ్యాయలో ప్రకటనల రేట్లు**

| | | |
|---|---|---|
| 4వ కవర్ పేజీ (కలర్) | - | ₹ 30,000 |
| 2వ కవర్ పేజీ (కలర్) | - | ₹ 20,000 |
| 3వ కవర్ పేజీ (కలర్) | - | ₹ 20,000 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్) | - | ₹ 10,000 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్)ఆప్షనల్ | - | ₹ 11,000 |

# కలెక్టరు వైఖరికి నిరసనగా గురుపూజోత్సవం బహిష్కరణ



పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరుకి ఉద్యోగులను, ఉపాధ్యాయులను తీవ్రమైన పరుషమైన వ్యాఖ్యలతో అవమానపర్చడం నిత్యకృత్యంగా మారింది. గతంలో రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన చేపట్టిన పరిస్థితులలో జిల్లా మంత్రి సమక్షంలో సర్దుబాటు చేశారు. కాని కలెక్టరు వైఖరిలో ఎటువంటి మార్పులేదు. ఆయా శాఖల అధికారుల సమీక్షా సమావేశాలలో అధికారులను అవమానించడం, ఉద్యోగులను అవమాన పరిచే వ్యాఖ్యనాలు చేయడం షరామామూలే. విద్యాశాఖలో విపరీతమైన జోక్యం చేసుకుని పాఠశాల క్యాలెండర్ SCERT నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు ఉపయోగంలేని కార్యక్రమాలు అమలు చేయాలని ఒత్తిడి చేయటం, చేయలేని టీచర్లను సస్పెండ్ చేస్తానని బెదిరించడం, మెమోలు జారీ చేయించడం జరుగుతున్నది.

నెలలో ఒక రోజు ఉపాధ్యాయులంతా పాఠశాలలు మూసివేసి TLM ప్రదర్శనలు మండల కేంద్రాలలో నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేశారు. TLM ప్రదర్శనల తనిఖీ కోసం విద్యాశాఖకు సంబంధంలేని జిల్లాస్థాయి అధికారులను పంపించడం వారు వచ్చేవరకు రాత్రి ఏ సమయమైనా టీచర్లు ఎదురు చూడటం పరిపాటిగా మారినది. విద్యాహక్కు చట్టానికి భిన్నంగా ప్రతినెలా 1వ శుక్రవారం SMC సమావేశాలు, 4వ శుక్రవారం పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి సదరు ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. మే నెలలో కిచెన్ గార్డెన్స్ పెంచలేదని 922మంది ప్రధానోపాధ్యాయులకు మెమోలు జిల్లా విద్యాశాఖాధికారి ద్వారా జారీ చేశారు. మే నెలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వుండరని తెలిసికూడా కిచెన్ గార్డెన్స్ ఎవరికోసం పెంచాలో అర్థంకాని పరిస్థితి.

రెమిడియల్ క్లాసులు పేరుతో ఉదయం 1 గంట, సాయంత్రం 1 గంట అదనంగా పనిచేయాలని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. వీటన్నిటికి పరాకాష్టగా ఉపాధ్యాయులకు అవార్డులిచ్చే విషయంలో ఉపాధ్యాయులకు అవార్డులు ఎందుకు ఇవ్వాలి, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వండని ఆదేశించడం, అవార్డులు పొందిన టీచర్లను వేధిస్తానని బెదిరిస్తూ సమీక్షా సమావేశంలో కలెక్టరు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సదరు వ్యాఖ్యలు పత్రికలలో రావడంతో 10 ఉపాధ్యాయ సంఘాలు కలసి సెప్టెంబర్ 1వ తేదీన దశలవారీ ఆందోళనకు పిలుపునిచ్చి జాయింట్ కలెక్టర్‌కు నోటీసు అందజేశారు.

సెప్టెంబర్ 5 గురుపూజోత్సవం వేడుకలు అన్ని స్థాయిలలోను బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరింపచేసి సాయంత్రం మండల కేంద్రాలలో జరిగిన నిరసన ర్యాలీలలో 5000మంది ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసి కలెక్టరుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. జిల్లా స్థాయిలో విద్యాశాఖ నిర్వహించిన అవార్డులు ప్రధానోత్సవ కార్యక్రమానికి అవార్డులు పొందిన 27మంది బహిష్కరించి ఉద్యమానికి బాసటగా నిలబడటం తో బహిష్కరణ జయప్రదమైంది.

సెప్టెంబర్ 9వ తేదీన 5వేలమందితో మహాధర్నాకు ప్రిపర్ అవుతుండగా జెఏసి జిల్లా చైర్మన్ హరనాథ్, సెక్రటరీ సిహెచ్. శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము సూర్యారావు జోక్యంతో సెప్టెంబర్ 6వ తేదీ సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో చర్చలు జరిగాయి. చర్చలలో మన సంఘ పక్షాన యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.జయకర్, బి.గోపిమూర్తి పాల్గొన్నారు. ఏపిటిఎఫ్-257, ఏపిటిఎఫ్-1938, ఎస్‌టియు, పిఆర్‌టియు, డిటిఎఫ్, ఆపస్, బిటిఏ, ఏపిపిటిఏ, పిఇటి, వైఎస్ఆర్‌టిఎఫ్, ఎంబిటిఎఫ్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరు TLM ప్రదర్శన రద్దుకు అంగీకరించి పాఠశాలలకు పరిమితం చేయడం, బయోమెట్రిక్ పాఠశాలలోనే వేసుకోవటానికి పనిచేయని పక్షంలో మాన్యువల్ సంతకాలు చేసుకోవటానికి, బయోమెట్రిక్ హాజరు పేరుతో జీతాలు నిలుపుదల చేయబోమని, రెమిడియల్ తరగతులు సాయంత్రం పూట మాత్రమే నిర్వహించు టకు, చనిపోయిన ఉపాధ్యాయునికి నిబంధన మేరకు ఎక్స్‌గ్రేషియో చెల్లించ డానికి చర్యలు చేపట్టడానికి అంగీకరిస్తూ ఉపాధ్యాయులను అవమానపరుస్తూ ఎటువంటి వ్యాఖ్యనాలు చేయలేదని వివరణ ఇవ్వడం జరిగింది. మినిట్స్ వ్రాతపూర్వకంగా ఇవ్వడంతో ఆందోళన వాయిదా వేయుట జరిగింది.

## పాఠకుల అభిప్రాయాలు పంపండి

**"ఐక్యఉపాధ్యాయ"** మాసపత్రిక ఉపాధ్యాయ సమస్యలు, ఉద్యమాలతో పాటు అనేక సామాజిక, ఆర్థిక, అకడమిక్ అంశాలపై వ్యాసాలు ప్రచురిస్తోంది. కథలు, కవితలతో పాటు పలు శీర్షికలు నిర్వహిస్తోంది. వీటిపై పాఠకుల ప్రతిస్పందనను ఆహ్వానిస్తున్నది. పత్రికలో ప్రచురితమైన అంశాలపై మీ అభిప్రాయాలు మరియు ఏ అంశాలు వుంటే బాగుంటుందో మా దృష్టికి తీసుకు వస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. మీ అభిప్రాయాలు క్లుప్తంగా, సూటిగా ఉత్తరాల ద్వారాగానీ, మెయిల్ ద్వారాగానీ తెలియ జేయగలరు. **ఉత్తరాల ద్వారా .... "ఐక్యఉపాధ్యాయ"**, యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారివీధి, గవర్నరుపేట, విజయవాడ-520002. **E-Mail** : **ikyopadhyaya1975@gmail.com**కి పంపవచ్చు.

**- సంపాదకవర్గం**

# సదస్సులు - సమావేశాలు

**శ్రీకాకుళం జిల్లా**

### సెల్ఫ్ ఫైనాన్స్ పాఠశాలలను తిప్పికొట్టాలి

**పాలకొండ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ బడులను దివాలా తీయించి ఏర్పాటు చేయనున్న సెల్ఫ్‌ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ పాఠశాలల ను తిప్పికొట్టాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు సూచించారు. యుటిఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7,8 తేదీల్లో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. దీనిలో భాగంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలుసుకున్నారు. అలాగే పాఠశాలల్లో పనిచేయని బయోమెట్రిక్ యంత్రాలను పరిశీలించారు. బయోమెట్రిక్ యంత్రాలు నిర్వహించే విధానాన్ని వివరించే కరపత్రాలను, విద్యుత్ కేటగిరీలు మార్చే ప్రొసీడింగ్ కాపీలను ఆయా పాఠశాలల హెచ్‌ఎం లకు అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడులను దివాలా తీయించే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్నారు. యుటియఫ్ ఆధ్వర్యంతో తిప్పికొట్టాలని, యుటిఎఫ్ మండల బాధ్యుల కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.షన్ముకరావు, పి.కాంతారావు, టి.ఎన్.శివాజీ, ఎస్.నాగరాజు, వై.పుష్పనాధం, ఎస్.మల్లేసు పాల్గొన్నారు

**విజయనగరం జిల్లా**

### జిల్లాలో విస్తృతంగా స్టడీ సర్కిల్స్

విజయనగరం జిల్లాలో సెప్టెంబర్ నెలలో విజయనగరం, గజపతి నగరం, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురంలలో స్టడీ సర్కిల్స్ జరిగాయి. గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ స్టడీ సర్కిల్సులో పలు తాజా అంశాలపై చర్చించటం జరిగింది. "పెద్దనోట్ల రద్దు ఎవరికి లాభం? ఎవరికి నష్టం" అనే అంశంపై సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ పెద్దనోట్ల రద్దు తరువాత దేశంలో 70 లక్షలమంది అసంఘటిత కార్మికులకు ఉపాధి పోయిందని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లకు అనుకూలంగా దేశాన్ని తయారు చేయాలన్న మల్టీ నేషనల్ కంపెనీల లక్ష్యంలో భాగంగానే మోడీ నోట్ల రద్దుకు శ్రీకారం చుట్టారని సమాజంపై భారీ ప్రభావం ఉంటుందని ఈ వాస్తవాలను మేధావులు, ప్రజలు, ఉపాధ్యాయులు అవగాహన చేసుకోవాలని అన్నారు.

బొబ్బిలి, సాలూరులలో "సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఎడ్యుకేషన్ యాక్ట్–2017" పై స్టడీసర్కిల్స్ జరిగాయి. విజయగౌరి, ప్రసన్నకుమార్‌లు ఈ అంశంపై మాట్లాడారు.

గజపతినగరంలో "ఎందుకింత అసహనం" అంశంపై కె.శేషగిరి మాట్లాడారు. పార్వతీపురంలో "ప్రమాదంలో ప్రజాస్వామ్య విలువల"పై సదస్సు జరిగింది. అన్ని స్టడీసర్కిల్స్ సెంటర్లలో అవగాహన పెంచు కొనుటకు అంశాలపై చర్చించడం తాజా పరిణామాలను అర్థం చేసు కోవడం కోసం ఈ అంశాలు దోహదపడ్డాయని పలువురు అభిప్రాయ పడ్డారు.

**విశాఖపట్నం జిల్లా**


### సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ యాక్ట్‌ను వెనక్కి తీసుకోవాలి



సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్ట్ 2017ను వెనక్కి తీసుకోవాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము డిమాండ్ చేశారు. స్థానిక యుటియఫ్ కార్యాలయంలో సెప్టెంబర్ 9న నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు విద్యారంగాన్ని అప్పగించాలని చూస్తోందని, దీనికి చట్టబద్ధత కల్పించడం కోసం ఈ యాక్ట్‌ను తీసుకువస్తుందన్నారు. ఈ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 17 రాష్ట్రాల్లోనూ, కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లోను సిసిఇ విధానాన్ని తొలగిం చాలని డిమాండ్ చేశారు. హైస్కూల్స్, యుపి స్కూల్స్‌లో నాన్ టీచింగ్, కంప్యూటర్ సిబ్బందిని నియమించాలన్నారు. 398 ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియం పుస్తకాలు తక్షణమే అందించాలని, మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యుటియఫ్ జిల్లా అధ్యక్షులు వై.ఎ.ఆర్.కె. ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి కెకె జాజులు కార్యదర్శి నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు ఎస్.ఎస్.నాగమణి, దాసరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ప్రభాకర్, అలీ, మహేష్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



**అనంతగిరి :** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము అన్నారు. సెప్టెంబర్ 18న యుటిఎఫ్ మండల అధ్యక్షులు

ఎస్.రాంబాబు ఆధ్వర్యాన చిలకలగెడ్డ, శివలింగపురం, టోకూరు, బొర్రా, అనంతగిరి బాలికల పాఠశాల-1,2ను ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాము మాట్లాడుతూ సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్‌రూల్స్ వర్తింపజేయాలని, 2013 పిఆర్‌సి బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు మల్లేశ్వరరావు, కె.రఘు, రామారావు, ఎస్.నాగేష్, పాఠశాల హెచ్ఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తూర్పుగోదావరి జిల్లా**

**బాలల హక్కులను కాలరాసేలా ప్రభుత్వ నిర్ణయాలు**

**అయినవల్లి :** బాలల హక్కులను కాలరాసేలా విద్యారంగంలో ప్రభుత్వ నిర్ణయాలు ఉంటున్నాయని, ఇవి ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదని యుటియఫ్ జిల్లాశాఖ ప్రధానకార్యదర్శి టి.కామేశ్వర రావు ఆరోపించారు. యుటియఫ్ అయినవిల్లి మండల శాఖ కౌన్సిల్ సమావేశం గోసంకి బంగ్రారాజు అధ్యక్షతన జరగగా కామేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలుచేసే వివిధ కార్యక్రమాలకు విద్యార్థులను ఉపయోగించి ర్యాలీలు చేసి వారి హక్కులు హరిస్తున్నా యన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలు కనుమరుగై కార్పొరేట్ రంగానికి విద్యారంగం మళ్లిపోతుందన్నారు.

అనంతరం రేషనలైజేషన్, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, నిరంతర సమగ్ర మూల్యాంకనం, సర్వీసు నిబంధనలు వంటి అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించారు. మండలంలో గతేడాది 10వ తరగతి పరీక్షల్లో పదికి పది పాయింట్లు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. సంఘ కార్యదర్శి నివేదికను బి.శ్రీని వాసరావు, ఆర్థిక నివేదికను ఎం.రామకృష్ణ, సంక్షేమ పథక నివేదికను బైరిశెట్టి శ్రీను ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యురాలు గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

**అయినవిల్లి మండల మహాసభ**



తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి మండలంలో సెప్టెంబర్ 17న మండల మహాసభ జరిగింది. ఈ సమావేశానికి జి.బంగ్రారాజు అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధానకార్యదర్శి టి.కామేశ్వరరావు హాజరై బదిలీలు, ప్రమోషన్స్, పాఠశాలల స్వయం ప్రతిపత్తి విద్యా చట్టం మొ॥ అంశాలపై మాట్లాడారు. జడ్‌పిటిసి జి.కాశీ అన్నపూర్ణ, జిల్లా కార్యదర్శులు జె.సత్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు కె.సత్యనారాయణ, పివివి సూర్యనారాయణ తమ సందేశాలను ఇచ్చారు. జె.సత్యనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించి మండల ఎన్నికలు నిర్వహించారు. గౌరవాధ్యక్షులు కె.కాశీ పతి, అధ్యక్షులు జి.బంగ్రారాజు, అసోసియేట్ అధ్యక్షులు హెచ్‌కె కుమారి, డి.శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి బి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.రామకృష్ణ ఎన్నికైనారు.

**రామచంద్రపురం మండల మహాసభ**

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం శ్రీమతి ఇందిరాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల చాకలిపేట, రామచంద్రపురంనందు యుటియఫ్ పట్టణశాఖ మహాసభ మరియు 2017-18 సం॥నకు నూతన కౌన్సిల్ ఎన్నిక సమావేశం సెప్టెంబర్ 20న జరిగింది.

ఈ సమావేశమునందు యుటియఫ్ పట్టణశాఖ అధ్యక్షులు సిహెచ్‌వివి సత్యనారాయణ మూర్తి, ప్రధానకార్యదర్శి జివి హనుమాన్, గౌరవాధ్యక్షులు వై.అప్పారావు, అసోసియేట్ అధ్యక్షులు జి.ఈశ్వరరావు, సిహెచ్. చంద్రకాంతం, కోశాధికారి డి.వీరేంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

మహిళా ఉపసంఘ సభ్యులుగా ఎంఏఆర్ సంధ్యావళి, సిహెచ్. చంద్రకాంతం, వి.లక్ష్మీప్రసన్న, ఎన్ఎస్ పద్మావతి, ఆర్.జ్యోతిలను ఎన్నుకోవడమైనది.

**పశ్చిమగోదావరి జిల్లా**

**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను బహిష్కరించిన ఉపాధ్యాయులకు అభినందన**

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక అయ్యి సెప్టెంబర్ 5వ తేదీన హాజరుకాని 27 మంది ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 10వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3గం॥లకు స్థానిక ఐఏడిపి హాలునందు సన్మాన సభ ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖాధికారి టి.ఎస్.బాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ రాము సూర్యారావు, ప్రాజెక్టు అధికారి బ్రహ్మానందరెడ్డి, జెఏసి చైర్మన్ ఆర్.ఎస్.హరనాధ్, డివైఈవోలు ఉదయకుమార్, ఆర్.ఎస్ నాగేశ్వర రావు సురేష్ కార్యాలయపు ఏడి కె.వి రమణ హాజరయ్యారు. 27 మంది ఉపాధ్యాయులని ఘనంగా సన్మానించారు. విద్యాశాఖ సన్మాన కార్యక్రమం ముగిసినతరువాత ఉపాధ్యాయ జెఏసి ఆధ్వర్యంలో జిల్లా జెఏసి చైర్మన్ ఆర్.ఎస్ హరనాధ్ అధ్యక్షత అభినందన కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమానికి ఘనమైన చరిత్ర ఉందని ఉపాధ్యాయ ఉద్యమం ద్వారా ప్రభుత్వాలనే మార్చగల శక్తి ఉందని ఉపాధ్యాయ సంఘాల పోరాటాన్ని అభినందించారు. జెఏసి చైర్మన్ హరనాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగ ఉద్యమం ద్వారా ఉపాధ్యాయుల ఆత్మాభిమానాన్ని నిలబెట్టుకోగలిగామని మిగిలిన సమస్యల పరిష్కారం కోసం కూడా కృషి చేస్తామని హామీ ఇచ్చినారు. యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక అయిన 27 మంది అవార్డు గ్రహీతలు ఉద్యమానికి అండగా నిలబడటం వలనే విజయం సాధించగలిగామని భవిష్యత్తులో

కూడా ఉపాధ్యాయులంతా ఉద్యమానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఉద్యమానికి సహకరించిన ఎమ్మెల్సీ రాము సూర్యారావుగారికి, జిల్లా జెఏసి చైర్మన్ ఆర్.ఎస్ హరనాధ్, జి.శ్రీధర్, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ, జిల్లా అధ్యక్షులు పి.జయకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపీమూర్తి, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఏ సాల్మన్‌రాజు, ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలలర్ ప్రతాపరాజు, పిఆర్‌టియు రాష్ట్ర నాయకులు పి.ఆంజనేయులు, ఎపిటిఎఫ్1938 జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కృష్ణ, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.నరహరి, ఎన్.శ్రీనివాసరావు, వైఎస్ఆర్ టిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.సుధీర్, బిటిఏ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వర రావు, ఎపియుఎస్ రాజ్‌కుమార్, ఎపిపిటిఏ ధర్మరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.

**గుంటూరు జిల్లా**

**ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను అమలు చేయాలి**




ఉమ్మడి సర్వీసురూల్స్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. సెప్టెంబర్ 17న రెవెన్యూ కళ్యాణ మండపంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్య నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వాలు సంస్కరణలు చేపడుతున్నాయన్నారు. స్వయం పోషక, స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 ముసాదా రాష్ట్రంలో విద్యను మరింతగా కార్పొరేటీకరణ చేసే దిశగా ఉందన్నారు. మున్సిపల్ టీచర్ల సర్వీసు రూల్స్‌పై ఇప్పటి వరకూ స్పష్టత లేదని, తక్షణమే సర్వీసు రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మోడల్ స్కూల్స్ నిర్వహణపై కేంద్రం చేతులెత్తేసిందని, కార్పొరేట్ పాఠశాలలతో పోటీ పడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న మోడల్ స్కూల్స్ నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలన్నారు. మోడల్ స్కూల్స్‌లోని ఉపాధ్యాయులకు ప్రతి నెలా వేతనాలను 010 పద్దు ద్వారా విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రెండు విడతల డిఏ తక్షణమే విడుదల చేయాలని, ఎయిడెడ్ స్కూల్స్‌లో పదోన్నతులు, నియామకాల్లో చోటు చేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ప్రభుత్వ విద్యారంగ రక్షణ కోసం యుటిఎఫ్ కార్యకర్తలు విద్యారంగంలోని సమస్యలపై మరింతగా అధ్యయనం చేయాలని, ప్రభుత్వంతో పోరాడాలన్నారు.

మాజీ ఎమ్మెల్సీ కెయస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మండలాలు, పట్టణాల్లో సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగుల సామాజిక భద్రతకు ముప్పుగా పరిణమించిన సిపిఎస్ విధానం రద్దు కోసం యుటిఎఫ్ బలమైన ఉద్యమాలు నిర్మించాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న డిటెన్షన్ విధానం వల్ల డ్రాపౌట్స్ పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రణాళికా సంఘం స్థానంలో ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలో పాఠశాలల రద్దు, విలీనం జరుగుతుందని, ఇది విద్య ప్రైయివేటీకరణ ను మరింత తీవ్రతరం చేస్తుందన్నారు.

రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎన్.తాండవకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులకు నూతన పిఆర్‌సి వేయాల్సిన సమయం ఆసన్నమైందని, కానీ ఇప్పటికీ పాత పిఆర్‌సి తాలూకా ఎరియర్లు విడుదల చేయలేదన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు కార్యదర్శి నివేదిక, కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్ ఆర్థిక నివేదిక ప్రవేశపెట్టారు. తొలుత సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశంలో సీనియర్ నాయకులు వి.విశ్వనాథం, కెఎస్‌వి దుర్గారావు, జి.ప్రభుదాసు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎ.నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షు లు ఎండి గౌస్, సహాధ్యక్షులు విజయసారధి, ఆదిలక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి పోరాట ఫలితమే**

**కామన్ సర్వీస్ రూల్స్ - యుటియఫ్**



ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయ సంఘాలు సుదీర్ఘకాలంపాటు ఉమ్మడిగా చేసిన పోరాటాల ఫలితంగానే కామన్ సర్వీస్‌రూల్స్ వచ్చాయని యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగ మల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌కు సంబంధించిన జిఓ నం.72,73,74 విడుదలైన సందర్భాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 21న యుటియఫ్ జిల్లా కార్యాలయంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్వీస్‌రూల్స్ సాధనకోసం యుటియఫ్ తరపున అటు పోరాటాలు, ఇటు కోర్టులో కేసులు సమాంతరంగా నడపడ ఎంతో జరిగిందన్నారు.

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గతంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల తరపున రాష్ట్రపతి ప్రతిభాపాటిల్‌ను కలిసి సర్వీస్‌రూల్స్ సాధనకు సహకరించవలసినదిగా కోరడం, ఆమె సానుకూలంగా స్పందించడం, ఆ కల ఇప్పటికి సాకారం కావడం-1-జరిగిందని

ఏది ఏమైనా ఇప్పటికైనా ఇది ఫలప్రదం కావడం అభినందనీయమని అన్నారు.

రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎన్.తాండవకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సుదీర్ఘ నిరీక్షణ ఫలించిందని, ఇటు పోరాటం, అటు ప్రభుత్వం కూడా సహకరించిందని ధన్యవాదాలు తెలిపారు. ఫ్యాప్టో చైర్మన్ బాధ్యతలు కూడా యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు చేపట్టడం అభినందనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎండి గౌస్, కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు ఎం.కళాధర్, జి.శివ పూర్ణయ్య, పి.ఐ.పౌల్‌రాజు, విద్యావికాస వేదిక రాష్ట్ర కన్వీనర్ జి.ప్రభు దాసు తదితరులు పాల్గొన్నారు.

**విద్య కార్పొరేటీకరణ - విద్యను పేదలకు దూరం చేయడమే**

విద్యావికాస వేదిక గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో విద్యావికాస వేదిక రాష్ట్ర కన్వీనర్ జి.ప్రభుదాసు అధ్యక్షతన విద్యా సదస్సు జరిగింది. ఈ సమావేశంలో స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017, ఆంధ్రప్రదేశ్ విద్యారంగం దశ-దిశ అనే రెండు అంశాలపై సెమినార్ నిర్వహించారు.

స్వయం పోషక పాఠశాలల చట్టం-2017పై మాజీ ఎమ్మెల్సీ కెవిఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ అసెంబ్లీ ఉభయ సభల్లో ఎటువంటి చర్చా జరగకుండా సభల్లో ఆమోదం పొందకుండా, గవర్నర్ సంతకం పెట్టకుండానే అది చట్టం ఎలా అయిందో అర్థం కావట్లేదని, ప్రభుత్వమే దానిని చట్టంగా పేర్కొనడం సరికాదని అన్నారు. ఈ చట్టంలో పాఠశాలలు ఏర్పాటుకు ఎటువంటి నియమనిబంధనలు లేకుండా, ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేసుకునేవిధంగా, పెంచుకునే విధంగా, విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చే విధంగా, లాభార్జనే ధ్యేయంగా ఈ చట్టంలో అంశాలున్నాయని, ఇటువంటి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ విద్యారంగం దశ-దిశ అనే అంశంపై యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర విద్యారంగం యొక్క నడక ప్రైవేటు రంగం దశను దాటి కార్పొరేట్‌వైపు వెళ్ళే విధంగా ఉందని, అటువైపు మళ్ళించే ఆలోచనలనుండే రేషనలైజేషన్ పేరిట స్కూల్స్ మూసివేయడం, రకరకాల పథకాల పేరుతో విద్యారంగాన్ని ప్రయోగశాలగా మార్చి పాఠశాలలను దివాలా తీయించే ప్రయత్నం చేస్తున్నారని దీనిని మేధావులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు ఎదుర్కోవలసిన అవసరం ఉందని అన్నారు.

విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డి.రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ విద్య అందరికీ అందుబాటులో ఉండేవిధంగా చూడాల్సిన ప్రభుత్వం ఈ చట్టం ద్వారా పేదలకు చదువు దూరం చేసి, ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే విధంగా ప్రయత్నం ఉందని దీనిని ఎదుర్కొని పోరాటం చేయాలని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల సంఘం రాష్ట్ర నాయకులు యం. రవీంద్రబాబు, ఏపి అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా నాయకులు కె.వెంకటేశ్వరరావు ఈ చట్టాన్ని వెంటనే ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. ఈ సెమినార్‌లో వి.పాములురెడ్డి (రిటైర్డ్ ఎంఇఓ), పుట్టి శంకరరావు (రిటైర్డ్ హెచ్‌ఎం), వి.విశ్వనాథం (యుటియఫ్ సీనియర్ నాయకులు), యుటియఫ్, ఏపిటిఎఫ్, డిటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, పిడిఎస్‌యు తదితర సంఘాల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

**అచ్చంపేట :**



సెప్టెంబర్ 18న యుటియఫ్ అచ్చంపేట, క్రోసూరు మండలాలు సంయుక్త ఆధ్వర్యంలో "స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017" అంశంపై స్టడీ సర్కిల్‌ను అధ్యయన కేంద్రం, క్రోసూరులో నిర్వహించుట జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా యుటియఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు కె.నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శులు బి.నరసింహారెడ్డి, ఎ.నాగకుసుమ కుమారి, యు.రాజశేఖర్, యుటియఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**నెల్లూరు జిల్లా**

**సిపిఎస్‌ను రద్దు చేయాలి**



సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న స్థానిక యుటియఫ్ కార్యాలయంలో మున్సిపల్ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకపోతే కేంద్ర, రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలన్నింటిని కలుపుకొని ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

పదో పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 11వ పిఆర్‌సి కమిటీని నియమించాలని, అదే విధంగా రెండు విడతల డిఏ బకాయిలను చెల్లించాలని, ఉద్యోగుల ఫ్రెండ్లీ గవర్నమెంటు అని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అన్ని పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియంలు కొనసాగించాలన్నారు.

టిడిపి ప్రభుత్వం తెలుగు మీడియంను రద్దు చేయడం శోచనీయ

మన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే హెచ్‌ఎంలరే డ్రాయింగ్ పవర్‌తోపాటు అన్ని అధికారాలను కల్పించాలన్నారు. జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని, స్పౌజ్, అంతర్‌జిల్లా, మేనేజ్‌మెంట్ బదిలీలు చేపట్టాలని, ఉద్యోగోన్నతులను కల్పించాలని కోరారు. ఎయిడెడ్ ఉద్యోగోన్నతులలో పారదర్శకతను పాటించాలన్నారు. ఎస్ఏ-1 పరీక్షా పేపర్లు పాఠశాల లకు పంపిణీ చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.తులసీ రాంబాబు, ఎన్.నవకోటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు ఎన్.వి.సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ఎం.సి.అచ్చయ్య, టి.వాసుదేవ రావు, రవికిరణ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**చిత్తూరు జిల్లా**

## కార్పొరేటీకరణ వైపే సర్కారు అడుగులు



**శాంతిపురం :** విద్యారంగం నుంచి తప్పుకుని పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టే దిశగా ప్రభుత్వాల అడుగులు పడుతున్నాయని ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. విద్యావికాస వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కుప్పం డివిజన్ విద్యా సదస్సులో వారు పాల్గొన్నారు. విద్యను అందించాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వాలు దూరం అయితే సమాజంపై దాని దుష్ప్రభావాలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మెల్సీ విఠపు హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఒక్కటిగా ఉంటే ఈ ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తప్పదని భావించిన పాలకులు ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. విధులు, హక్కులు రెండు కళ్లుగా భావించాలన్నారు.

స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017 చట్టాన్ని భేషరతుగా రద్దు చేయాలని ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. ఈ చట్టం అమలులోకి వస్తే ప్రైవేట్ విద్యా సంస్థలు 12 శాతం వరకూ ఫీజులను స్వతంత్రంగా పెంచుకునే అవకాశం ఉందన్నారు. ఆయా పాఠశాలపై ప్రభుత్వాలు, కోర్టులకు కూడా నియంత్రణ లేని పరిస్థితి వస్తుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల హక్కులకు భంగం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపా ధ్యాయులు, ఉద్యోగులకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు.

జిల్లాలో అన్ని ప్రాంతాల్లోనూ బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో 50 శాతం మందిని రిలీవ్ చేసినా కుప్పంలో రిలీవ్ చేయలేదా? దీనికి మినహాయింపును ఇవ్వటంతో బదిలీ అయినవారు ఇబ్బందులు పడుతున్నారని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి అన్నారు. ఎంఇఓ వెంకటరమణ, యుటియఫ్ నాయకులు డి.కృష్ణయ్య, రఘుపతిరెడ్డి, సోమశేఖరనాయుడు, నాగరాజు, ఎస్‌టిఎఫ్ నాయకుడు శ్రీనివాసన్, ఏపిటిఎఫ్ నాయకుడు రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ సొమ్ము చెల్లించాలి




**పలమనేరు :** ఈ సంవత్సరం జూన్, జులై నెలలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ (ఫైనల్ పేమెంట్) మొత్తాన్ని వెంటనే చెల్లించాలని యుటియఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పలమనేరులోని సంఘ కార్యాలయంలో జరిగిన యుటియఫ్ డివిజన్ కోర్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ పరిధిలోని జెడ్‌పి పరిధిలోనే ఉండగా వారి సొమ్ము చెల్లింపును ట్రెజరీ ఆంక్షలు పేరుతో నిలిపివేయడం సరికాదన్నారు. ఈ సొమ్మును జీతాల చెల్లింపుకు బదలాయించినట్లు తెలుస్తున్నదని ఇది సమంజసం కాదని అన్నారు.

అదే విధంగా పార్ట్‌ఫైనల్ ఋణాలకు దరఖాస్తు చేసుకొన్న వారికి వాటిని వెంటనే మంజూరు చేయాలన్నారు. బదిలీ అయి రిలీవుకానివారి స్థానాలకు ప్రమోషన్‌లిచ్చి వెంటనే వారిని రిలీవ్ చేయాలన్నారు. బదిలీల అనంతరం అన్ని జిల్లాల్లో ప్రమోషన్ల ప్రక్రియ పూర్తవుతున్నదని, చిత్తూరు జిల్లాలో కూడా వాటిని చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శులు సిపి ప్రకాష్, సుధాకర్‌రెడ్డి, గురుమూర్తి, జివి రమణ, డివిజన్ నాయకులు పాపయ్య, క్రిష్ణమూర్తి, ఆంజప్ప, బషీర్ ఆహ్మద్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కులుకాదు సృజన ప్రధానం
## పాఠశాల విద్యలో మార్పు రావాలి



**గంగవరం (మం) :** యుటియఫ్ గంగవరం మండలశాఖ సమావేశం జెడ్‌పిహెచ్‌ఎస్ గంగవరంలో సెప్టెంబర్ 6న జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాసులు రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల

సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానంలో మార్కుల ఆధారంగా విద్యార్థుల ప్రతిభను గుర్తించటం సరికాదన్నారు. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని, సృజనాత్మకతను వెలికితీసినప్పుడే వారిలోని నిజమైన సృజనాత్మకత బయట పడుతుందన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు, సమాజం దృష్టికూడా మారాల్సి వుందన్నారు.

ఈ కార్యక్రమంలో గంగవరం మండలంలోని 14 ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు యుటియఫ్ కార్యకర్త పి.సుధాకరరెడ్డి ద్వారా ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి, ఎంఇఓ శాంతకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదవాలి : ఎమ్మెల్సీ

**బైరెడ్డిపల్లి :** విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం సూచించారు. విద్యావికాసంలో భాగంగా సెప్టెంబర్ మండలంలోని బేలుపల్లి, మోడల్ స్కూల్, కెజిబివి, బైరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బట్టీ చదువులు చదవకుండా అర్థం చేసుకుని చదవాలని సూచించారు. ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీల్లో రోజుకో జీవో తెచ్చి ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట యుటిఎఫ్ మాజీ రాష్ట్రకార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి, ప్రకాష్, పాపయ్య, ఎపిసిపిఎస్ఇఎపి ఉద్యోగులు శశిధర్, జనార్ధన్ గుప్త పాల్గొన్నారు.

### సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి



**చిత్తూరు అర్బన్ :** ఉపాధ్యాయ, ఉద్యోగులకు శాపంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి అన్నారు. సెప్టెంబర్ 21న యుటియఫ్ జిల్లా కార్యాలయం లో డివిజన్‌స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకూ అందరినీ కలుపుకుని ఉద్యమాలు చేస్తామ న్నారు. అలాగే స్వయం పోషక స్వతంత్ర పాఠశాల చట్టం-2017ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధి కోసం కుప్పం ప్రాంతంలో ప్రవేశపెట్టిన ఇషా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేశారని, దీంతో హైస్కూల్ అకడమిక్ పరంగా తీవ్ర సమస్యలు వస్తున్నా దీనిపై పునరాలోచించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గత బదిలీల్లో రిలీవ్‌కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, పిఆర్‌సి, డిఏ అరియర్లు చెల్లించాలని, 2008 హామీ పత్రాల వారికి పిఆర్‌సిలో ఏర్పడిన అసంబద్ధతను పరిష్కరించాలని, 398 స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీస్‌రూల్స్ విడుదలైన నేపథ్యంలో వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.సోమశేఖర నాయుడు, జిల్లా కార్యదర్శులు కనకా చారి, రఘుపతిరెడ్డి, ఆడిట్ కన్వీనర్ శేఖర్, ఐరాల, పూతలపట్టు, యాదమరి, పెనుమూరు మండలాల అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

## కడప జిల్లా

### పేద విద్యార్థుల కడుపుగొడుతున్న ఇస్కాన్



పేద విద్యార్థుల కడుపుగొడుతున్న ఇస్కాన్ సంస్థ అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉందని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆరోపించారు. వారానికి 3సార్లు గుడ్డు విద్యార్థులకు అందించాల్సి వుందని, ఇస్కాన్ సంస్థ పిల్లలకు గుడ్లు ఇవ్వకపోవడం తగదన్నారు. నాసిరకమైన భోజనం ఒకే విధమైన రుచితో విసిగిపోయి విద్యార్థులు భోజనం తినడం లేదన్నారు. కార్పొరేషన్ పరిధి పేద విద్యార్థుల కడుపు మాడుస్తున్న ఇస్కాన్ సంస్థ దోపిడీని అరికట్టాలంటే వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకొని భోజన సరఫార ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నాగయ్య ప్రాథమికోన్నత పాఠశాలలో 250మంది విద్యార్థులుంటే 50మంది విద్యార్థులు మాత్రమే భోజనం చేస్తున్నారంటే నాసిరకంగా ఉందనటానికి ఇంతకన్న నిదర్శనం ఏం కావాలన్నారు. గుడ్డు సరఫరా పేరుతో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.6.18పైసలు రు.4.13 పైసలకు తగ్గించటం కార్మికులకు చెల్లించాల్సిన సొమ్మును దోచు కోవటమే అన్నారు. ప్రభుత్వం న్యాయంగా చెల్లించాల్సిన రూ. 6.18 పైసలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్‌వి సుబ్బరాజు మాట్లాడుతూ పిల్లలకు అందిస్తున్న నాసిరకమైన బియ్యం బదులు ఏపి రైస్ (సన్నబియ్యం) అందించాలని కోరారు. ఇప్పుడు అందిస్తున్న బియ్యంతో చేస్తున్న అన్నం తినలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాల పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగ్గా అందించటానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కె.గంగన్న, రామాంజనేయులు, సివి రమణ, టి.మురళీ తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

**ఉమ్మడి పోరాటాల ఫలితమే ఉమ్మడి సర్వీస్‌రూల్స్**



**ఎమ్మిగనూరు :** ఉమ్మడి పోరాటాల ఫలితంగానే ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌ను సాధించు కున్నామని యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు పేర్కొన్నారు. స్థానిక మానవ వనరుల శిక్షణా కేంద్రంనందు యుటియఫ్ జిల్లా కార్యదర్శి జె.యల్లప్ప అధ్యక్షతన జరిగిన "విద్యాచైతన్య సదస్సు" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యుటియఫ్ రాష్ట్ర గౌరవా ధ్యక్షులు ఎన్.నరసింహుడు మాట్లాడుతూ 17 సం॥లుగా అనేక సంఘాలను కలుపుకొని యుటియఫ్ చేసిన ఐక్యఉద్యమాల పోరాటాల ఫలితమే ఉమ్మడి సర్వీస్‌రూల్స్ సాధన అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని హైకోర్టు, సుప్రీంకోర్టులలో పోరాటం చేసి ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌ను సాధించుకున్నామని, ఉమ్మడి సర్వీస్‌రూల్స్ రావడం వలన ఉపాధ్యాయ రంగంలో ద్వితీయశ్రేణి ఉపాధ్యాయ స్థానం నుండి డైరెక్టరేట్‌స్థాయి వరకు వెళ్ళే అవకాశం వుంటుందని పేర్కొన్నారు. సిపిఎస్ ఉద్యమం తీవ్ర రూపం చేస్తామని సిపిఎస్‌కు వ్యతిరేకంగా కర్నూలు నుండి శ్రీకాకాకుళం వరకు జీపు జాత చేపట్టి ఐక్య ఉద్యమం ద్వారా సిపిఎస్ రద్దు అయ్యేవరకు పోరాడుతామని పేర్కొన్నారు.

అనంతరం ఎమ్మిగనూరు రూరల్ మరియు అర్బన్ మండలాల యుటియఫ్ మండలశాఖలను ఎన్నికల అధికారి నాగమణి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు క్రిష్ణమూర్తి, జిల్లా కార్యదర్శులు హనుమంతు, భాస్కర్ మరియు రాష్ట్ర నాయకులు దావీదు, ప్రకాష్, రాఘవేంద్ర, రాజు, రవికుమార్, దేవపాల్, లక్ష్మన్న, వీరభద్రయ్య, హసీన, జయమ్మ, తులసమ్మ, రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా**

**కార్పొరేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వాల ఊడిగం**




**ఉరవకొండ :** విద్యారంగంలో నూతన విధానాలతో పేద, మధ్య తరగతి వర్గాలను చదువుకు దూరం చేస్తూ ప్రభుత్వాలు కార్పొరేట్ విద్యా సంస్థలకు ఊడిగం చేస్తున్నాయని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్ విమర్శించారు. ఉరవకొండలో సెప్టెంబర్ 9న యుటియఫ్ ఆధ్వర్యంలో జోనల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల చట్టం-2017ను తీసుకు రావడానికి ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం డిటెన్షన్ విధానాన్ని రాష్ట్రాల మీద బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సుధాకర్, ఉపాధ్యక్షులు గోవిందరాజులు, యుటియఫ్ నాయకులు సంజీవ, శర్మాస్, రామప్పచౌదరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

# రచయితలకు ఆహ్వానం

సృజనాత్మకత, అభ్యుదయ భావజాలం కల్గిన రచనలను ఐక్య ఉపాధ్యాయ పాఠకులకు అందిం చాలనే లక్ష్యంతో కథలు, వ్యాసాలు, కవితలు పంపవలసిందిగా రచయి తలను ఆహ్వానిస్తున్నాము. సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించే ఏ అంశాన్నైనా వస్తువుగా తీసుకుని రచనలు పంపండి. అనుకరణ, అనువాదం కాకుండా స్వీయ రచన అయి ఉండాలి. హామీ పత్రం జత పరచండి. ప్రచుర నార్హమైన రచనలను సమయాను కూలంగా "ఐక్య ఉపాధ్యాయ" లో ప్రచురిస్తాము. రచనతోపాటు రచయిత ఫోటో, చిరునామా, ఫోన్ నంబరు పంపండి. **- సంపాదకవర్గం, ఐక్యఉపాధ్యాయ**

**రచనలు పంపవలసిన చిరునామా :**
**చీఫ్ ఎడిటర్, ఐక్యఉపాధ్యాయ,** 27-31-11, గవర్నపేట,
పాలపర్తివారి వీధి,
విజయవాడ- 520002
మెయిల్ : *ikyopadhyaya1975@gmail.com*

## యుటియఫ్ సీనియర్ నాయకులు కర్రా జకర్య మృతికి సంతాపం

యుటియఫ్ గుంటూరు జిల్లా సీనియర్ నాయకులు కర్రా జకర్య (85) మృతికి యుటియఫ్ గుంటూరు జిల్లాశాఖ నివాళులర్పించింది. డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డిఐఓఎస్)గా పదవీ విరమణ చేసిన జకర్య సర్వీస్‌లో ఉన్న కాలంలో యుటియఫ్‌లో నిబద్ధత కలిగిన కార్యకర్తగా పనిచేశారని యుటియఫ్ నాయకులు అన్నారు. గుంటూరు వేళాంగిణి నగర్‌లోని ఆయన నివాసంలో ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. యుటియఫ్ సీనియర్ నాయకులు వి.విశ్వనాథం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంత రావు, రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, విద్యావికాస వేదిక రాష్ట్ర కన్వీనర్ జి.ప్రభుదాసు, సీనియర్ నాయకులు సిహెచ్.బ్రహ్మం, రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎన్. తాండవ కృష్ణ తదితరులున్నారు.

# జిల్లా/మండల కార్యవర్గ సమావేశాలు

**శ్రీకాకుళం జిల్లా**

**ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి**




**హిర మండలం :** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సిహెచ్ రవీంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నకోరాడ పాఠశాల ఆవరణలో యుటియఫ్ కార్యవర్గ సమావేశం సెప్టెంబర్ 11న నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రవీంద్ర మాట్లాడుతూ పిఆర్‌సి బకాయిలపై సిఎం నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. విద్య, ఉపాధ్యాయ సమస్యలపై యుటియఫ్ పోరాడుతోందన్నారు. యుటియఫ్ బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని కోరారు.

కార్యదర్శి ప్రకాశరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నష్టాన్ని చేకూర్చే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక :**

యుటియఫ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా ప్రధానకార్యదర్శి రవీంద్ర సమక్షంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బి.వాసుదేవ్, అధ్యక్షులు ఎల్‌వీ రమణ, సహాధ్యక్షులు ఆర్.చిన్నబాబు, ఇందిర, ప్రధానకార్యదర్శి గా ఎ.కోటేశ్వరరావు, కోశాధికారిగా ఎన్.శంకరరావు, ఆడిట్ కన్వీనర్‌గా భవానీశంకర్, అకడమిక్ కన్వీనర్‌గా అసిరేశ్వరరావు, కార్యదర్శులుగా పదిమందిని, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**విజయనగరం జిల్లా**

**నెలవారీ పదోన్నతులు ఇవ్వాలి**

సెప్టెంబర్ 17న స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో యుటియఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి మాట్లాడుతూ డిఇఓ స్కూల్ అసిస్టెంట్ మరియు తత్సమాన కేడర్‌లకు, పిఎస్‌హెచ్ఎంలకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని, తక్షణమే సీనియార్టీ జాబితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రూ. 398/- ఉపాధ్యాయుల నోషనల్ ఇంక్రిమెంట్లు, హామీ పత్రాల ఉపాధ్యాయుల వేతన వ్యత్యాసాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు.

జిల్లా గౌరవాధ్యక్షులు అల్లూరి శివవర్మ మాట్లాడుతూ ప్రభుత్వం రోజుకో ఉత్తర్వు ఇస్తూ గందరగోళం చేస్తున్నాయన్నారు. సెలవుల విషయమై ప్రభుత్వ ఉత్తర్వులు సరికాదన్నారు. జిల్లా సహాధ్యక్షులు జి.నిర్మల మాట్లాడుతూ సానిటరీ నాప్కిన్స్‌పై జిఎస్‌టి ఎత్తివేయాలన్నారు. కోశాధికారి జె.రమేష్ చంద్రపట్నాయక్ మాట్లాడుతూ సిపిఎస్ పై పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శులు ఏలూరి రాములప్పడు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఏ.సత్య శ్రీనివాసు, జి.పార్వతి, పి.ప్రసన్నకుమార్, పి.లక్ష్మణ, ఎస్.నాగరాజు, ఏ.కుసుమన్న, చింతా భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో అన్ని శాఖల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

**తూర్పుగోదావరి జిల్లా**

**ప్రాంతీయ కార్యవర్గ సమావేశం**




**చింతూరు :** యుటియఫ్ ప్రాంతీయ కార్యవర్గ సమావేశం సంఘం కార్యాలయం చింతూరులో జరిగింది. సమావేశానికి యుటియఫ్ కుటుంబ సంక్షేమ డైరెక్టర్ సోడె నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి పండా కృష్ణయ్య, రాష్ట్ర కౌన్సిలర్ యం.కవిత హాజరయ్యారు. కృష్ణయ్య మాట్లాడుతూ యుటియఫ్ నిర్మాణాన్ని నియమ, నిబంధనల ప్రకారంగా నిర్మించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ ఉద్యమాల్లో సాధారణ ఉపాధ్యాయుణ్ణి భాగస్వాముల్ని చేయాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ యం.కవిత మాట్లాడుతూ మహిళలను ఉద్యమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని కోరారు.

ఈ సమావేశానికి బివి ప్రసాద్, కె.ప్రభాకర్, బి.నాగేశ్వరరావు (ఎటపాక), పి.కన్నారావు, యువి రావు, ఎ.నాగేశ్వరరావు, కె.శ్రీను, యం.రాంబాబు (కూనవరం), పి.రాజారావు, యన్.రామకృష్ణ, యన్.జగదీశ్, యం.భీమయ్య, యన్.ప్రసాద్ (వి.ఆర్.పురం), కె.భీమయ్య, పి.లలిత, టి.వెంకటయ్య (చింతూరు) తదితరులు హాజరయ్యారు.

**కృష్ణా జిల్లా**

**సిపిఎస్ విధానం రద్దు చేయాలి**

సిపిఎస్ విధానం రద్దు చేయాలి, ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌ను వెంటనే విడుదల చేసి వివిధ క్యాడర్స్‌లలో ప్రమోషన్స్ ఇవ్వాలని యుటియఫ్ కృష్ణా జిల్లా కార్యవర్గం తీర్మానం చేసింది. సెప్టెంబర్ 17న విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో యుటియఫ్ కృష్ణా జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్

ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని, సమస్యలపై వివిధ స్థాయిలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేసిన ప్రాతినిధ్యాలను వివరించారు. సర్వీస్ రూల్స్‌ను విడుదల చేసి అన్ని క్యాడర్స్‌లలో ప్రమోషన్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు.

జిల్లా ప్రధానకార్యదర్శి కెపి ఉమామహేశ్వరరావు కార్యదర్శి నివేదికను, కోశాధికారి ఎ.కృష్ణసుందరరావు ఆర్థిక నివేదికను సమర్పించారు. జిల్లా కార్యదర్శులు, వివిధ మండలాల నుండి వచ్చిన కార్యవర్గ సభ్యులు నివేదికలపై చర్చించి ఆమోదం తెలపడంతో పాటు వారివారి మండలాల నివేదికలను కూడా సమర్పించినారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.రమేష్, పి.లీల, పి.ఎస్.కోటేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షు లు జివి తాతారావు, జిల్లా సహాధ్యక్షులు ఎంఎస్‌సి రాజు, కె.భగీరధి మరియు జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.


**చిత్తూరు జిల్లా**

**యుటియఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం**



సెప్టెంబర్ 10న చిత్తూరు జిల్లా యుటియఫ్ భవన్‌నందు జిల్లా కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎన్.సోమచంద్రారెడ్డి, గౌరవాధ్యక్షులు రాధకృష్ణ, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎన్.సోమశేఖరనాయుడు, ఎన్.గుణశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు ముత్యాలరెడ్డి, రవిప్రకాష్, కనకాచారి, రమణ, పట్టాభి, పి.చిన్నసామి, సుధాకరరెడ్డి, మధు, సాంబశివం, శేఖర్ మునిరత్నం, సుధాకరనాయుడు, కృష్ణమూర్తి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**హెచ్‌ఆర్‌ఏ పెంపులో వదలివేసిన గ్రామాలను చేర్చాలి**




**పమలనేరు :** ఇంటి అద్దె అలవెన్సు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 12% నుండి 14.5%కి పెంచుతూ జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, పుత్తూరు, నగరి మున్సిపాలిటీ 8 కి.మీ. పరిధిలోని గ్రామాలను చేర్చుతూ జిల్లా పాలనాధికారి గెజిట్ విడుదల చేయటం వల్ల యుటియఫ్ పలమనేరు డివిజన్ హర్షం వ్యక్తం చేసింది. అయితే పలమనేరు మున్సిపాలిటీకి సంబంధించి 8 కి.మీ.కంటే తక్కువ దూరమున్న గ్రామాలను వదలివేశారని వీటిని మలిజాబితాలో చేర్చి ఆయా గ్రామాలలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యుటియఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆర్ & బి అధికారులచే పరిశీలింపచేసి గెజిట్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శులు, పి.సుధాకరరెడ్డి, గురుమూర్తిశెట్టి, సిపి ప్రకాష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాజుద్దీన్, ఉమామహేశ్వరరెడ్డి, మండల నాయకులు దయానందు, విజయకుమార్, ఆనంద్, వేమ చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**అనంతపురం జిల్లా**

**సంఘ బలోపేతానికి కృషి చేయండి**



సెప్టెంబర్ 21న యుటియఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ డా॥ గేయానంద్ మరియు రాష్ట్ర కార్యదర్శి కా॥మహమ్మద్ జిలాన్ హాజరైనారు. ఈ సమావేశంలో గేయానంద్ మాట్లాడుతూ యుటియఫ్ సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జిలాన్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా సభ్యత్వాలు, జనరల్‌ఫండ్‌లు పూర్తి చేయాలని, సభ్యత్వాల కొరకు ప్రతి మండలంలోని ప్రతి పాఠశాలను ప్రతి ఉపాధ్యాయుడిని సభ్యత్వం జనరల్‌ఫండ్‌లు అడగాలని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అనేక ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు వున్నాయని వాటిపై ప్రాతినిధ్యం చేయాలని సమస్యలు పరిష్కారమయ్యే దిశగా ఉద్యమించాలని అన్నారు.

జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్‌వి రమణయ్య కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. వాటిపై చర్చను పెట్టారు. అలాగే 'ప్రజాశక్తి' పత్రికను ప్రతి ఒక్క యుటియఫ్ కార్యకర్త తీసు కోవాలని కార్యకర్తలకు తెలపాలని అన్నారు. రాష్ట్ర కేంద్రం నుంచి వచ్చిన సర్క్యులర్‌ను చదివి విన్పించడ మైనది. అలాగే భవననిధి బకాయి తీర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

జిల్లా గౌరవాధ్యక్షులు సికె నాగేంద్రబాబు మాట్లాడుతూ డిఇఓ కార్యాలయాలతోపాటు, ఏపిజిఎల్‌ఐసి, జిల్లా పరిషత్, డిఎంహెచ్‌ఓ ఆఫీసుల్లో గల సమస్యల పరిష్కారానికి ఒక పోరాటము చేయాలన్నారు. ఈ సమావేశంలో సహాధ్యక్షులు గోవిందరాజులు, కోశాధికారి జయ చంద్రారెడ్డి, కార్యదర్శులు కోటేశ్వరప్ప, ఈశ్వరయ్య, రూత్, రామప్ప చౌదరి, ఆడిట్ కన్వీనర్ సాయినాథ్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు సరళలు పాల్గొన్నారు.

# నిరసనలు - ధర్నాలు

**విజయనగరం జిల్లా**

**గౌరీలంకేష్‌పై హత్యను ఖండిస్తూ గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో బహుముఖ కార్యక్రమాలు**

విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురంలలో ప్రముఖ జర్నలిస్టు మత సామరస్య వేదిక నాయకులు గౌరీలంకేష్‌పై జరిగిన హత్యను ఖండిస్తూ సదస్సులతో పాటు నిరసన, మౌన ప్రదర్శనలు జరిగాయి.

విజయనగరంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రజాసంఘాలు కోట జంక్షన్ నుండి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హత్యను తీవ్రంగా ఖండిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని నినదించారు.

బొబ్బిలిలో గాంధీ విగ్రహం నుండి ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఐక్యవేదిక, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నిరసన ప్రదర్శన నిర్వహించారు. జర్నలిస్టులపై హత్యలను ఆపాలని, రక్షణ కల్పించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురంలో మానవహారం నిర్వహించారు.

**పశ్చిమగోదావరి జిల్లా**

**మున్సిపల్ కార్యాలయంలో ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కారం కోసం ఆందోళన**

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సి2 క్లర్క్ నిర్లక్ష్యం కారణంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం మున్సిపల్ కమీషనర్‌కి ధర్నా నోటీసు ఇవ్వడం జరిగింది. ధర్నా నోటీసుకు స్పందించిన కమీషనర్ కె.సాయిరామ్ గారు చర్చలకు ఆహ్వానించారు. చర్చల్లో కమీషనర్ సమస్యలుపై పరిష్కారం కోసం వ్రాతపూర్వక హామీ ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా ఉపాధ్యాయుల సమస్యలుకు కారణంగా ఉన్న టువంటి సి2 గుమస్తాను బదిలీ చేసి, శాఖాపరం అయిన చర్యలు తీసుకోవడానికి మరియు ఇతర సమస్యలు 7 రోజుల్లో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. హామీలో భాగంగా సి2 నుండి సి4 సెక్షన్ కి మార్చడం జరిగింది.

చర్చల్లో యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపీమూర్తి, జిల్లా కార్యదర్శులు ఎకెవి రామభద్రం, ఎం.వెంకటేశ్వరరావు, కె.రాజశేఖర్, శ్రీనివాసన్ మరియు పట్టణ నాయకులు పాల్గొన్నారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన ఎమ్మెల్సీ రాము సూర్యారావు గారికి, రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ గారికి పట్టణ ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేసారు.

**గుంటూరు జిల్లా**

**లంకేష్ హత్యకు నిరసనగా యుటియఫ్ కొవ్వొత్తుల ర్యాలీ**

దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో ఉందని, వాస్తవాలు మాట్లాడే వారిని హత్య చేసేందుకూ కొందరు వెనకాడ్డం లేదని యుటియఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగేమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు ఆందోళన వెలిబుచ్చారు. గౌరీ లంకేష్ హత్యకు నిరసనగా యుటియఫ్ ఆధ్వర్యంలో బ్రాడీపేట యుటియఫ్ కార్యాలయం నుండి శంకర్‌విలాస్ సెంటర్‌వరకు సెప్టెంబర్ 9న కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామిక హక్కులను దుర్మార్గంగా అణిచివేస్తూ నియంతృత్వ పోకడలతో మతతత్వ వాదులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భారత ప్రజాస్వామ్యానికి భిన్నత్వం కొండంత అండ అని, దీన్ని భరించలేని శక్తులు అసహనంతో ప్రశ్నించే వారిని గొంతు నొక్కడాన్ని అందరూ ఖండించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కోశాధికారి ప్రేమ్‌కుమార్, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎన్.తాండవకృష్ణ, జిల్లా కార్యదర్శులు ఎం.కళాధర్, సిహెచ్.ఆదినారాయణ, ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్‌వి జగదీష్‌కుమార్, నాయకులు కె.విజయభాస్కర్, కె.వెంకటేశ్వరరావు, బురాన్ అలి, ఎన్.వెంకటేశ్వరరావు, మదనమోహన్, జాన్‌బాబు, శంకర్ సింగ్, విద్యావికాస వేదిక రాష్ట్ర కన్వీనర్ జి.ప్రభుదాసు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

**పోస్టింగ్‌ల ఇవ్వడం జాప్యం తగదు**

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందిన భాషా పండిట్‌లకు పోస్టింగ్‌లు కల్పించడంలో విద్యాశాఖ జాప్యం చేయడం తగదని, వెంటనే ఇవ్వాలని ఫ్యాప్టో జిల్లా కన్వీనర్, యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. వెంటనే భాషా పండిట్‌ల రీ-కౌన్సిలింగ్‌ను నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 9న కలెక్టరేట్ ఎదుట ఆర్‌యుపిపి, ఎస్‌ఎల్‌టిఎ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసనకు ఆర్‌యుపిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ సమయంలో భాషాపండిట్‌లకు ప్రత్యేకంగా రీకౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించి ఇంతవరకు చేపట్టలేదని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ ఉపాధ్యాయులను ఇంతవరకు పాఠశాలల నుంచి రిలీవ్ చేయలేదని తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఈ విషయంలో ఘోరంగా విఫలైమందన్నారు.

ఇప్పటికైనా భాషా పండిట్‌లకు న్యాయం చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎస్‌టియు జిల్లా కార్యదర్శి తిమ్మన్న, ఎపిఎన్‌జిఒ సంఘం జిల్లా నాయకులు లక్ష్మినారాయణ, ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు మరియానందం, పిఆర్‌టియు జిల్లా నాయకులు రామకృష్ణ, జిటిఎ నాయకులు హుస్సేన్, డిటిఎఫ్ నాయకులు అల్లాబక్షు, అమరావతి జెఎసి నాయకులు అశోక్‌కుమార్, బిసిటియు నాయకులు భాస్కర్ యాదవ్ మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారి స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందిన భాషాపండిట్‌లకు పోస్టింగులివ్వకుండా నిలిపేయడం తగదన్నారు. వెంటనే పోస్టింగులివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎల్‌టిఎ జిల్లా నాయకులు యోగేశ్వరరెడ్డి, మద్దిలేటి, యుటిఎఫ్ జిల్లా నాయకులు రవికుమార్, జయరాజు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై ప్రాతినిధ్యాలు

**పశ్చిమగోదావరి జిల్లా**

## గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లు ఇవ్వాలి-యుటియఫ్



పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన ఏకీకృత సర్వీసు రూల్స్ జీవోలను ది. 22-09-2017న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు " స్టేటస్ కో" ఇచ్చిందని దీని కారణంగా ఏకీకృత సర్వీసు రూల్స్ జీవోలు నిలుపుదల చేయుబడుట వలన పూర్వపు సర్వీసు రూల్స్‌ను అనుసరించి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల కౌన్సిలింగ్‌ను జిల్లా స్థాయిలో నిర్వహించుటకు అవకాశం ఉన్నందున పాఠశాలల అడ్మినిస్ట్రేషన్ మరియు సంబంధిత ప్రమోషన్లు పొందాల్సిన ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని సత్వరమే గ్రేడ్ -2 ప్రధానో పాధ్యాయుల ప్రమోషన్ కౌన్సిలింగ్‌ను నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబ్జీ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, బి.గోపీమూర్తిలు ఒక ప్రకటనలో కోరారు.

**గుంటూరు జిల్లా**

## ఉపాధ్యాయుల బిల్లుల మంజూరులో జాప్యం ఉండదు డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్



ఉపాధ్యాయుల బిల్లుల మంజూరులో జాప్యం ఉండదని, పారదర్శకత పాటిస్తామని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ ఎన్.సదాశివ రావు హామీ ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎన్.సదాశివ రావుకు యుటియఫ్ జిల్లా కమిటీ సెప్టెంబర్ 12న అభినందనలు తెలియజేసింది. ఈ సందర్భంగా ఎన్.సదాశివరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ఖజానా కార్యాలయాలలో పారదర్శకత పాటిస్తూ బిల్లుల సత్వర మంజూరుకు ప్రాధాన్యత నిస్తానని తెలియజేశారు. బాపట్ల ఖజానా కార్యాలయంలో పెండింగ్‌లో వున్న మున్సిపల్ ఉపా ధ్యాయ బిల్లుల మంజూరు సమస్యను సత్వరమే పరిష్కరిస్తానని తెలియజేశారు. డిప్యూటీ డైరెక్టర్‌ని కలసినవారిలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, జిల్లా కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.డి.గౌస్, జిల్లా కార్యదర్శులు శివపూర్ణయ్య, పి.ఐ.పౌల్‌రాజ్, ఎన్.వి.జగదీష్ కుమార్‌లున్నారు.


## జెపిపిఎఫ్ ఖాతాలకు అప్‌డేట్ చేయాలి సిఇఓని కలిసి యుటియఫ్ విజ్ఞప్తి

ఉపాధ్యాయులకు సంబంధించిన జెడ్‌పిపిఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలని యుటియఫ్ జిల్లా నాయకత్వం జిల్లా పరిషత్ సిఇఓని కలిసి సెప్టెంబర్ 27న వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గుంటూరు జిల్లా సిఇఓగా బాధ్యతలు చేపట్టిన నాగార్జున సాగర్‌ని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యుటియఫ్ జిల్లా నాయకత్వం మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిఎఫ్ లోను పెట్టుకొన్న సందర్భంలో చివరి నెల వరకు పిఎఫ్ ఖాతాలు అప్‌డేట్ కాకపోవడం వల్ల మంజూరులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రతినెలా పిఎఫ్ ఖాతాలు అప్‌డేట్ చేయడం వల్ల ఈ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ పిఎఫ్ ఖాతాలన్నీ అప్‌డేట్ అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించారు. సిఇఓని కలిసిన వారిలో యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, గౌరవాధ్యక్షులు ఎండి గౌస్, జిల్లా కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు జి.శివపూర్ణయ్య, ఎం.కళాధర్, సీనియర్ నాయకులు కె.విజయ భాస్కర్ తదితరులు హాజరయ్యారు.

**చిత్తూరు జిల్లా**

## మెడికల్ బిల్లులను త్వరితగతిన ఖరారు చేసి పంపాలి



యుటియఫ్ జిల్లాశాఖ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి రవి కుమార్ నాయుడిని కలిసి గత ఆర్థిక సంవత్సరాలు అనగా 2012-13కు మునుపు 2013-14 తరువాత ఇంనూ జమకాని మిస్సింగ్ క్రెడిట్స్ ఖాతాలకు త్వరితగతిన సర్దుబాటు చేయాలని వినతి చేయడమైనది. వెంటనే స్పందించిన సిఇఓ రేపు నెలనందు ఒక షెడ్యూల్ ప్రకటన చేసి తప్పక జమ చేయగలమని తెలిపారు. పిదప ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్‌ని కలిసి ఉపాధ్యాయులు, ఉద్యోగుల మెడికల్ బిల్స్ త్వరితగతిన పరిశీలన చేసి సకాలంలో డిఇఓ కార్యాలయమునకు పంపవలసినదిగా వినతిపత్రం సమర్పించడమైనది. చివరిగా ఏపిజిఎల్ఐ కార్యాలయమునకు వెళ్లి సూపరిండెంట్ తిమ్మారెడ్డిని కలిసి గత సంవత్సరం అక్టోబరు 2016 నుండి జమ కావలసి ఏపిజిఎల్ఐ నగదును వ్యక్తిగత ఖాతాలకు వెంటనే జమ చేయవలసినదిగా విన్న వించడమైనది. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎం. సోమశేఖరనాయుడు, జిల్లా కార్యదర్శి కనకాచ్చారి, ఆడిట్ కన్వీనర్ శేఖర్, కార్యకర్తలు వెంకట్రమణ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉత్తర్వులు

1. మున్సిపల్, పంచాయితీరాజ్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు అర్థ జీతపు సెలవు నగదు చెల్లింపు ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.118**/Pension-I/**2012; తేది.23.08.2017**
2. పాఠశాలల్లో నేషనల్ డీ-వార్మింగ్ డే నిర్వహించుటకు సూచనలు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.2081/**DD(ABCD)/MDM**/2015; తేది.08.09.2017**
3. పాఠశాలల్లో బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ అమలు గురించి సూచనల ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.58**/IT-Cell(PMU)**/2016; తేది.08.09.2017**
4. పే ఫిక్సేషన్‌కై డిఎస్‌సి-2008, డిఎస్‌సి-2012లలో నియామకం పొందిన ఉపాధ్యాయుల వివరాలు కోరుట గురించి
**ప్రభుత్వ మెమో నం.350684**/Ser.-III/A.I**/2016; తేది.11.07.2017.**
5. పే ఫిక్సేషన్‌కై డిఎస్‌సి-2008, డిఎస్‌సి-2012లలో నియామకం పొందిన ఉపాధ్యాయుల వివరాలు కోరుట గురించి
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.3150/**Esst.III/**2015; తేది.13.09.2017**
6. నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరుకై 1990-96 మధ్య నియామకం పొందిన స్పెషల్ టీచర్ల సర్వీస్ వివరాలు కోరుట గురించి.
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.443/**Esst.III(D1-12)**/2009;; తేది.13.09.2017**
7. మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యాలయమ్ (నేచర్ క్యూర్ హాస్పిటల్), వెంకటపాలెం, అమరావతి, గుంటూరు జిల్లాకు రిఫరల్ ఆసుపత్రి గుర్తింపు ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.154; తేది.12.09.2017**
8. సమ్మెటివ్ ఎసెస్‌మెంట్-1 పరీక్ష రద్దు ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.3/**B/C&T/SCERT**/2016; తేది.14.09.2017**
9. మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అధికారాల బదలాయింపు ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.339; తేది.14.09.2017**
10. దసరా సెలవులు గురించి సవరణ ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.473/**A&1/**2017; తేది.18.09.2017**
11. రివైజ్ పే స్కేల్స్-2015లో ప్రభుత్వ ఉద్యోగులకు అప్పులు మరియు అడ్వాన్సులు చెల్లింపు ఉత్తర్వులు
**జిఓ ఎంఎస్ నం.167; తేది.20.09.2017**
12. ఆం.ప్ర. పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్ & రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ ఆర్డర్,1975) - పాఠశాల విద్యలో లోకల్ కేడర్స్ ఆర్గనైజేషన్ ఉత్తర్వు
**జిఓ ఎంఎస్ నం.72; తేది.20.09.2017**
13. ఆం.ప్ర. ఎడ్యుకేషనల్ సర్వీస్‌రూల్సు
**జిఓ ఎంఎస్ నం.73; తేది.20.09.2017**
14. ఆం.ప్ర. ఎడ్యుకేషనల్ సబార్డినేట్ సర్వీస్‌రూల్సు
**జిఓ ఎంఎస్ నం.74; తేది.20.09.2017**
15. 2017-18 సంవత్సరానికి మోడల్ పాఠశాలలకు స్కూల్ గ్రాంట్స్ విడుదల ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.670/**APMS/**2017; తేది.20.09.2017**
16. ఎయిడెడ్ పాఠశాలలో జరిపిన పదోన్నతులు మరియు అబ్జార్షన్స్‌లో అవకతవకలపై జరుగు విచారణ జరుపుటకు సూచనలు
**పాఠశాల విద్య కమీషనర్ ఉత్తర్వులు ఆర్‌సి నం.90/**PS-I/**2017; తేది.22.09.2017**
17. మున్సిపల్ పాఠశాలల్లో పదోన్నతులు జరుపుటకు సూచనలు మరియు షెడ్యూలు
**మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఉత్తర్వు ఆర్‌సి నం.3276/2017-జె3; తేది.25.09.2017**
18. ఎయిడెడ్ పాఠశాలల్లో పదోన్నతులు, అబ్జార్షన్స్ మరియు నియామకాలపై కొన్ని వివరణల ఉత్తర్వు
**పాఠశాల విద్య కమీషనరల్ ఉత్తర్వులు ఆర్‌సి నం.90/**PS-I/**2017; తేది.26.09.2017**
19. 1983-1996 స్పెషల్ టీచర్స్‌గా నియామకం పొందిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరుకై ప్రతిపాదనల ఉత్తర్వు
**పాఠశాల విద్యాశాఖ జాయింట్ కార్యదర్శి మెమో నం. 29603/**Ser.-II/A.I**/2013; తేది.26.09.2017**
20. దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల మరియు పెన్షనర్స్‌కు సెప్టెంబర్ 27న జీతాలు చెల్లింపు ఉత్తర్వు
**జిఓ ఆర్‌టి నం.1960; తేది.27.09.2017**
21. ట్రెజరీ కార్యాలయాలలోకి బయట వ్యక్తుల ప్రవేశంపై నిషేధం
**ట్రెజరీ డైరెక్టర్ & అకౌంట్స్ సర్క్యులర్ మెమో నం.**AI/**7146/2017; తేది.27.09.2017**
22. పాఠశాల భాగస్వామ్య కార్యక్రమం అమలు మార్గదర్శకాల ఉత్తర్వు
**సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వు ఆర్‌సి నం.26/**SSA/A3**/2016; తేది.27.09.2017**

## పాఠకులకు గమనిక

తెలుగు మాస పత్రికలలో ఇంగ్లీషులో ప్రభుత్వ ఉత్తర్వులు, ఇంగ్లీషులో వ్యాసాలు వంటివి ప్రచురించ రాదని పోస్టల్ శాఖ వారు అభ్యంతరం తెలిపారు. అందువలన ప్రభుత్వ ఉత్తర్వుల నంబరు, వివరాలు మాత్రమే ప్రచురించడం జరుగుతున్నది. ప్రభుత్వ ఉత్తర్వులు యధావిధిగా ప్రచురించడా నికి పోస్టల్ డిపార్టు మెంట్ వారికి, రిజిష్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ వారికి ప్రతి పాదనలు పంపడం జరిగింది. పోస్టల్ పర్మిషన్ కొరకు కృషి చేయడం జరుగుతున్నది. అసౌకర్యానికి చింతిస్తున్నాం. **- సంపాదకవర్గం**